# కథామంజరి



## దీపావళి ప్రత్యేక సంచిక

నవంబరు 2021

కథ

# కథా మంజరి

పది కథల సమాహారం



కథామార్గదర్శి

జయంతి ప్రకాశ శర్మ
సంపాదకుడు

అవసరాల వెంకట రావు
ప్రచురణ కర్త

## దీపావళి ప్రత్యేక సంచిక

నవంబర్ 2021

© Copyright 2020 - Editorial Board Kathamanjari


కథ
ఆహ్వానం

# కథామంజరి శ్రావ్య సంచిక

## ఈ సంచికలో 'గళ' సహకారం అందించిన కళాకారులు

- శ్రీ వెంపటి కామేశ్వరరావు గారు
- శ్రీ పప్పు భోగారావు గారు
- శ్రీ భువనపల్లి రంగనాథం గారు
- శ్రీమతి కరవది సరస్వతి గారు
- శ్రీ బి ఎస్ మూర్తి గారు
- శ్రీమతి శర్వాణి గారు

ఈ నెల శ్రావ్య సంచిక కోసం

**ఇక్కడ నొక్కండి**

# కథామంజరి

## దీపావళి కథల పోటీ ఫలితాలు

---

**ప్రథమ బహుమతి – రూ.5,116/-**

### కదిలే కాలమే జీవితం

రచన – కిరణ్ విభావరి

**ద్వితీయ బహుమతి – రూ.3,116/-**

### వెలుగుకి ఉదయం

రచన – జంధ్యం వెంకటేష్ బాబు

**తృతీయ బహుమతి – రూ.2,116/-**

### ఎటు వైపు


రచన – రమాదేవి నెల్లుట్ల

## ప్రత్యేక ప్రశంస (రూ.516/- చొప్పున) పొందిన కథలు

1) వల్లకాటి వసంతం – బద్రి నర్సన్
2) తోడు – శేష చంద్ర
3) ఈ ప్రశ్నకి బదులేది – తిరుమలశ్రీ
4) మార్పు మొదలైంది – కే. వి. లక్ష్మణరావు
5) నాతిచరామి – లక్ష్మీ గాయత్రి
6) శ్రీకారం – ఎన్ శివ నాగేశ్వరరావు
7) పశువులు-మనుషులు - డా. ఎం సుగుణారావు
8) పూర్వ సువాసినీ దర్శనం – దత్త శర్మ పాణ్యం
9) నాన్న చెప్పులు – భాగవతుల భారతి
10) ఇది కథ కాదు – కొలిచిన జ్యోతిర్లత
11) పరిష్వంగం – జాస్తి రమాదేవి
12) దేవుడేంకావాలి – వసుంధర

మరో 25 కథలు సాధారణ ప్రచురణకు స్వీకరించబడ్డాయి. ఆయా రచయితలకు నేరుగా తెలియచేస్తాం.

ఉత్సాహంగా పాల్గొని, కథల పోటీని జయప్రదం చేసిన రచయిత(త్రి) లకు కృతజ్ఞతలు, ధన్యవాదాలు.



**కథామంజరి బృందం**

# ఇదీ వరస


| సంఖ్య | విషయం | | పేజీ |
|---|---|---|---|
| I | మా జట్టు | | i |
| II | కృతజ్ఞతలు | | ii |
| III | కథా కీయం | | iii |
| IV | విశిష్ట అతిథి | | v |
| V | కథా మార్గదర్శి | | viii |
| | **కథలు** | | |
| సంఖ్య | కథ పేరు | రచన | పేజీ |
| 1 | కదిలే కాలమే జీవితం | కిరణ్ విభావరి | 1 |
| 2 | వెలుగుకి ఉదయం | జంధ్యం వెంకటేష్ బాబు | 9 |
| 3 | ఎటు వైపు | రమాదేవి నెల్లుట్ల | 15 |
| 4 | వల్లకాటి వసంతం | బద్రి నర్సన్ | 21 |
| 5 | తోడు | శేషచంద్ర | 26 |
| 6 | ఈ ప్రశ్నకి బదులేది? | తిరుమలశ్రీ | 32 |
| 7 | మార్పు మొదలైంది | కె.వి. లక్ష్మణరావు | 37 |
| 8 | నాతిచరామి | లక్ష్మీగాయత్రి | 41 |
| 9 | శ్రీకారం | ఎన్. శివనాగేశ్వరరావు | 46 |
| 10 | పశువులు — మనుషులు | డా. ఎం . సుగుణరావు | 51 |
| 11 | పూర్వ సువాసినీ దర్శనం | దత్త శర్మ పాణ్యం | 56 |
| 12 | నాన్న చెప్పులు | భాగవతుల భారతి | 61 |
| 13 | ఇది కథ కాదు | కొలిచిన జ్యోతిర్లత | 63 |
| 14 | పరిష్వంగం | జాస్తి రమాదేవి | 68 |
| 15 | దేవుడేం కావాలి? | వసుంధర | 73 |
| | అనవసరమైన వర్ణణలు, పదాలు, భాషాజాలాలు లేకుండా, కథ కూడా దృశ్యాన్ని అందించగలిగేలా రచనలు చేసిన కీ.శే. అవసరాల రామకృష్ణరావు గారి ఆణిముత్యాల్లోంచి ఓ ముత్యం... ఈ నెల ప్రత్యేక కథగా మీ కోసం! | | |
| 16 | కోట కట్టడం ఎలా? | అవసరాల రామకృష్ణారావు | 78 |



# మా జట్టు

## సాంకేతిక సహకారం

harbinger PUBLISHING

## బొమ్మలు

శ్రీ కొయిలాడ రామ్మోహన రావు

శ్రీ కొచ్చెర్ల వి ఆర్

శ్రీ 'వసంత' కృష్ణ

## సంపాదక సహకారం

శ్రీ ఎం ఎ పద్మనాభ రావు  శ్రీ కృపాకర్ పోతుల

ఈ ప్రత్యేక సంచిక ముఖచిత్రాన్ని అందించిన

**శ్రీ బాలి గారికి**

"కథామంజరి" ప్రత్యేక కృతజ్ఞతలు

# కృతజ్ఞతలు

## ఈ ప్రత్యేక సంచిక ప్రత్యేక దాతలు

మొదటి మూడు బహుమతులు అందచేసినవారు

కీ.శే.పొత్తూరి సాయి కుమారిగారి జ్ఞాపకార్థం వారమ్మాయి

శ్రీమతి పొత్తూరి సునీత గారు

శ్రీ ఎన్ వి డి ఎస్ రాజు గారు

శ్రీమతి నండూరి రేణుక గారు

శ్రీ కోట శ్రీనివాస్ గారు

శ్రీమతి కోట వరలక్ష్మి గారు





# కథాకీయం



టేబుల్ కి రెండోవైపు కూర్చున్నప్పుడే అసలు విషయాలు తెలుస్తాయనే ఓ ఆంగ్ల సూక్తి చదివినప్పుడు తేలిగ్గా తీసుకుంటాం గాని, నిజంగా ఆ అవకాశం వస్తే, ఆ అనుభవం వేరేగా ఉంటుంది. మన సాధరణ జీవితంలోని విషయాలలాగే సాహితీప్రపంచ విషయాలలో కూడా ఈ సూక్తి చాలా అనుభవాలను ఇస్తుంది. అవగాహన పరిధిని పెంచుతుంది. ఎంతో అనుభూతి ఇస్తుంది. కథల పోటీల నిర్వహణ విషయంలో ఈ 'అ ఆ' లు 'కథామంజరి' కి పుష్కలంగానే వచ్చాయి.

తెలుగు వార, మాస పత్రికల స్వర్ణయుగంలో పండగలకి ప్రత్యేక సంచిక కోసం పెద్ద రచయితలచేత ప్రత్యేక కథలు రాయించేవారు. ఆ కథలతోనే ప్రత్యేక సంచికలు ముస్తాబై వచ్చేవి. ఆ పత్రికలలో కథ పడటం అప్పట్లో రచయితలకు గొప్ప గౌరవంగా ఉండేది. ఆ స్థాయికి చేరడానికి కష్టపడేవారు కూడా! మిగతా సమయాల్లో కూడా పత్రికలు కథల పోటీలు నిర్వహించడం ఏభై-అరవై దశకంలో నుండి వస్తున్న ఆనవాయితీనే! అప్పట్లో పోటీ కథలంటే.. తెలుగువారి జీవితాలతో ముడిపడి ఉండాలనే ఓ సూచన కూడా కొండకచో ఉండేది. హృదయాన్ని హత్తుకునే కథాంశాలతో అన్ని రసాల కథలు వచ్చేవి. నిష్ణాతులైన న్యాయనిర్ణేతలు కథల ఎంపిక ప్రక్రియలలో ఉండేవారు. రచయితలు యజ్ఞం చేసినట్టు కథలు రాసేవారు. ఆ యజ్ఞఫలం పూర్తిగా పాఠకుల్ని రంజింపచేసే రీతిలో న్యాయనిర్ణేతలు కృషి చేసేవారు.

కాలానుగుణంగా పోటీలలో మార్పులు వచ్చాయి. రకరకాల కథాంశాలలో పోటీలు నిర్వహిస్తున్నారు. రచయిత అన్నవాడు.. ఏ అంశం మీదనైనా కథ రాయగలగాలనే ఈ ప్రయత్నాలు కూడా విజయవంతం అయ్యాయి.. అవుతున్నాయి కూడా! ఏ కథాంశమైనా మనసుని కుదిపేయగలగాలి, మరోసారి చదవాలనే కోరిక కలిగించగలగాలి, 'మీరీ కథ చదవాలనీ' పదిమందికి చెప్పగలిగేలా పాఠకుడ్ని ప్రేరేపించగలగాలి. భవిష్యత్తులో ఎప్పుడైనా ఆ కథ చదివితే అవే అనుభూతులు కలగాలి. అలాంటి కథలే గొప్పకథలని మన సాహితీ పెద్దలు చెపుతారు. బహుమతులు వచ్చినవే గొప్పకథలు కానక్కరలేదు, పాఠకుడ్ని ఆకట్టుకునే ఏ కథైనా గొప్ప కథే అని వేరే చెప్పక్కర్లేదు.

పూర్వకాలంలో పరీక్షా కాలం అని ఉండేది. అంటే.. విద్యార్థులకు పెద్ద పరీక్షలు, ఉద్యోగులకు ప్రమోషన్ల పరీక్షలు, మిగతా జీవితాలో 'జీవిత పరీక్షలు' .. ఇవి ఎదురైనప్పుడే కష్టపడి చదివేవారు. అలాగే కష్టపడి జీవిత పరీక్షలు ఎదుర్కునే వారు. కాని నేటి ఆధునిక యుగంలో నిత్యం పరీక్షలే.. నిత్యం పోటీలే! అలాగే అన్ని వర్గాలవారికి, అన్ని వయసులవారికి అనునిత్యం ఏదో రకమైన పరీక్షలు, పోటీలు ఎదురవుతున్నాయి! బహుశా ఈ పరిస్థితులకు కథకులు కూడా అతీతులు కాలేకపోతున్నారు. "పోటీ"లకే కలాల్ని సంధిస్తున్నారు. ఏదో ఒకటి రాసి పోటీలలో పాల్గొనాలనే ఉత్సాహం కనబడుతోంది. వాసి కన్నా, రాసికి విలువ ఇచ్చి కథలు అందిస్తున్నారు. ముద్రణ పత్రికలు సంఖ్య వేళ్లతో లెక్కించగలిగే ఈ రోజుల్లో, అంతర్జాల పత్రికలు, సాహితీ సంస్థలు కూడా ముందుకు వచ్చి కథల పోటీలను విరివిగా నిర్వహిస్తున్నారు. ఇది చాలా మంచి పరిణామమే.. రచనలు చేసేవారికి ప్రోత్సాహం, ఉత్సాహం కలగే విషయమే! కాని.. ఒక విషయం విస్పష్టంగా చెప్పాలి. పోటీల సమయాల్లో వచ్చే కథల సంఖ్య ఎక్కువగా ఉన్నా, మిగతా సమయంలో ఆ సంఖ్య బాగా పడిపోతోంది. పోటీలకు వచ్చిన కథలనే దాచుకుని, మిగతా సమయాల్లో వాటిని ప్రచురించుకోవలసిన పరిస్థితి ఈ పత్రికలకు ఎదురవుతు న్న విషయం వాస్తవమని అంగీకరించాలి. పోటీ హడావిడిలో కథ పేరు రాయకుండా పంపినవారు, హమిపత్రం లేకుండా పంపినవారు, కథ లేకుండా హామీ పత్రం పంపినవారు, ఇంకో పత్రిక పేరు రాసి మాకు పంపినవారు.. ఇలా ఎన్నో విషయాలు చదువుకునే రోజుల్లో.. హాల్ టికెట్ మర్చిపోయో, పెన్ను లో ఇంకు వేసుకోకుండానో, పరీక్షలకి పరుగులెత్తిన రోజుల్ని గుర్తుకుతెచ్చాయి.

అందుకే.. మనసులోని మాట పంచుకోవాలనిపించింది.

కథ.. హృదయం స్పందించినప్పుడే రాయాలి.

కథ.. జననం నిత్యం జరుగుతూనే ఉండాలి.

కథ.. ఆబాలగోపాలాన్ని అనునిత్యం అలరిస్తూనే ఉండాలి.

అంతేగాని..

కథ జననానికి "పోటీ" ఆలంబన కాకూడదు.

కథ జననానికి "పోటీ" ఊపిరినివ్వకూడదు.

కథ గుర్తింపుకి కేవలం “పోటీ”యే అర్హత కాకూడదు.

కథకి సమయం, సందర్భం అక్కర్లేదు. నవ్వు వచ్చినట్టే, కన్నీళ్ళు ఉబికినట్టే, కథకూడా హృదాయంతరాల్లోంచి ఉప్పొంగాలి.

ఆ కథే యుగయుగాలు నిలుస్తుంది!

**సంపాదకుడు**

# విశిష్ట అతిథి



## శ్రీ లక్ష్మణ అయ్యర్ రామస్వామి గారు

"దేశ భాషలయందు తెలుగు లెస్స" శ్రీకృష్ణదేవరాయలు వారి ఈ మాట నిత్యం వింటూనే ఉన్నాం. అయినా సరే మన మాతృభాషకి ఈ రోజు తెలుగురాష్ట్రంలోనే మృతభాషగా సమాధుల కడుతున్నారు. కాని మనం కాదనుకుంటున్న మన భాష గొప్పతనాన్ని తెలుసుకుని, భాష నేర్చుకుని, భాషా మాధుర్యాన్ని ఆస్వాదించి, తెలుగుభాషా నిఘంటువునే తయారుచేసిన ఆనాటి బ్రౌన్ దొర నుంచి ఎంతోమంది ఆంధ్రేతర ప్రముఖులు మన భాషకి వన్నె తీసుకుచ్చారు. అయితే 'పెరటి చెట్టు మందుకు పనికి రాదని' మన పాలకులు వదిలేస్తున్నా, భాషని అభిమానించే వాళ్ళు, గౌరవించే వాళ్లు తెలుగువారిలోనే కాదు, ఇతర భాషల వాళ్ళు ఈ కాలంలో కూడా మనకి తారసపడుతున్నారు. అలా అభిమానించి, భాషని నేర్చుకుని తెలుగులో ఉన్నత స్థాయి కథా సాహిత్యాన్ని అందిస్తున్న ప్రముఖులలో శ్రీ లక్ష్మణ అయ్యర్ రామస్వామి గారు అగ్రగణ్యులు. అయితే ఆ పేరు చెపితే ఎవరో అనుకుంటారు గాని "యల్ ఆర్ స్వామి" గానే తెలుగు కథా ప్రియులకు చిరపరిచితులు. కేరళలో స్థిర నివాసములో ఉన్న, తమిళ సాంప్రదాయక కుటుంబంలో పుట్టిన శ్రీ స్వామి గారు, అక్కడే విద్యాభ్యాసం చేసి, ఉద్యోగ రీత్యా విశాఖపట్నం వచ్చి, తెలుగుని నేర్చుకుని, ఈ రోజు తెలుగు సాహితీ ప్రపంచంలో ప్రముఖ రచయితగా పేరు తెచ్చుకున్నారు. "పదో ఏట నుంచే సాహిత్యం మీద ఇష్టం ఏర్పడింది. ఆ వయసులోనే మళయాళం, తమిళం, సంస్కృత పుస్తకాలు చదివేవాడ్ని. ఆ పుస్తక పఠన ప్రభావం అనుకుంటా.. చిన్న చిన్న కవితలు, కథలు అప్పుడే రాయడం మొదలెట్టాను. వైజాగ్లో ఉద్యోగం వచ్చింది. అప్పటికి నా వయసు ఇరవై రెండు సంవత్సరాలు. పెట్టె బెడా పట్టుకొచ్చి ఉద్యోగంలో చేరిన తర్వాతే తెలుగు నేర్చుకున్నాను. చాలా తెలుగు పదాలు సంస్కృత భాషాపదాల్లాగే ఉంటాయి కనుక, తెలుగు మాట్లాడటం సులువుగానే వచ్చేసింది. సాహిత్యం అంటే స్వతహాగా అభిరుచి ఉంది కాబట్టి, ఆ రోజుల్లో ప్రతీ ఆదివారం విశాఖ సాహితి సంస్థ వారి సభలకి వెళ్లి కూర్చునేవాడ్ని! కథలు స్వీయపఠనం ఉండేది. ఆ కథలు వింటుంటే త్వరగానే తెలుగు మాట్లాడటం, అర్ధం చేసుకోవటం వచ్చాయని చెప్పాలి. తెలుగు రాయడం కూడా ఆ కోవలోనే నేర్చుకున్నాను. నిజానికి నన్నయ్యగారి తెలుగు భాషలో ఎక్కువగా

సంస్కృత భాషా పదాలుంటాయి. నాకు చిన్నప్పట్నుంచీ సంస్కృత భాష మీద ఎక్కువ మక్కువ ఉండేది. నన్నయ్యగారి సాహిత్యంలో కనబడే సంస్కృత భాషా పదాలు సుమారుగా తెలుగులో కనబడతాయి! ఆ రోజుల్లో శ్రీకాకుళం మాండలికంలో అడుగు పెట్టుంటే, నాకు భాష అంత త్వరగా వచ్చేది కాదెమో.. భాష మూలాల్లోంచి నేర్చుకున్నాను!" అంటూ మళయాళ యాసలో అచ్చమైన తెలుగులో తన భాషా ప్రస్థానం గురించి చెపుతారు. అలా మొదలైన వారి తెలుగు జీవితం, ఓ రోజ వారు పనిచేసే కోరమాండల్ ఫెర్టిలైజర్స్ కంపెనీలో ఖాళీ సమయంలో ఉద్యోగుల మధ్య ఓ పత్రికలో వచ్చిన కథ మీద సరదాగా చర్చ జరుగుతుంటే.. "ఆ కథ అంత బాగాలేదు. బహుమతి ఇవ్వక్కర్లేదు" అంటూ స్వామి గారు తన అభిప్రాయం కుండబద్దలు కొట్టినట్లు చెప్పారుట. వెంటనే అక్కడున్న ఆయన సహోద్యోగులు "విమర్శంచడం కాదు, కథ రాయగలగాలి" అంటూ ఓ చిన్న సవాలు విసిరారుట. అప్పటికే మళయాళంలో కథలు రాస్తున్న స్వామిగారు, ఆ సవాలును సీరియస్ గా తీసుకుని, నాలుగైదు రోజుల్లో రాసి, పోటి తేది దగ్గరవడంతో వెంటనే పంపారుట. ఆ కథ పేరు "జవాబు లేని ప్రశ్న". తెలుగులో 1988లో ఆయన రాసిన మొట్టమొదటి కథ అది. ఆ కథ రాసి, ముందు ఆ మిత్రులకు చదివి వినిపించారు. ఆంధ్రజ్యోతి వారపత్రిక ఉగాది కథల పోటీకి పంపితే, ఆ కథకి బహుమతి వచ్చింది. అలా ఆయన తెలుగు సాహితి ప్రస్థానం ఓ సవాల్లోంచి ప్రారంభమయిందనే చెప్పాలి.

రసాయనిక శాస్త్రంలో పోస్టుగ్రాడ్యుయేట్ చేసిన శ్రీ స్వామిగారు కొద్ది రోజులు బొంబాయిలో ఓ ఉద్యోగం చేసి, తర్వాత విశాఖపట్నంలో కోరమాండల్ ఫెర్టిలైజర్స్ లో ఉద్యోగం రావడంతో అక్కడికి వచ్చి, స్థిరపడ్డారు. తర్వాత ఎమ్.బి.ఏ.(ఫైనాన్స్) కూడా చేసారు. వాస్తవానికి పాతిక సంవత్సరాల వయసులో తెలుగు నేర్చుకుని, భాష మీద కథలు రాసేటంత పట్టు సాధించారంటే మామూలు విషయం కాదు. రెండు వందల పైచిలుకు కథలు అన్ని తెలుగు పత్రికలోనూ ప్రచురితమయ్యాయి. తెలుగు కథా పితామహులు గురజాడ, చాసో, కారా మాష్టారు, కేతు విశ్వనాథరెడ్డి రాసిన కథలను మలయాళంలోకి అనువదించి, తెలుగు కథావైభావాన్ని చాటి చెప్పారు. ఇవి కాక రెండువందల అరవై మళయాళం కథలను తెలుగులోని అనువదించారు. ఏభై తెలుగు వ్యాస, కథా సంకలాలను, పదహారు మళయాళ పుస్తకాలను ప్రచురించారు. తెలుగులో.. కథాస్వామ్యం, గోదావరి స్టేషన్, సామెత కథలు, మినీ కథలు, లోగుట్టు పెరుమాళ్ల కెరుక, కథాకాశం, అలాగా..అలాగా, మొదలైన సంకలనాలు బాగా ప్రాచుర్యం పొందాయి. అలాగే మళయాళ జానపద గేయాలు, కొండ దొరసాని, కథాకరళం (ఇవి సాహిత్య అకాడమీ కోసం), సూఫీ చెప్పిన కథ, జ్ఞానపీఠ అవార్డు పొందిన శ్రీ ఓ.యన్.వి. కురూప్ గారి 'పురాతన కిన్నెర' పద్యాలకు తెలుగు అనువాదం.. మొదలైన సాహితి కుసుమాలను మళయాళం నుంచి తెలుగులోకి అనువదించారు. అంతే కాదు.. తమిళంలోని అటవిక రాజ్యం, పెరుమాళ్ మురుగన్ గారి నవల అర్ధనారీశ్వరుడు, ప్రాచీన తమిళ సంగీత సాహిత్యం మొదలగు వాటిని తెలుగులోకి అనువదించారు. ప్రఖ్యాత తెలుగు కవులు శ్రీ యన్ గోపి గారి 'కలాన్ని నిద్రపోనివ్వను', శ్రీ శివారెడ్డి గారి 'మోహనా ఓ మోహనా', శ్రీ శిఖామణి గారి కవితలను (ద్రావిడియన్ యూనివర్శిటీ వారి కోసం), శ్రీశ్రీ గారి మోనోగ్రాఫ్..మొదలైన తెలుగు సాహితి కుసుమాలను మళయాళంలోకి అనువదించారు. వీరి రచనలమీద పలువురు

పరిశోధనలు చేసి డాక్టరేట్ లు సాధించారు. తెలుగు, మళయాళ, తమిళ సాహిత్యాల మీద శ్రీ స్వామి గారు పలు విశ్వవిద్యాలయాలు, సాహిత్య అకాడమీలలో అనర్గళంగా ప్రసంగించారు.

ఇక 2015లో శ్రీ స్వామిగారి తెలుగు అనువాదాలకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వచ్చింది. వీరి తెలుగు కథలకు బహుమతులు విరివిగా వచ్చాయి. ఇతరత్రా ఎన్నో అవార్డులను అందుకున్న శ్రీ స్వామిగారి దగ్గర తరగని తెలుగు సాహితీ సంపద ఉంది. ఇప్పటికీ ఇంకా పలు యూనివర్సిటీ విద్యార్థులు వీరి రచనల మీద పరిశోధనలు చేయడమే అందుకు నిదర్శనం.

శ్రీ స్వామి గారి కథలు అన్నీ ఆణిముత్యాలే. కథాంశం, కథనం, శైలి పాఠకుడి చుట్టూ తిరుగుతూ, కట్టి పడేస్తాయి. నిమజ్జనం, షకీల, గుర్రాలు మొదలైన వీరి కథలు చదివి తీరవలసినవే.

తెలుగు, తమిళ, మళయాళ భాషలలో ఎన్నో విశిష్టమైన రచనలు చేసిన, చేస్తున్న శ్రీ యల్.ఆర్. స్వామి గారు కథామంజరి దీపావళి ప్రత్యేక సంచికకు విశిష్ట అతిథిగా విచ్చేసి, బహుమతి కథలను ఎంపిక చేయడం ఓ గొప్ప విషయంగా మేం భావిస్తున్నాం. “కథలలో సహజత్వం బాగా లోపిస్తున్నది. రచయితలు ప్రముఖుల కథలు చదవాలి. ఆ కథల్లో శైలి, కథనాలను ఆకళింపు చేసుకోవాలి. తాను రాసిన కథను పలుమార్లు చదువుకోవాలి. ‘రాసి’ కంటే ‘వాసి’కి విలువ ఇచ్చి కథలు రాస్తే, మంచి కథలు వస్తాయి1” అంటూ చక్కటి అభిప్రాయం కూడా ఇచ్చారు. డెబ్బై అయిదేళ్ళ వయసులో ఏభై ఏళ్ళు తెలుగు సాహిత్యనికే అంకితం ఇచ్చిన శ్రీ స్వామిగారు మరిన్ని రచనలతో తెలుగు, మళయాళ, తమిళ పాఠకలోకాలని అలరిస్తూ.. నిండు నూరేళ్ళు ఆరోగ్యంగా జీవించాలనీ కోరుకుంటూ, శతవిధ కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాం!

కథామంజరి బృందం

# కథా మార్గదర్శి



## శ్రీ అవసరాల రామకృష్ణారావు గారు

చిన్నప్పుడు ఇంట్లో పెద్దవాళ్ళు చెప్పే కథలు విని విని, పదిహేనేళ్ళ ప్రాయంలో ఓ కథ రాసి చందమామకి పంపితే, యథాతథంగా వారు ఆ కథని వేసుకున్నారు. ఆ కథ పేరు "పొట్టి పిచ్చుక కథ". సరిగ్గా మన దేశానికి మరో నెల కాలంలో స్వాతంత్ర్యం వస్తుందనగా.. అంటే జూలై, 1947 సంచికలో ఆ కథ ముద్రణ అయింది. అలా పదిహేనేళ్ళ వయసులో తొలి రచనతో ప్రారంభమయిన రచనా ప్రస్థానం ఎనభై ఏళ్ళ వయసులో కను మూసేవరకు కొనసాగింది. "అసలు ఆ 'పొట్టిపిచ్చుక కథ' నా విజయసూత్రం అవుతుందని నేనెప్పుడూ అనుకోలేదు. పక్షులతో, జంతువులతో మనుషుల్ని కలిపి, సామాజిక విషయాలని సులువుగా చెప్పవచ్చునని తెలుసుకున్నది ఆ కథ వలననే! నిరంతరం చందమామ కథలే నా రచనలకి స్ఫూర్తి అని గట్టిగా చెప్పగలను. నా కథలు, నవలలు.. అన్నిటి వెనుక చందమామ కథలిచ్చిన ఊపే ఉంది. చందమామ .. చందమామే!" అంటారు తెలుగు కథా సాహిత్యంలో తారల మధ్య ఓ చందమామలా వెలిగిన కథారచయిత శ్రీ అవసరాల రామకృష్ణారావుగారు. "నా సైజుతో పాటు చురుకుదనం కూడా ఆ పొట్టి పిచ్చుక లక్షణాలే నాకున్నాయి!" అంటూ తన మీద తానే ఛలోక్తులు విసురుకునే రామకృష్ణారావుగారు అరవై ఐదు సంవత్సరాలు నిరాటంకంగా రచనలు చేసారు. తెలుగుభాషపై ఉన్న పిచ్చి అభిమానంతో మిగతా భాషలు నేర్చుకోలేకపోయానని అనేవారు. అయితే తమాషా ఏమిటంటే ఆయన చాలాకాలం ఒరిస్సా రాష్ట్రంలో పని చేసినా, ఆ భాష వంటబట్టలేదు. రామకృష్ణారావుగారి

"మేథమేట్రిక్స్" చదివినవారెవరైనా ఆయనో లెక్కల మాష్టరు అనుకుంటారు. కాని ఆయన ఆంగ్లభాషలో పోస్టుగ్రాడ్యుయేట్. ఆయన కొద్దికాలం తుని ఎస్సార్ ఉన్నత పాఠశాలలో లెక్కలు, సైన్స్ పాఠాలు చెప్పేవారు. తర్వాత కాలంలో ఒరిస్సా రాష్ట్రంలో ఇంగ్లీషు లెక్చరర్‌గా పనిచేసి, రిటైరయిన తర్వాత విశాఖపట్నం వచ్చి అక్కడ కూడా ప్రైవేటు కాలేజీలో ఇంగ్లీషు పాఠాలు చెప్పేవారు.

రామకృష్ణారావుగారి కథలలో లాగే, మాటలలో కూడా చమత్కారం ఉండేది. "ఒరిస్సా రాష్ట్రంలో దశాబ్దాలు పనిచేసి, ఆ ప్రభుత్వ ఉప్పు తిని, ఇప్పటికీ వారి ఫించను తింటూ, వారి భాషని నేర్చుకోకపోవడం కంటే మించిన పోగాలం, పోయకాలం మరోటి లేదు" అంటూ ఆయనే సరదాగా చెప్పేవారు. అయితే మనం పరదేశ భాషకి ఇస్తున్న ప్రాధాన్యతలో ఒక్క శాతం మన భాషకి గాని, మన పొరుగు రాష్ట్ర భాషలకి గాని ఇవ్వడం లేదని వారు వాపోతుండేవారు. అలా వారి 'జోయెల్' సంభాషణలలో 'సీరియస్ నెస్' కూడా తొంగిచూసేది. ఆయన కథలలో కూడా అంతే! ఆయన రాసిన చందమామ కథలు చదివినా, ఇతర కథలు చదివినా.. పెదవులపై చిరునవ్వుతో పాటు, ఆలోచనల్లోకి నెట్టే మెరుపులు కూడా ఉంటాయి.

రామకృష్ణారావుగారు వెయ్యికి పైగా రచనలు చేసారు. వీటిలో కొన్ని అముద్రితాలు కూడా ఉన్నాయి. ఆయన కథలకి, నవలలకి పెట్టే పేర్లు కూడా తమాషాగా ఉంటాయి. ఆ పేరు చూడగానే కథ చదవాలనిపిస్తుంది. 'అమ్మా ఆకలేస్తోందే', 'ఎంత కురుపుకు అంత సలుపు', 'కళని చెయ్యగలవా ఖూనీ', 'అదిగో మావయ్యా ఆ వెనకే మేరీ', 'కోటకట్టడం ఎలా', 'తమరు తప్పుకుంటే ప్రజలు గట్టెక్కినట్టే', 'మొగాళ్లకుండాలి బుద్ధి' ఇలా ఆయన కథల శీర్షికలు ప్రత్యేకతను సంతరించుకుంటాయి. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు(1969), తెలుగు విశ్వవిద్యాలయం హాస్యరచయిత పురస్కారం (1994), జ్యేష్ఠ లిటరరీ అవార్డు(1998), ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలుగు వైభవ పురస్కారం (2004) వంటి ఎన్నో పురస్కారాలు అందుకున్నారు.

రామకృష్ణారావుగారు కథలలో అంశంతో పాటు తెలుగు మాట విరుపులను కూడా సుందరంగా అద్దారు. ఆయన వాడిన భాష, పదాలు.. ఆయన కథలకి మెరుపులు ఇచ్చాయి. 'ఇట్లు మీ విధేయుడు' అంటూ భరాగో గారు కథ రాస్తే, ఆయనకి సన్నిహిత మిత్రుడుగా, అవసరాల వారు "ఇట్లు మీ అవిధేయుడ్ని" అంటూ సాహసం చేయగలగడంలో వారికి వారే సాటి. వారు మాట్లాడుతున్నట్టే, కథలు రాసేవారు. ఉత్తరాలు కూడా అలాగే రాసేవారు. తన కథల్లో, మాటల్లో,

నడకలో, నడతలో.. పదాలను అందంగా అమర్చి, తురుపు ముక్కల్లా గురి చేయగల సత్తాకు యజమాని శ్రీ అవసరాల రామకృష్ణారావుగారే. ఆయన నిత్యం ఏదో ఒక రచన చేయనిదే నిద్రపోయేవారు కాదు. అదో నియమంగా పెట్టుకుని ఎనభై వసంతాలు ఆయన ఎంచుకున్న బాటలో అందంగా జీవించారు. ఆయన రచనా ప్రస్థానం చందమామలో "పొట్టి పిచుక కథ" తో ప్రారంభమయి, చందమామలోనే నవంబర్ 2011 లో ప్రచురణ ఆయిన "అవిశ్వాసం" కథతో సంపూర్ణం అయ్యింది. మనుషుల మధ్య దూరం పెరిగిపోతూ, నైతిక విలువలకు పూర్తిగా తిలోదకాలు ఇచ్చేస్తున్న ఈ రోజుల్లో గొప్ప విలువలను చాటిచెప్పిన ఆ "అవిశ్వాసం" కథ తప్పకుండా పిల్లల్ని, పెద్దల్ని ప్రభావితం చేస్తుంది.

ఓ అనాథ బాలుడ్ని తన వద్ద ఉంచుకుని, బంధువులా చూసుకుని, తన దుకాణంలో సేవకుడిగా పెట్టుకున్న ఓ వ్యాపారస్తుడు, దశాబ్దాలు గడిచిన తర్వాత, ఇంట్లో బంగారు నగ పోయిందని ఆ సేవకుడ్ని అనుమానించి 'ఏదో పొరపాటున నగ తీసుంటావు, ఎవరికి చెప్పను, నిన్నేం చెయ్యను. ఆ నగని ఎక్కడనుంచి తీసావో అక్కడే పెట్టు!' అంటూ, ఇంట్లో బట్టల మధ్య దొరికిన నగ చూసి, పొరపాటు గ్రహించి "నాదే పొరపాటు.. నీది కాదంటూ' అంటాడు. అప్పటికే మనసు విరిగిన సేవకుడు ఇల్లు వదిలి వెళ్తూ "పొరబాటు మీది కాదు, నాది బాబు.. మీరేమో నన్ను దొంగ అనుకున్నారు, నేనేమో మిమ్మల్ని పెద్దమనిషి అనుకున్నాను.. అంతే!'

ఇది చాలాదూ.. రామకృష్ణారావు గారి కథల లోతులను చవిచూడడానికి!

ఈ నాటికి అవసరాల రామకృష్ణారావుగారు కీర్తితో పాటు అవయవ శేషులు కూడా! నాస్తికుడుగా జీవితాన్ని కొనసాగించి, మరణానంతరం తన శరీరం నలుగురికి ఉపయోగించాలని రాసిపెట్టి, కన్ను మూసినా ఆయన మన మధ్యే నాలుగు రూపాల్లో ఉన్నారు.

యాదృచ్ఛికంగా ఆయన వర్థంతి వచ్చే నవంబర్ నెలలోనే ఆ మహామనిషిని తలుచుకోవడం ఓ ఘనమైన నివాళిగా భావిస్తూ.. వారి కలం నుంచి జాలువారిన ఆణిముత్యాలలో ఓ ముత్యం "కోట కట్టడం ఎలా?" కథని ప్రత్యేకంగా అందిస్తున్నాం.

**కథామంజరి బృందం**

# కథామంజరి దీపావళి కథల పోటీ

# ప్రథమ బహుమతి







## కిరణ్ విభావరి



కేవలం ముప్పై కథలు, నాలుగు కవితలు రచించిన రచయిత్రి – ఈసారి "కథామంజరి" దీపావళి కథల పోటీ మొదటి బహుమతి గ్రహీత "కిరణ్ విభావరి". రాసిన నాలుగు కవితలు ఖండాంతర ఖ్యాతిని ఆర్జించాయి, 'జాషువా కవిత పురస్కారం' తో సహా. మరి కథలు కూచుంటాయా .. అనేక పత్రికల పోటీల ప్రథమ బహుమతులతో బాటు 'తెలుగు తల్లి కెనడా అవార్డు' దాకా గెలిచి, జైత్ర యాత్ర చేశాయి. 'రాసి' కన్నా 'వాసి' మిన్న అన్న ఆర్యోక్తి అర్థం చేసుకున్న ఈ యువ కలం కలకాలం కదం తొక్కాలని "కథామంజరి" ఆకాంక్ష.

# కథామంజరి దీపావళి కథల పోటీలో ప్రథమ బహుమతి పొందిన కథ




## కిరణ్ విభావరి

టీపాయ్ మీద కాఫీ కప్పు వేసిన గుండ్రటి మరకను చేతి వేళ్ళతో సాలోచనగా తుడుస్తూ, తలదించుకుని నేల మీదే కూర్చుంది హారతి. చెంపల మీదుగా ఎండిన కన్నీటి చారలు, ఆమె పసుపు పచ్చని చెక్కిళ్ళ మీద సన్నని కాలువను తలపిస్తున్నాయి.

"సర్దుకుపో తల్లీ...అతనే తప్పు తెలుసుకుని మారతాడులే. వేలికి పుండు వస్తే వేలు కోసుకుంటామా? పుండుకు మందు వేసుకుంటాము గానీ.." అమ్మ కళ్ళొత్తుకుంటూ నచ్చజెబుతోంది. హారతి ఆమె మాటలు వింటున్నట్టు సాలభంజికలా కదలకుండా అలాగే కూర్చుంది.

"గొప్పింటి సంబంధం. పిల్లాడు పైలెట్. అని మమ్మల్ని ఒప్పించి మరీ చేసుకున్నావు కదా. నేనప్పుడే చెప్పాను. ఈ ప్రేమలు గీమలూ మూన్నాళ్ళ ముచ్చటే అని. ఇప్పుడు తెలిసొచ్చిందా? పుట్టిల్లు నీకిక చుట్టాలిల్లే అని గుర్తుంచుకో. వాళ్ళే నీ అమ్మా నాన్న." నాన్న గంభీరంగా చెప్పాడు. ఆమె మనసుకు ఆయన మాటలు ముళ్ళల్లా గుచ్చుకుంటున్నాయి. చిన్నప్పుడు, తనకో చిన్న గాయం అయితే కన్నీరు పెట్టుకునే నాన్న, ఇప్పుడు తన మనసు ముక్కలవుతున్నా పట్టనట్టే ఉన్నాడు.

హారతి ఇంకా తలవంచుకునే ఉంది. చేతి వేళ్ళు టీపాయ్ మీద ఇంకా బలంగా చక్రాలు వేస్తూ ఉన్నాయి. ఆమె పడుతున్న మానసిక వేదనను అర్థం చేసుకుని ఆదరిస్తారు అనుకున్న తల్లీ తండ్రీ సర్దుకుపొమ్మని, మళ్ళీ ఆ నరకంలోకి వెళ్ళిపొమ్మని నిర్దాక్షిణ్యంగా చెబుతుంటే మూగగా రోదించింది.

ఆ ముగ్గురి మధ్య చిక్కటి నిశ్శబ్దం. పారిజాతాలు కింద పడినా వినిపించేటంతటి అరుదైన నిశ్శబ్దం. కాసేపటికి హారతి మౌనంగా లేచి తన గదిలోకి వెళ్ళిపోయింది.

ఇక మాట్లాడేది లేదన్నట్టు చివరిసారి అమ్మను గట్టిగా వాటేసుకొని చెంపలను తడి చేసింది. మళ్ళీ ఆ నరక కూపంలోకి వెళ్ళాలా అని భారంగా అనుకుంటూ, తనతో పాటు తెచ్చుకున్న ఇంకా విప్పని ఆ సూట్ కేసు పట్టుకుని బయటకు నడిచింది.

"ఏమ్మా హారతి...ఎప్పుడొచ్చావు? కనబడలేదే! అల్లుడుగారు రాలేదా? అప్పుడే వెళ్లిపోతునట్టు ఉన్నావు?" అంటూ అనుమానంగా సూట్ కేస్ వైపు చూసింది పక్కింటి రాధిక.

హారతి ఏం మాట్లాడలేదు. పెదవుల మీద విలిసీ విరియని నవ్వు ఒకటి బలవంతంగా తెచ్చుకుంది. ఆ నవ్వు చావు రోదనకు ఏ మాత్రం తీసిపోదు.

"లేదోదిన... పొద్దున్నే వచ్చింది...కానీ అల్లుడు గారు ఏదో టూరు వెళ్లాల్సి వచ్చిందనీ, తొందరగా రమ్మని కబురు పెడితేనూ బయలుదేరింది. పెళ్ళయ్యాక ఇక ఆ ఇల్లే ముఖ్యం కదా." అమ్మ అబద్ధం అతికినట్టు ఆడేసింది. హారతి వెర్రిగా చూసింది. అల్లుడు గారు పిలిచారా? ఇక ఛస్తే నా గుమ్మం తొక్కకు అని గెంటినోడు, మీరు ఇంకో పాతిక లక్షలు అప్పో సొప్పో చేసి ఇస్తా అంటే ఒప్పుకున్నోడు, నన్ను టూరుకి తీసుకెళ్లడానికి పిలిచాడా అమ్మా?! అన్నట్టు అమ్మకేసి తీవ్రంగా చూసింది హారతి.

రాధిక వదిలిపెట్టేలా లేదు. ఆవలిస్తే పేగులు లెక్కెట్టే రకం. హారతి చూపులను, వాచిన ఆమె ముఖాన్ని ఇట్టే గుర్తు పట్టేసింది. కనురెప్పల అంచున నిల్చున్న చెమ్మను చూసి ఏదో యుద్ధమే జరిగింది అని అర్థం చేసుకుంది. "ఆ...మంచిదే ... ఇలా టూర్లకు వెళ్తేనే, కొంచెం రిలాక్స్ అయ్యి, తొందరగా కన్సీవ్ అవుతారు. మా అమ్మాయి వాళ్ళూ అంతే, అలా స్విట్జర్లాండ్ వెళ్ళొచ్చాకే, నీళ్లుపోసుకుంది....." రాధిక ఇంకా ఏదో చెబుతూ పోతోంది.

హారతికి చిరాకేసింది. "ఇలాంటి వాళ్ల నోటికి భయపడే కదా .. మమ్మీ నన్ను మళ్లీ పులి బొన్లోకి పంపుతోంది. ఇలాంటి ఇరుగుపొరుగు ఏమనుకుంటారు అనే కదా .. అల్లారు ముద్దుగా పెంచిన నాన్న నన్ను మళ్లీ ఆ మృగాల మధ్యలోకి వదిలేస్తున్నాడు. ఇలాంటి వాళ్ల మాటలకు భయపడే కదా .. చదువుకున్న అమ్మాయినే అయినా స్వతంత్రంగా జీవించడానికి భయపడుతున్నాను." హారతి ఆలోచనల్లో కొట్టుకుపోతూ, నిర్లిప్తంగా చూస్తూ నిల్చుంది.

'డ్రైవర్ అరైవ్డ్' అని సందేశం చూసి, "అమ్మా డ్రైవర్ వచ్చాడు. వెళ్తున్నా" ముక్తసరిగా చెప్పింది.

"తప్పమ్మా... వెళ్ళొస్తా అనాలి" రాధిక నవ్వుతూ చెప్పింది.

"ఆరోగ్యం జాగ్రత్త కన్నా" అమ్మ బాధగా వీడ్కోలు చెప్పింది. ఇంకేం మాట్లాడలేక అక్కడనుండి మౌనంగా కదిలి కాబ్ ఎక్కింది హారతి. నాన్న కూడా తోడుగా బయలుదేరాడు. ఆమె యజమానులకు తనని భద్రంగా అప్పజెప్పడానికి.

దారి పొడవునా ఒకటే మాట. "అత్తా మామ నీ తల్లి తండ్రి వంటివారు. ఏదో కోపంలో మాట తూలినా అడ్జస్ట్ అవ్వాలి. భర్త ఒక దెబ్బ వేసినా కొంచెం సహనం ఉండాలి...." ఇలా తను ఎలా ప్రవర్తించాలి అని హితభోధలే కానీ, వాళ్ళు ఎలా ఉండాలో, ఎలా ఉంటున్నారో, అలాంటి వాళ్లతో ఎలా మసలుకోవాలి, సెక్షన్ 498ఎ ఏమిటో! ఆ చదువుకున్న తండ్రి వివరించలేదు. బహుశా చట్టం మీద అతనికి ఉన్న అభిప్రాయం అలాంటిది కాబోలు. హారతి మౌనంగా వింటూ కూర్చుంది.

తెల్లని చొక్కా వేసుకున్న నాన్న, హారతికిప్పుడు ఎక్కడికో లొక్కెళ్ళిపోయే సముద్రపు అలలా కనిపిస్తున్నాడు. "నేనెరిగిన సముద్రం కాదు నువ్వు" ఆయన్ని చూస్తూ మనసులో అనుకుంది.

"వద్దు నాన్న...నన్ను పంపొద్దు నాన్న. నేను నీతోనే ఉండిపోతాను. ఈ లోకం ఏం అనుకున్నా పర్లేదు. నేను చిన్నప్పటి నీ కూతురిగానే, నీ గుబురు మీసాలతో ఆడుకుంటూ, నువ్వు చెప్పే కథలు వింటూ , నీ వీపు పై ఎక్కి నా పాదాలతో మర్దనా చేసి చిట్టి పాపాయిలా ఉండిపోనా నాన్న. కాలం ఎంత చెడ్డదో చూడు. కళ్ళు మూసి తెరిచేలోగా నాకు పెద్దరికం ఇచ్చేసింది. నీ ప్రేమను తనివితీరా అనుభవించక మునుపే చేజారిపోయినట్టు అనిపిస్తోంది. నీకూ నాకూ ఏ బంధం లేనట్టు, నా మీద నీకు ఏ హక్కు లేనట్టు, నేను గమనించకుండానే మన మధ్య ఈ దూరం వచ్చేసింది." అనుకుంటూ

తనకు కాస్త ఎడంగా కూర్చుని ఉన్న నాన్న చేతుల్ని చూసింది. చిన్నప్పుడు తన బరువు మోసిన ఆ చేతులు ముసలివైపోయాయి. అందుకేనేమో ఇప్పుడీ బరువును వేరే వారి చేతుల్లో పెట్టేందుకు ప్రయత్నిస్తోంది.

కన్నుల్లోంచి కన్నీళ్లు బొట బొటా రాలి చెక్కిళ్ళ మీద నుండి జారి పడి, ఆమె చీరను తడుపుతున్నాయి. ఆమె మనసులోని వేదనకు ఆ తడిచిన కోకే సాక్ష్యం. కానీ ఆ సాక్ష్యాలతో పని లేని సమాజంలో బతుకుతున్న ఆమెకు విడాకులు వరం కాదు శాపం. చచ్చిన శవాన్ని కుళ్ళబొడిచి, పైశాచిక ఆనందం పొందే రాబందులున్న లోకంలో ఆడపిల్లగా పుట్టడం ఆమె చేసుకున్న పాపం.

క్యాబ్ అత్తింటి ముందు ఆగింది.

"మీ ఇల్లు వచ్చింది దిగమ్మా" నాన్న పిలుపుతో లోకంలోకి వచ్చింది హారతి.

"హు! ...నా ఇల్లు..." వ్యంగ్యంగా నవ్వింది.

"చిన్నప్పుడు నాకిష్టం అని కుక్క పిల్లను పెంచుకుంటా అంటే, అమ్మ కోప్పడేది. నీ పెళ్ళయ్యాక, మీ ఇంటికి నువ్వు వెళ్తావు కదా అప్పుడు పెంచుకో అనేది. అప్పుడది నా ఇల్లు కాదు. ఇప్పుడు ఈ అత్తారిల్లు నా ఇల్లు అనుకుంటే, ఇదీ కాదు. మీ ఇంటికి పో అని తరిమేశారు ఈ ఇంటిగలోళ్ళు. మరి నా ఇల్లేది?! " నిర్వేదంగా అత్తగారింటిని చూసింది.

నాన్న కాలింగ్ బెల్ నొక్కాడు.

అత్తగారు తలుపు తీసారు. వీళ్ళను చూసి కూడా ఏం మాట్లాడకుండా ఆవిడ మౌనంగా లోపలికి వెళ్ళిపోయారు. నాన్న, హారతి ఆమెను అనుసరించారు. ఆమె వీరికి కనీసం మంచి నీళ్ళు కూడా ఇవ్వలేదు. బాగున్నారా అని పలకరించలేదు. కూర్చోమని చెప్పలేదు. ఆవిడ మెల్లిగా నడుస్తూ వెళ్లి సోఫాలో కూర్చుంది.

నాన్న నించునే ఉన్నాడు. ఒక దోషిలా, ఒక ముద్దాయిలా, సంజాయిషీ ఇచ్చుకోడానికి డబ్బుల మూట తీసి టీపాయ్ మీద పెట్టాడు. ఆమె మొహం తిప్పుకుంది. ఇంకేదో తీర్చలేదు అన్నట్టు చిరాగ్గా చూసింది. నాన్న అర్థం చేసుకున్నాడు. "ఒక వారంలో ..." నాన్న ఇంకా వాక్యం పూర్తి చేయకుండానే, ఆవిడ లేచి వెళ్ళిపోయింది.

నాన్న హారతి భుజం మీద చెయ్యేసి, సర్దుకుపో అన్నట్టు ఓ చూపు విసిరి, వచ్చిన దారినే వెళ్ళిపోయాడు. హారతికి బాధ వేసింది. పులిలా దర్జాగా బతికిన నాన్న, తన కోసం కేవలం తనలాంటి ఓ ఆడపిల్ల కోసం తలదించుకు వెళ్ళిపోయాడు. హారతి కళ్ళు నిండుకున్నాయి. సూటు కేసు తీసుకుని లోపలికి వెళ్ళింది.

గుండెలు దొలిచేస్తున్న బాధతో, మంచం మీద కూలబడింది. మంచం పక్కనే ఉన్న గుండ్రటి గ్లాసు కుండలోని చేప పిల్లను చూస్తూ ఉండిపోయింది. ఆ చేప పిల్లది తన బతుకే. ఎక్కడో హాయిగా బతికే దీన్ని తెచ్చి, దానికి భద్రత ఇస్తున్నాం అని ఇక్కడ బంధించేసారు. గ్లాసు గోడల్ని తాకుతూ బయటకి రావాలని ఉబలాటం పడుతున్న కొత్త చేపను చూసింది. తను అపురూపంగా తెచ్చుకున్న గోల్డెన్ ఫిష్ చనిపోయినట్టు ఉంది. దాని స్థానంలో ఇది వచ్చిందా?! ఇది ఇక్కడ నిలవలేక పోతే! దీన్ని తీసి మరొక దాన్ని తెస్తారు. చేప ఏడుస్తున్నట్టు అనిపించింది. ఏడ్చినా దాని కన్నీళ్లు తుడిచేవారు ఉండరు. ఆ నీటిలో జారిపోయే కన్నీటిని గుర్తించే వారు ఎవరూ ఉండరు. తనదీ ఈ చేపలాంటి బతుకే కదా!" హారతి దాన్ని చూస్తూ అలా పడుకునే ఉంది.

భర్త వచ్చినట్టు ఉన్నాడు. ఒకప్పుడు 'అతనెప్పుడొస్తాడా?' అని ఎదురుచూసిన ఆమె మనసు ఇప్పుడు అతడొచ్చి 'ఏం చేస్తాడో' అన్నట్టు భయంతో బిగుసుకుపోయింది. అతడు వచ్చాడు. అత్తమ్మ ఏదో చెబుతోంది. అతడి కేకలు స్పష్టంగా వినిపిస్తున్నాయి. మధ్య మధ్యలో ప్రియ పేరు ... 'ప్రియ' ... ఇప్పుడతని కొత్త ప్రేయసి. ఆమె కోసం గొడవ పడుతున్నాడు. ఒకప్పుడు హారతి కోసం కూడా గొడవపడ్డాడు. ఇప్పుడతనికి కొత్త ప్రేమలు కావాలి.

అత్తమ్మ ఏదో సర్ది చెప్పినట్టు ఉంది. అతని అడుగుల చప్పుడు తన రూమ్ వైపే వస్తున్నాయి. పడుకున్నట్టు నటిస్తూ పక్కకి తిరిగి ఉంది హారతి.

" శని గ్రహం..." పళ్ళు కొరుకుతూ నసిగాడు భర్త.

హారతికి దుఃఖం ఆగలేదు. ఏడుపు బిగపట్టి, గుండెలు నొక్కి పట్టుకుని, లోపలే దుఃఖాన్నంతా దాచేసింది.

ఒకప్పుడు అదృష్ట దేవత ఇప్పుడు శనిగ్రహం..

ఆమె శరీరాన్ని పక్కకు తిప్పి, పశువులా ఆక్రమించుకున్నాడు. అతడి స్పర్శ వెగటు పుడుతోంది. శరీరాన్ని నిప్పుల్లో కాలబెట్టేసుకోవాలి అనేంత రోత పుడుతోంది. కానీ ఏం చెయ్యలేదు. ఎందుకంటే సహించాలి. సర్దుకుపోవాలి.. ఓర్చుకుంటే గుడ్డే కోడవుతుందిగా.. కానీ మృగం మనిషవుతాడా? మొదటిసారి ప్రశ్నించుకుంటూ నిద్రలోకి జారుకుంది.

తెల్లారింది..కాదు..మధ్యాహ్నం దాటింది.

ఆకలి...భరించలేని ఆకలి.. ఆమె నరనరాన ఏదో నొప్పి. ఒళ్ళంతా పచ్చి పుండులా...ఏమైంది .. రాత్రి ఏమైంది...తనకు తెలియదు.. మత్తు ... విపరీతమైన మత్తు.. కళ్ళు మసక మసకగా .. చూపు సన్నగిల్లుతూ .. మత్తు...మత్తుగా మళ్లీ నిద్రలోకి జారుకుంది.

ఎవరెవరో వస్తున్నారు .. ఏదేదో పొడుస్తున్నారు .. పిచ్చిగా అరుస్తోంది. వెర్రిగా నవ్వుతోంది ... హారతీ .. లే .. ఎవరిదో కొత్త కంఠం .. హారతి లేవే ... నూతిలో నుండి వచ్చినట్టు ఆ కంఠం .. డబ్బాలో నోరు పెట్టి మాట్లాడితే వచ్చే స్వరం.

'ఆ వస్తున్నా' .. అంటూ తను లేస్తోంది .. పరిగెడుతోంది .. బాధగా అరుస్తోంది. అన్నిటినీ విసిరి కొడుతోంది. అన్నీ కొత్తగా చేస్తోంది. ఏదీ తెలియకుండానే.

ఎవరో కొత్త వ్యక్తి. కాదు కాదు బాగా తెలిసిన వ్యక్తే.. తెల్ల కోటులో.. తనకు దగ్గరా వస్తూ. శరీరంలో ఏదో ఎక్కిస్తూ .. మత్తు .. మళ్లీ .. మత్తు .. చావు గుహలోకి వెళ్లిపోతున్నట్టు, ఆకాశం నుండి తారలా రాలి పోతున్నట్టు, కృష్ణ బిలంలోకి లాక్కెళ్ళిపోతున్నట్టు .. విపరీతమైన ఊహలు .. అనుభూతులు...ఏదేదో మాట్లాడుతున్నారు. లీలగా వినిపిస్తున్నాయి. కానీ నమ్మేట్టు లేవు. కడుపులో ఆకలి, ఒంట్లో దాహం కొట్టొచ్చినట్టు తెలుస్తోంది. కానీ లేవలేకపోతోంది. లేచినా మత్తులోనే ఉండిపోతుంది. ఏమౌతోందో .. శరీరం గుల్లబడిపోతున్నట్టు ఉంది. నరాలు జివ్వున విద్యుత్ వదులుతున్నాయి.

ఆ రోజెందుకో .. కొద్దిగా మత్తు వదిలింది. మెల్లగా కళ్లు తెరిచి చూసింది. మంచానికి అతుక్కుపోయి, లేవలేకుండా ఉంది. నీరసంగా మళ్లీ పడుకుంది..

ఎవరో వస్తున్నట్టు అలికిడి.

"స్పృహలో వచ్చిందా?" అడిగిందో పరిచయమైన గొంతు. అది ఆమె అత్త గొంతు.

"వారం అయ్యింది... సర్టిఫికెట్స్ వచ్చేసాయిగా...ఇక ఈ లంపటం ఎందుకు? " భర్త గొంతు ఖంగుమంటోంది.

"కొంచెం ఓపిక పట్టు... వాళ్ళ నాన్న వస్తాడుగా. ఇది డ్రగ్స్ కి అలవాటు పడింది అని సర్టిఫికెట్స్ వచ్చేశాయి. వాడిని బెదిరించి ఇంకొంచెం లాగుదాం. ఇవ్వకపోతే అందరి ముందూ దీని భాగోతం బయట పెడదాం. ఎక్కడ నొక్కాలో అక్కడ నొక్కాలి రా.. పద. దీని మత్తు వదిలాక మిగతావి చూద్దాం" అంటున్న మామయ్య గూడుపుఠాణి మొత్తం తెలిసింది.

హారతికి నోట మాట రాలేదు. వారం రోజుల పాటు తను మత్తులోనే ఉందా! ఆఖరికి తన శరీరంలోకి డ్రగ్స్ ఎక్కించారా! తన ప్రమేయం లేకుండా తన జీవితంలో ఏం జరుగుతోంది. ఆ మాటలకు మత్తు వదిలినా చేజారుతున్న జీవితం, నిర్మించుకున్న కలల ప్రపంచం మధ్య విస్ఫోటనం జరుగుతున్నట్టు అయ్యింది. ఆకాశం కోల్పోయిన పక్షిలా , తన జీవితంలో ఆసరా లేదన్నట్టు చప్పుడు లేకుండా  పొగిలి, పొగిలి ఏడ్చింది.

కిటికీ పక్కనే తన మంచం కావడంతో, లాన్ మోవర్ చప్పుడు వినిపిస్తోంది. పెరిగిన గడ్డిని కత్తిరిస్తూ, గోల చేస్తూ వెళుతున్న మోవర్ వెనుకే, పనివాడు వెళుతున్నాడు. అది అతన్ని నడిపిస్తోందా! లేక అతనే దాన్ని నడిపిస్తున్నాడా అని అర్థం కాలేదు. కొత్తగా చేరినట్టు ఉన్నాడు. దాని వేగం అందుకోలేక ఆయాస పడుతున్నాడు. అదే అతన్ని అదుపు చేస్తున్నట్టు స్పష్టంగా తెలుస్తోంది. అతడు కాసేపటికి అలసిపోయి లాన్ మోవర్ ఆఫ్ చేసి, నీడలో కూర్చున్నాడు. కాసేపయ్యాక లేచి మళ్లీ మిగతా గడ్డి తియ్యడానికి మోవర్ ఆన్ చేశాడు. ఈసారి అతను లాన్ మోవర్ ను పరీక్షించి చూసాడు. కంట్రోల్ బటన్ కనిపించింది. తిప్పి చూసాడు. వేగం అదుపులోకి వచ్చింది. ఇప్పుడా యంత్రం అతని ఆధీనంలోకి వచ్చింది. సరదాగా ఏదో పాట పాడుకుంటూ, ఆనందంగా పనిచేశాడు. ఇంతలోనే ఎంత మార్పు! కొద్ది సేపటి వరకూ ఆ యంత్రంతో నానా యాతన చెందిన అతను, ఆ లాన్ మోవర్ కంట్రోల్ చెయ్యగానే, ఆనందంగా పని పూర్తి చేశాడు.

"నా జీవితం వేరే వారి చేతుల్లో కాకుండా నా చేతుల్లో స్పాయిల్ అయితేనే నాకు ఇష్టం." హారతికి ఆనంద్ సినిమాలోని తనకి ఇష్టమైన డైలాగ్ గుర్తుకు వచ్చింది. చక చకా ఫోన్ తీసుకుని ఓ ప్లాను వేసి అమలు చేసింది.

నీళ్ళ బాటిల్ అందుకోబోయింది. టేబుల్ అంచున ఉన్న ఆ స్టీల్ బాటిల్ పెద్ద చప్పుడు చేస్తూ కింద పడింది. భర్త పరిగెత్తుకు వచ్చాడు. ఆ వెనుకే అత్త మామలు.

"లేచావే... బిచ్..." అంటూ తిట్టడం మొదలు పెట్టాడు.

ఆమెకు అతని తిట్లు కన్నా, అతడు తన దేహంలో డ్రగ్స్ ఎక్కించాడు అనే బాధగా ఉంది.

"యూ...బాస్టర్డ్... డ్రగ్స్ ఎందుకు ఎక్కించావ్?"

హారతి మొదటి సారి అతన్ని ఎదిరించి మాట్లాడింది. అంతే ఆమె చెంప చెళ్లుమనిపించాడు. ఆమె కళ్ళెర్రజేస్తూ, అతన్ని జుగుప్సగా చూసింది. ఆ చూపులకి సిగ్గు తెచ్చుకోవాల్సిన వాడు మృగంలా మారి పోయాడు. ఓపిక లేని ఆమె మీద పడి పశువులా ప్రవర్తించాడు. బెల్టు తీసి , జుట్టు పట్టుకుని కొట్టబోయాడు. ఆమె నీరసంతోనే ఎదిరించింది. బెల్టుతో కొడుతున్న ఆ మానవ మృగాన్ని తిప్పి కొట్టింది. అతడిలోని అహంకారం రాజుకుంది. నిస్సహాయ స్థితిలో కిందపడి ఉన్న ఆమె మీద కుర్చీ విసరబోయాడు.

అంతలో కాలింగ్ బెల్ మోగింది.

"దీని నాన్న వచ్చి ఉంటాడు రా...వదిలేయ్" అత్త ఒక్క మాటకి కుర్చీ తీసి నేలకి విసిరి, డోర్ తీశాడు.

ఎదురుగా నిల్చున్న మనుషుల్ని చూసి నోట మాట రాలేదు అతనికి. "అమ్మా .. అమ్మా" అని కేకవేసాడు.

అత్తా మామలిద్దరూ పరిగెత్తుకు వచ్చారు.

పోలీసులు .. మీడియా .. జనాలు .. చుట్టుపక్కల వారూ .. హారతి స్నేహితులు .. అందరూ .. అందరూ .. నిమిషాల్లో ఆ ఇంట్లో నిండిపోయారు. నిస్సహాయంగా నేల మీద పడి ఉన్న హారతిని లేపి కూర్చోబెట్టి, ఆకలి తీర్చారు సన్నిహితులు. కోపంతో ఊగిపోతూ ఆ మృగాలను శాపనార్థాలు పెట్టారు జనాలు. మీడియా వాళ్ళు తమ టీఆర్పీ రేటింగులు పెంచుకునే పనిలో పడ్డారు. చుట్టూ పక్కల వారూ సాక్ష్యం చెప్పారు. పోలీసులు పూర్తి బందోబస్తుతో ఆ ముగ్గురినీ లాక్కుపోయారు.

"సోషల్ మీడియా ద్వారా భర్త, అత్తమామల ఆగడాలు, గృహ హింసను లైవ్ టెలికాస్ట్ చేసి బయట పెట్టిన సాఫ్ట్ వేర్ అమ్మాయి హారతి. గృహ హింసను తట్టుకోలేక ఆత్మహత్యే శరణ్యం అనుకుని, బలైపోతున్న ఎందరో అభాగ్యులు తెలుసుకోవాల్సిన గాథ ఇది. అమ్మాయిలూ ఎవడో చేసిన తప్పుకు మీరు బలికాకండి. మీ హక్కులు తెలుసుకోండి సెక్షన్ 498a మీ కోసమే. దాన్ని ఉపయోగించండి. అంతే కానీ ఆ రాక్షసులకు ఓడిపోయి, మీ నిండు జీవితాన్ని బలి చేసుకోవద్దు. మీ జీవితం మీ చేతుల్లోనే ఉంది. ఒక వేలుకి పుండు వస్తే, మన వేలును నరుక్కోము. కానీ అదే పుండు ఒక కాన్సర్ కణతి అయితే, ఇంకో భాగానికి అది సోకక ముందే ఆ కణతిని, ఆ భాగాన్ని తీసేయ్యాల్సిందే. జీవితం కూడా ఇంతే ..." నేరాలు ఘోరాల్లో యాంకరమ్మ హారతి జీవితాన్ని ఉదాహరిస్తూ, గృహ హింసను తట్టుకోలేక ఆత్మహత్యే శరణ్యం అని హారతి అయిన పడతులను గుర్తు చేస్తూ, చెప్పుకుపోతోంది.

★★★

ఐదు వసంతాలు గడిచిపోయాయి. నేల రాలిన పారిజాతాల సువాసనలు చిట్టి పాదాలను ముద్దాడుతుంటే, "అమ్మా... డోబీ గాడు నా మాట వినట్లేదు.. చూడు ఒళ్లంతా మట్టి చేసుకున్నాడు. నాకూ మట్టి రాసేశాడు. వేస్ట్ ఫెల్లో. డర్టీ డోబి. పిచ్చి డోబి.." అయిదేళ్ల లాస్య ముద్దు ముద్దుగా తన కుక్క పిల్ల మీద కంప్లైంట్ చేసింది.

"అయ్యయ్యో... డోబిగా...తప్పు కదా...అక్కకి మట్టి రాయొచ్చా... ఇదిగో ఇలా రంగులు పూయాలి..." అంటూ తోటలోని తన బంతి పూలను చేతితో నలిపి లాస్యకు పూయడానికి, వెంట పడింది హారతి.

ఆమె ఇంటిలో, ఆమె ఇష్టంగా పెంచుకున్న గార్డెన్లో, అక్కున చేర్చుకున్న చిట్టి పాపాయితో, చిన్నప్పుడు ఆశగా మిగిలిన కుక్క పిల్లతో, ఆమె పోటీ పడి పరుగులు తీస్తుంటే, ఆ తోటలోని పువ్వులన్నీ హాయిగా నవ్వుతున్నాయి.

"మీ జీవితం ...మీ చేతిలో..." హారతి ఇంటి గేటు బయట రాసి ఉన్న అక్షరాలు ముత్యాల్లా మెరుస్తూ, తన కథను ఆ దారిన పోయేవారితో చెబుతూ ఉన్నాయి.

★★★0★★★

# కథామంజరి దీపావళి కథల పోటీ

## ద్వితీయ బహుమతి



# వెలుగుకి ఉదయం

## జంధ్యం వెంకటేష్ బాబు



నెల్లూరు జిల్లా వాసి అయిన శ్రీ జంధ్యం వేంకటేశ్వర బాబు - జంధ్యం వెంకటేష్ బాబుగా, జె.వి.బాబుగా రచనా వ్యాసంగం లో 30 వసంతాలు చూశారు. ఈయనకు కీర్తిశేషులు శ్రీ చలసాని ప్రసాదరావు గారు గురుతుల్యులు. అనేక పత్రికలలో 300 పైచిలుకు కథలు, 20 పైన నవలలు వీరివి ప్రచురింపబడగా, ఒక కథ కన్నడ ధారావాహికంగానూ, ఒక కథ తెనుగు నాటకంగానూ రూపాంతరం చెందాయి. "శ్రీకారం", "ప్రాక్టికల్ సైకాలజీ" పత్రికలకు సంపాదకుడిగా పనిచేసి, "మంగళ" సినిమాకు మాటల రచన చేశారు. ప్రస్తుతం ప్రకటన సినిమాల దర్శకత్వం లో తలమునకలవుతున్న ఈ, మా, మన రచయితకి "కథామంజరి" శుభాకాంక్షలు.

## కథామంజరి దీపావళి కథల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన కథ



# వెలుగుకి ఉదయం

### జంధ్యం వెంకటేష్ బాబు

నగరం గాఢ నిద్రలోకి జారుకుంది.

కాని ఆ రెండు గదుల ఇంట్లో, రెండు ప్రాణాలు, 'నాలుగు ప్రాణాలు ఈ భూమ్మీద ఉండాలా వద్దా' అన్న విషయం గురించి ప్రాణాలు అరచేత పెట్టుకుని మాట్లాడుకుంటున్నాయి.

"ఇక తప్పదు ముగింపు పలకాల్సిందే..." అన్నాడు రామకృష్ణ.

సరస్వతి భర్త కేసి నిరామయంగా చూసింది. మరణం బాధాకరం. బలవన్మరణం వర్ణనాతీతం!

'నాకు ఈ లోకం నుంచి వెళ్లాలని లేదు. పెంచుకున్న అనుబంధాలు, పంచుకున్న జ్ఞాపకాలు అంత త్వరగా తెంచుకోవాలనిపించడంలేదు.... పిల్లల భవిష్యత్తు మీద ఎంతో ఆశతో కన్న కలలను సమాధి చేస్తూ, వారికి అసలు జీవితమే లేకుండా చేయడం ...గుండె నేనిక ఈ బాధను తట్టుకోలేను అంటోంది.'

"...ఓడిపోయాను సరస్వతీ! కుటుంబాన్ని పోషించుకోవాలని, జీవితంలో ఎదగాలని చేసిన ప్రయత్నాలేవి ఫలించక, ఆ ప్రయత్నంలో తప్పనిసరై చేసిన తప్పులు ప్రమాదకరంగా మారి పరువు, మర్యాదలు మంటగలిపేలా తయారయ్యి ముంచుకొస్తుంటే నేనింకా భరించలేను... మనందరం ఆత్మహత్య చేసుకోవడం తప్ప మరో మార్గం .... లేదు.."

గతం గుర్తుకు వస్తే బాధగా ఉంటుంది. కాని జీవితపు చివరి క్షణాల్లో గుర్తు చేసుకోక తప్పలేదు .

పల్లెలో ఏవో కొద్దిపాటి ఆస్తులు ఉన్నాయి. కానీ అవి కోర్టు కేసుల్లో ఉన్నాయి. ఆ ఆస్తుల విషయం పక్కన పెట్టి పల్లెలో పని లేక పొట్ట చేత పట్టుకుని నగరానికి వచ్చాడు. తను చదివిన డిగ్రీ చదువుకి ప్రింటింగ్ ప్రెస్ లో ఏదో చిన్న ఉద్యోగం దొరికింది. నాలుగేళ్లు అక్కడ ఉద్యోగం చేశాడు. అయితే అక్కడ అజమాయిషీ భరించలేక ఆ ఉద్యోగం వదిలేసాడు. ఆ తర్వాత మరో ఉద్యోగం. అక్కడ మరో రెండేళ్లు. అక్కడా ఇమడలేకపోయాడు. అలాగని ఉద్యోగాలను తిట్టుకోలేదు. తనకు సరైన ఉద్యోగం దొరకలేదు అనుకున్నాడు .

బ్రతుకు తెరువు పోరాటంలో తన బాధ చూసిన సరస్వతి "ఇలా మనసు చంపుకొని ఉద్యోగాలు చేయకపోతే, ఏదో చిన్న వ్యాపారం చేయొచ్చు కదా" అంది. భార్య చెప్పిన ఆలోచన నచ్చింది .

ఏ వ్యాపారం చేయాలి అని ఆలోచిస్తుంటే తానే అంది "మీకు ప్రింటింగ్ ప్రెస్ లో కొంత అనుభవం ఉంది. అదే స్టార్ట్ చేయొచ్చు కదా"

ఆ ప్రయత్నం చేశాడు. భార్య మెడలో నగలు, తెలిసిన బంధువుల దగ్గర అప్పు తెచ్చి ప్రింటింగ్ ప్రెస్ పెట్టాడు. ప్రింటింగ్ ప్రెస్ పని ...కేవలం పది రోజులు మాత్రమే నడిచింది. ఆ తర్వాత ఒక మహమ్మారి దేశంలో ప్రవేశించింది. లాక్ డౌన్ పేరుతో మూడు నెలలపాటు దేశమంతా సమస్తం బంద్ అయింది.

ఆ తర్వాత లాక్ డౌన్ సడలింపు మొదలైంది.

అప్పుడే తనకు వ్యాపారం తిరిగి ప్రారంభించడానికి కొంత పెట్టుబడి అవసరం పడింది . అప్పుడే మిత్రుడి ద్వారా యాదగిరి దగ్గర అప్పు చేశాడు. అప్పు ఇస్తున్నప్పుడే యాదగిరి తనేంటో చెప్పాడు.
కాని, అప్పు కట్టలేని పరిస్థితి తనకు వస్తుందని అప్పుడు అనుకోలేదు.
ఊహాతీతం... మళ్లీ సెకండ్ వేవ్! వేవ్ తగ్గినా వ్యాపారం జరగటం తగ్గిపోయింది.
దేశంలో ఎన్నో లక్షల మంది వ్యాపారాలు మూతపడ్డాయి. తను కూడా అందులో ఒకడు.
కష్టపడితే ఫలితం ఉంటుందనుకుంటే అది పొరపాటు. కాసింత అదృష్టం కలిసి రావాలి. జీవితంలో మొదటిసారి వ్యాపారం చేయబోతూ అప్పుల పాలయ్యాడు తను.
అయితే అన్ని అప్పులు వత్తిడి కాలేదు గానీ, యాదగిరి దగ్గర తీసుకున్న అప్పు మాత్రం ప్రమాదకరంగా మారింది. నెలల్లో తీరుస్తానని తీసుకున్న రెండు లక్షల అప్పు వడ్డీ పెరిగి మూడు లక్షలు అయింది. అప్పు తీర్చమంటూ పెరిగిన ఒత్తిడి చివరికి "రేపు ఉదయం మీ ఇంటికి వస్తా. అప్పు వడ్డీతో సహా తీర్చావో సరే, లేదంటే ఏం జరుగుతుందో చూడు." అని బెదిరించే వరకు వెళ్ళింది.
అదిగో అదే ఇప్పుడు సమస్య!
పరువు సమస్య!
మర్నాడు యాదగిరి తన మనుషుల్నేసుకుని, ఇంటికి వస్తాడు. ఫైనాన్స్ వ్యాపారం చేసే అతడికి దయాదాక్షిణ్యాలు ఉండవు. పక్కవాడి గురించి అస్సలు ఆలోచించడు. జరగబోయేది తలచుకుంటేనే భయం వేసింది. ప్రాణాలు తీసుకోవడం మేలు అనిపించింది.
అందుకే భార్యా బిడ్డలతో సహా ఈ లోకం నుండి నిష్క్రమించాలని నిర్ణయించుకున్నాడు అతడు. తన భార్య కేసి చూశాడు. సరస్వతి కళ్లనుండి నీళ్లు కారుతున్నాయి. ఆ కన్నీటిని ఆపే ప్రయత్నం చేయలేదామె. 'మరి కొద్ది గంటల్లో జీవితం ముగిసిపోతుంది. కన్నీటిని దాచుకుని ప్రయోజనమేముంది' అనుకుందేమో!
రామకృష్ణ తల తిప్పి గాఢనిద్రలో ఉన్న పిల్లల కేసి చూశాడు. అభం, శుభం తెలియని పసికూనలు ... తొమ్మిదేళ్ల పసివాడు, ఏడేళ్ల పసిది! భార్యాభర్తలుగా తామిద్దరి జీవితం ముగించడం బాధాకరంగా ఉన్నా భరించగలదు. కానీ వాళ్లను కూడా తమ వెంట తీసుకెళ్లడం మాత్రం భరించలేనంత బాధను కలిగిస్తోంది.
అతడి ఆలోచనలు అర్థమైనట్టు సరస్వతి అంది "పోనీ మనిద్దరం చనిపోతే?"
అతడు భారంగా నిశ్వసించాడు. "అమ్మానాన్నలు లేకుండా వాళ్ళు అనాథలుగా రోడ్డున పడితే, వాళ్ల దీనావస్థ చూసి ఎవ్వరూ జాలి పడరు సరస్వతీ! గేలి చేస్తారు. మీ అమ్మా నాన్నలు అర్థంతరంగా చచ్చి, మిమ్మల్ని ఊరి మీద వదిలేశారు అంటూ తిట్టిపోస్తారు. పిల్లలకు మంచి భవిష్యత్ ఇవ్వలేనప్పుడు, వాళ్ళను ఈ భూమ్మీద వదిలి వెళ్లడం ధర్మం కాదు..."
ఆమె మరిక మాట్లాడలేక పోయింది.
సాయంత్రంగా తీసుకొచ్చి, అల్మరాలో దాచిన పాయిజన్ బాటిల్ తీసుకొచ్చాడు అతడు.
'రేపటి అవమాన భారాన్ని తట్టుకోవడం కన్నా, ఈరోజు జీవితం ముగించడం మంచిది' అని అతడు అనుకుంటున్నాడు. 'కన్న బిడ్డల ప్రాణం ముందు అవమాన భారం, బ్రతుకు భయం పెద్దది కాదేమో' అనుకుంటుంది ఆమె.
కానీ ఆ స్థితిలో కూడా భర్తకు ఎదురు చెప్పాలనిపించట్లేదు.
ఇద్దరి మధ్య కొద్ది సేపు మౌనం రాజ్యమేలింది.
అప్పుడే గుర్తుకొచ్చింది ఆమెకు. "ఏవండీ ! రేపు మన పెద్దోడి పుట్టినరోజు"

"మర్చిపోలేదు."
"మన కడుపున పుట్టిన పాపానికి, సంతోషంగా జరగాల్సిన పుట్టినరోజునే ప్రాణాలు పోగొట్టుకోవడం..." ఆమె అంతకు మించి మాట్లాడలేక పెదవులు బిగబట్టింది.
ఒకవైపు సమాజంలో గౌరవం పోతుందన్న భయం, అవమాన భారాన్ని భరించే శక్తి లేకపోవడం ....
ఇంకొక వైపు పుట్టినరోజునే పిల్లల ప్రాణాలు తీయాలన్న నిర్ణయం!
మనిషి భావోద్వేగాల తీవ్రతకు ఉదాహరణగా నిలిచిన సమయం !
ఏం చేయాలి? 'నేను' అన్న పదం పదులుకొని తలదించుకోవాలా?
'కన్నబిడ్డ ముఖంలోని ఆనందాన్ని చూడటానికి, మరణాన్ని వాయిదా వేయాలా? పరువు పోగొట్టుకోవాలా?'
అతను ఏమి నిర్ణయించుకోలేక పోతున్నాడు.
నిమిషాలు గంటలుగా మారుతున్నాయి.
అతడు పక్కనే ఉన్న పాయిజన్ బాటిల్ చేతిలోకి తీసుకున్నాడు.
ఎక్కడ దానిని తాగేస్తాడేమోనని ఆ ఇల్లాలు భయంగా భర్త కేసి చూస్తోంది.
అతడు నోటి వరకు తీసుకెళ్లాడు....ఏ మూల ఏ నరం కదిలిందో...భావోద్వేగాలు తీవ్రతలో క్షణం పాటు విజ్ఞత పని చేసిందో! నోటి వరకు తీసుకెళ్ళిన బాటిల్ దించేసాడు.
ప్రాణభయం కాదు. కన్న బిడ్డలు కళ్ళ ముందు కదలాడారు. కష్టసుఖాలలో పాలుపంచుకున్న భార్య కోరిక నిర్ణయం తీసుకోకుండా చేస్తుంది.
కానీ ఎదుర్కోబోతున్న అవమానం భయం, బరువైన బ్రతుకు భారం ఏదో చేయమని ప్రేరేపిస్తున్నాయి.
ఆ ఒక్క సెంటిమెంట్ ... మర్నాడు కొడుకు పుట్టిన రోజు అనే సెంటిమెంట్ లేకపోతే అతడు తన నిర్ణయాన్ని అమలు చేసి ఉండేవాడేమో!

★★★

ఉదయం.
వెలుగు వచ్చింది.
పిల్లలు ఇద్దరు లేచారు.
సరస్వతి పెద్దోడికి పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతోంది .
అతడికి ఆ ధ్యాస లేదు. తన చూపు వీధి గుమ్మం వైపే ఉంది. ఏ క్షణం వాళ్ళు వస్తారో తెలియదు... వచ్చాక తన ఇంటిముందు జరుగుతున్న గొడవ చుట్టుపక్కల వాళ్లు చూసి, తన వైపు అదోలా చూస్తే, అసలు రాత్రి ఎందుకు చనిపోలేదా అనిపిస్తుందేమో !
"నాన్న నాకు హ్యాపీ బర్త్ డే చెప్పవా?" పెద్దోడు తన ముందు నిలబడి ఉన్నాడు.
అతడు ఆలోచనల్లోంచి తొత్కాలికంగా బయటపడి "హ్యాపీ బర్త్ డే టు యూ నాన్న..." అన్నాడు .
ఆ పసివాడి ముఖంలో ఆనందం కనిపించింది.
కొద్ది క్షణాల పాటు అన్ని బాధలు, భయాలు మర్చిపోయాడు. పిల్లల ముఖంలో ఈ ఆనందం కోసం ఏమైనా చేయొచ్చనిపించింది .
అప్పుడే ఫోన్ మోగింది.
యాదగిరి వస్తున్నాడని ఫోన్ చేశాడా?
వాళ్లు హఠాత్తుగా ఇంటి తలుపు తడతారు గాని ఫోన్ చేసి రారే?!!

మొబైల్ చేతిలోకి తీసుకుని మెల్లగా "హలో" అన్నాడు
"ఏరా రామకృష్ణ..."
ఆ పిలుపు ఎక్కడో విన్నట్లు అనిపించింది. "ఆ... అవును... మీరెవరు?"
"నేను మీ పెద్దన్నని... విజయ్ ని! మచిలీపట్నం నుంచి మాట్లాడుతున్నాను."
ముందు నుంచి పులి ఎప్పుడు దూకుతుందోనని ఊపిరి బిగబట్టి చూస్తున్నవాడికి, అదే క్షణం వెనుక నక్క అరుపు వినిపించినట్టు అనిపించింది.
పెద్దన్న అంటే ఒక తల్లీ బిడ్డలు కాదు. తనకి పెదనాన్న కొడుకు. ఉమ్మడి కుటుంబంలో కలసిమెలసి ఉన్నప్పుడు పెద్దన్న, చిన్నన్న అనుకోవటం అలవాటయింది. అతని కారణంగానే తనకు న్యాయంగా రావాల్సిన వాటా కూడా కోర్టు కేసుల్లో ఇరుక్కుపోయింది.
"ఆ...చెప్పన్నా..." అన్నాడు అతడు.
"ఆ...ఆ...అదేరా... మా కుటుంబ పరిస్థితులు ఏమీ బాగాలేవు. చేస్తున్న వ్యాపారాలు కూడా కలిసిరావట్లేదు. పెద్దమ్మాయి పెళ్లి జరగాల్సి ఉంది. డబ్బు చాలా అవసరం పడింది. అందుకే పొలం అమ్మేద్దాం అని అనుకుంటున్నాను."
ఒక్క క్షణం ఉలికిపాటు. "కోర్టు కేసులో ఉన్న పొలం ఎలా అమ్ముతారు?"
"అదే ..." కొద్ది క్షణాలు ఆగి అన్నాడు "...ఇంకా కోర్టుల చుట్టూ తిరగడం ఎందుకు?... మనం ఆ ఆస్తులు సమానంగా పంచుకుందాం."
రాజీ ! వెనుక నుండి మీద పడుతుందనుకున్న నక్క ముందుకొచ్చి మూలుగుతూ పడుకుంది. 'కరోనా దెబ్బలు మామూలుగా లేవు.' అనిపించింది అతడికి.
"అభ్యంతరం లేదు."
"పార్టీ సిద్ధంగానే ఉంది. అయితే రేపు బేరం ఫిక్స్ చేస్తాను. ఆ రేట్ నీకు ఓకే అనుకుంటే, వాళ్ల నుంచి అడ్వాన్స్ నీకు అకౌంట్ లో వేయిస్తాను. ఆ తర్వాత నువ్వు ఎప్పుడు వచ్చి సంతకాలు పెట్టినా ఓకే."
జీవితంలో ఇలా కూడా జరుగుతుందా? అద్భుతాలు, ఆశ్చర్యాలు సామాన్యుడి జీవితంలో కూడా జరుగుతాయా?
...జరుగుతాయి!
ఆత్మహత్య చేసుకోవాల్సిన పరిస్థితుల్లో ఇది ఒక ఊహాతీతమైన మలుపు.
"అలాగే పెద్దన్నా" అన్నాడు రామకృష్ణ
ఫోన్ కట్ అయింది .
విషయం తెలిసి సరస్వతి చాలా సంతోషపడింది. రెండు, మూడు రోజుల్లో తమ కష్టాలు పూర్తిగా కాకపోయినా, కొంతవరకు తీరబోతున్నాయి. కానీ అంతలోనే మరో గంటలో ఎదురుగా ఉన్న ప్రమాదం ఎదుట నిలిచి భయపెట్టింది. ఈ గంట గడిచేదెలా? తొమ్మిది అయ్యింది... పదయ్యింది.
'ఎదురు చూపులు బాధాకరం' అంటారు. కాని భయంతో చూసే ఎదురు చూపులు నరకం ! కళ్ళు భయంగా అటే చూస్తూ ఉంటాయి. గుండె వేగంగా కొట్టుకుంటుంది. మనసు మరేది ఆలోచించకుండా ఆ ప్రమాదం గురించే ఆలోచిస్తూ పిచ్చెక్కిపోయేలా చేస్తుంది. కొద్దిసేపటి క్రితమే ఓ మాట విన్నాడు. ఆనందం బ్రతుకు మీద ఆశ కలిగిస్తుంటే, ఆ ఆనందాన్ని కూడా అనుభవించడానికి లేకుండా రాబోతున్న ప్రమాదం భయపెడుతోంది. ఈ క్షణమో, మరో క్షణమో యాదగిరి రూపంలో ఎదురు కాబోతున్న అవమానం, ఆ తర్వాత ఈ సమాజంలో బ్రతకడం వేస్ట్ అనిపించేలా చేస్తుంది. అది నిజం.

సరస్వతి లేచింది. "రాత్రి కూడా ఏమీ తినలేదు. కాస్త ఎంగిలి పడండి."
రాత్రి పిల్లల కోసం వండిన అన్నంలో పచ్చడి కలుపుకు వచ్చింది. ఆ అన్నం నేలపాలే అనుకుంది రాత్రి. ఆకలి తీర్చబోతుందని తెలిసింది ఇప్పుడే! అతనికి తినాలనిపించలేదు. కానీ తను ఎంగిలి పడకుండా సరస్వతి కూడా తినదు. అందుకే తిన్నాడు.

★★★

అకౌంట్ నుండి మూడు లక్షలు క్యాష్ డ్రా చేసి చేతిలో పట్టుకుంటే చేజారిన జీవితం చేతి కొట్టొచ్చినట్టు అనిపించింది. డబ్బుతో ఇంటికి తిరిగొచ్చాడు.
భర్త చేతిలోని డబ్బు చూసిన వెంటనే సరస్వతి "ముందు వెళ్లి ఆ నీచుడు యాదగిరి అప్పు కట్టి రండి."
అతడు ఆ మూడు లక్షలు తీసుకొని ఇంట్లో నుంచి బయటకు నడిచాడు.
యాదగిరి ఆఫీస్ వైపు నడుస్తుంటే మళ్ళీ ఆ అనుమానం మనసులో కదలాడింది. 'ఇంటికి వచ్చి అల్లరి చేస్తాడనుకున్నవాడు మూడు రోజులుగా కనీసం ఫోన్ చేయక పోవటం ఏమిటి?'
అతడు యాదగిరి ఫైనాన్స్ ఆఫీస్ దగ్గరికి వెళ్తే అది క్లోజ్ చేసి ఉంది. పక్క షాప్ వాళ్ళని అడిగితే వాళ్ళు చెప్పిన విషయం షాక్ అయ్యేలా చేసింది. "వాడికి యాక్సిడెంట్ అయిన విషయం మీకు తెలియదా?"
అర్థం అవ్వడానికి అరనిమిషం పట్టింది. ఒక్క క్షణం మనసు ఆనంద పడిందేమో ! 'తగిన శాస్తి జరిగింది' అని అనిపించిందేమో!
అంతలోనే మానవత్వం దాన్ని అధిగమించింది.
"ఎప్పుడు?"
"మూడు రోజులు అయింది. అర్ధరాత్రి తాగేసి డ్రైవింగ్ చేస్తుంటే లారీ గుద్దేసి వెళ్ళిపోయింది. ప్రస్తుతం హాస్పిటల్ లో చావు బతుకుల మధ్య వున్నాడు. ఒకవేళ బతికినా 3, 4 నెలలు లేవలేడు. లేచినా మునపటిలా తిరగలేడు. గురుడికి ఇక వీల్ చెయిరే గతి."
పాపం! వాడు యాదగిరి బాధితుడేమో!
రామకృష్ణ హాస్పిటల్ అడ్రస్ అడిగి తెలుసుకుని అటు వైపు నడిచాడు.


★★★

ఐసియు లోనే ఉన్నాడు యాదగిరి. బ్రతిమలాడితే లోపలికి పంపించారు. రామకృష్ణను చూడగానే ఆ స్థితిలో కూడా ఆశ్చర్యం కదలాడింది అతడి ముఖంలో!
రామకృష్ణ అడిగాడు "ఎలా ఉంది మీకు?"
ఏం చెప్పాలో తోచనట్టు తల కదిలించే ప్రయత్నం చేశాడు.
రామకృష్ణ తను తెచ్చిన డబ్బు బెడ్ మీద పెట్టాడు. "ఇది మీ డబ్బు... కాస్త ఆలస్యంగా ఇస్తున్నందుకు క్షమించండి"
అతడు ఈ రెస్పాన్స్ ఊహించలేదు. అప్పులు తీసుకున్న వాళ్లలో ఎవ్వరు కనీసం మొహం చూపించలేదు. పైగా చాలామంది ఇలా జరిగినందుకు సంతోషపడుతూ ఉండొచ్చు. కానీ ఇతడు ...
రామకృష్ణ వెనుదిరిగాడు.
ఆ క్షణం బెడ్ మీద ఉన్న ఆ వ్యక్తి తన కేసి ఎలా చూసాడని అతడికి తెలియదు.
కాని ఆ క్షణం అతడు అనుకుంటున్నది ఒక్కటే... ఒక్క రాత్రి ధైర్యంతో వాయిదా వేసిన తన నిర్ణయం, నాలుగు నిండు ప్రాణాలను కాపాడింది.

★★★0★★★

# కథామంజరి దీపావళి కథల పోటీ

## తృతీయ బహుమతి




# ఎటువైపు

## రమాదేవి నెల్లుట్ల



అవార్డులు, పురస్కారాలు, బహుమతులు విరివిగా అందుకున్న శ్రీమతి రమాదేవి నెల్లుట్ల గారు తెలుగు పాఠకలోకానికి చిరపరిచితులే! బ్యాంకులో సీనియర్ మేనేజరుగా పనిచేస్తున్న శ్రీమతి రమాదేవిగారు అనేక సాహితీ ప్రక్రియల్లో ఆరితేరారు. కార్టూన్లు, కథలు, కవితలు, నానీలు, నాటికలు, సంపాదకత్వం .. ఇంకా ఎన్నెన్నో. మూడు పుస్తకాలు ప్రచురించి, మరో నాలుగు పుస్తకాలను ప్రచురించే ప్రయత్నంలో ఉన్నారు. గ్రామీణుల, విద్యార్థుల ఉన్నతికి శ్రమించాలన్న ఆశయం ఉన్న శ్రీమతి రమాదేవి గారికి అభినందనలు. తెలుగు కథాప్రియులను చిరకాలం తమ రచనలతో అలరించాలని ఆకాంక్షిస్తున్నాం!

కథామంజరి దీపావళి కథల పోటీలో తృతీయ బహుమతి పొందిన కథ



# ఎటువైపు

రమాదేవి నెల్లుట్ల

'ఎప్పుడొచ్చినవ్ రా సురేష్? ఉంటవా నాల్గు దినాలు?' బైక్ ఆపి ఓ కాలు కింద పెట్టి మరీ అడుగుతున్నాడు మధు.

కిరాణా షాప్ లో టీ పొడి కొనుక్కుని నడిచి వస్తున్న సురేష్ తలెత్తి చూసి 'మొన్ననే ఒచ్చిన!' అన్నాడు రెండోప్రశ్నకు జవాబు ఇవ్వకుండా .

'సాయింత్రం ఇంటికొస్త తియ్యి.' అంటూనే వెళ్లిపోయాడు మధు .

'ఎందుకు' అన్న ప్రశ్న బయటికి రాకుండా గొంతులోనే ఉండిపోయింది.

టీ చేసుకుని తాగుతూ ఆలోచిస్తున్నాడు. వారం రోజులకే పిచ్చెక్కినట్టుగా ఉంది. ఏం చేయాలో తోచడం లేదు. తల్లీ, తండ్రీ పొలానికి పోయారు. సాయంత్రం ఆరింటికి గానీ రారు.  అన్నం, కూరా వండి పెట్టి ఉంచాననీ, ఆకలైనప్పుడు తినమనీ చెప్పి వెళ్ళింది తల్లి. ఇప్పుడే తినాలని లేదు. ఆకలీ లేదు, తిన్నాక చేసే పనీ లేదు.

కాసేపు టీవీ పెట్టాడు. ఓ ఛానల్ లో ఏదో సిన్మా వస్తోంది. ఇంకో దాంట్లో పాటలు, మరో దాంట్లో ఏదో లైవ్ షో! అవే ప్రోగ్రామ్స్.  ఇంచు మించు అన్ని ఛానెల్స్ లోనూ ఒకే రకం కార్యక్రమాలు! ఎక్కువ సేపు చూడలేక రిమోట్ పక్కన పడేశాడు. డొక్కు టీవీ! ఏమీ చూడబుద్ది కావడం లేదు. స్నానం చేసి కాసేపు అట్లా బజారుకు పోయి వద్దామా అనుకున్నాడు. మళ్ళీ బద్దకంగా కుర్చీలో కూలబడ్డాడు. అసలు ఏమీ చేయాలనిపించడం లేదు. అలా అని ఊరికే ఉంటే పిచ్చెక్కుతోంది. కుర్చీలో వెనక్కు వాలి ఇంటి కప్పుకేసి చూసాడు.  అక్కడక్కడా బూజు పట్టి ఉంది. దులుపుదామా అనుకున్నాడు. లేవ బుద్ధి కాలేదు.

మూడు గదుల ఇల్లది. ముందు గదిలోనే ఒక దాంట్లో ఒకటి వేసి పెట్టిన నాలుగు ప్లాస్టిక్ కుర్చీలూ, ఓ బల్లా,  టీవీ ఉన్నాయి. ఇంకా చిన్నా చితకా సామాన్లూ అందులోనే పెట్టి ఉన్నాయి. దాన్ని ఆనుకుని ఓ చిన్న గది, మరో చిన్న వంట గది వున్నాయి. ఇంటి ముందు వాకిలీ, పెరట్లో కొంచెం జాగా ఉన్నాయి.  చిన్న గదిలో ఓ మంచం, చెక్క బీరువా ఉన్నాయి. ఇంటి వెనుక చిక్కుడు, ఆనప, బీర పాదులు, ఓ జామ చెట్టు ఉన్నాయి. ఈ ఇల్లు కట్టి మూడేళ్లయింది. ఇంత చిన్న ఇల్లు కట్టడానికైనా తల్లీ, తండ్రీ ఎంత కష్టపడ్డారో సురేష్ కు తెలుసు. సురేష్ అక్కకి పెళ్లయి ఎనిమిదేళ్లయింది. ఇద్దరు పిల్లలు కూడా. బావ మేస్త్రీ పని చేసి బాగానే సంపాదిస్తున్నాడు. ఇక చెల్లికి నిరుడే పెళ్లయింది. ఆమె భర్త ఆటో నడుపుతాడు. కిరాణా షాప్ ఉంది. దాన్ని సురేష్ చెల్లెలే చూసుకుంటుంది.

★★★

సురేష్ బాగానే చదువుకునేవాడు. ఒక్క కొడుకని కొంచెం గారాబంగానే పెంచారు . జిల్లా కేంద్రంలో బీ టెక్ అయ్యాక  ఆరు నెల్లకిహైదరాబాద్ లో ఓ సాఫ్ట్ వేర్ కంపెనీకి అప్లై చేసుకుని జాబ్ సంపాదించాడు. నెలకు పన్నెండు వేలు జీతం. సాఫ్ట్ వేర్ ఇంజనీర్ అంటే ఉన్న భ్రమలు అన్నీ కొద్ది కాలంలోనే తొలగిపోయాయి. ఏ టీం కి అలాట్ చేస్తే, ఆ టీం లీడర్  కి అనుకూలంగా ఉంటూ పని చేయాలి.  కొత్తప్రాజెక్ట్ వస్తే వాళ్ళు చెప్పిన విధంగా ఆ పని నేర్చుకుని చేయాలి.  డే, నైట్ షిఫ్టుల్లో ఏదైనా చేయడానికి సిద్దపడాలి. కొన్నాళ్లకు  కాలేజ్ లైఫ్ నుండి బయటపడి పనికి అలవాటు పడ్డాడు సురేష్.

ఆ ఆఫీసులోనే పనిచేస్తున్న మరో ముగ్గురితో కలిసి షేరింగ్ బేసిస్ మీద ఆఫీసుకు దగ్గర్లో ఉన్న అపార్టుమెంటులో ఉన్నాడు. రెంట్, వంట సామాన్లు, ఇతర ఖర్చులకే జీతమంతా ఖర్చయినా ఏదో తల్లిదండ్రుల మీద ఆధారపడకుండా బ్రతుకుతున్నాననీ, రానురానూ జీతం పెరుగుతుందనీ ఆశతో ఉన్నాడు సురేష్. టీమ్లీడర్ సురేష్ పనిని అస్సలు మెచ్చేవాడు కాడు. ఏది చేసినా ఓ తప్పు వెదకడం, విసుక్కోవడం చేసేవాడు. కొన్నాళ్ళు పోయాక టీమ్ మారిస్తేనో లేక కాస్త అనుభవం వచ్చాక ఇంకో కంపెనీకి మారితేనో బావుంటుందని ఎన్నోసార్లు అనుకున్నాడు.

★★★

కోవిడ్ ప్రభావంతో ముందుగా లాక్ డౌన్... ఆ తర్వాత వర్క్ ఫ్రమ్ హోమ్ మొదలయ్యాయి. మునుపటి కంటే ఘోరమైన పని గంటలు, వేళాపాళా లేకుండా మీటింగులు మొదలయ్యాయి. మిగతా రూమ్ మేట్స్ తో మాట్లాడుదామన్నా తీరిక దొరకని పరిస్థితి! ఓ రోజు సురేష్ కి మెసేజ్ వచ్చింది ‘ఆ నెలాఖరు వరకూ వచ్చే జీతం అకౌంట్ కి పంపామనీ, వచ్చే నెల నుండీ పని చేయక్కర్లేదనీ, అవసరం ఉంటే మళ్ళీ పిలుస్తాం.. ఈలోగా లాప్ టాప్ సరెండర్ చెయ్యమనీ ...ఈ విషయంలో ఇక ఎలాంటి కరెస్పాండెన్స్ చేయవద్దనీ!’

ఒక్క వాళ్ళ కంపెనీయే కాదు, చాలా ఐటీ కంపెనీలు రిట్రెంచ్మెంట్ మొదలుపెట్టాయి. ఎక్కడ అప్లై చేసినా ‘మేమే ఉన్న వాళ్ళను తీసేస్తున్నాం, ఏదైనా ఛాన్స్ ఉంటే తరువాత చూద్దాం.’ అనే వాళ్ళే! సురేష్ రూంమేట్స్ ముగ్గురికీ ఈ పరిస్థితి లేదు. కొన్నాళ్ళు పోయాక వాళ్ళు ఏమీ అనకపోయినా ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా అక్కడ ఉండడం బావుండదనిపించి సామాను సర్దుకుని వచ్చేసాడు.

కొడుకు దిగులుగా ఉండడం చూసి, సురేష్ వాళ్ళ నాన్న విషయం తెలుసుకున్నాడు.

‘అయితె మానె తియ్యి కొడుకా! ఏం చేస్తం ? కాలం గిట్లొచ్చె ! మల్ల ఏదన్న దొరికె దాంక గీడనే ఉండు.’ అన్నతల్లి దండ్రుల మాటలు సేద తీర్చినా ఇలా ఎన్నాళ్ళు అన్న దిగులు అతన్ని వదల్లేదు.

తల్లిదండ్రులిద్దరూ పొలానికి పొద్దున వెళ్ళి సాయంత్రానికి రావడం, నాలుగు మాటలు మాట్లాడుతూనే ఇంత వండుకు తిని నిద్ర పోవడం చూస్తున్న సురేష్ కు వాళ్ళని డిస్టర్బ్ చేయాలనిపించక మాటలు పొడిగించక పోయేవాడు. తనతో చిన్నప్పుడు కలిసి చదివిన వాళ్ళు కూడా ఇప్పుడు ఊర్లో ఎవరూ లేరు. రోజులు గడుస్తున్న కొద్దీ అతనిలో నిరాశ పెరగసాగింది. ‘ఇలానే ఉంటే తనకు పిచ్చెక్కడం ఖాయం.’ అనుకున్నాడు. ఒకట్రెండుసార్లు తానింకా బతికి ఉండడం అవసరమా అని కూడా అన్పించింది.

సాయంత్రం పక్కనే ఉన్న పెదనాయన ఇంటికి వెళ్ళాడు. వాకిట్లోనే దూడకు గడ్డి వేస్తూ ఎదురైంది నర్సమ్మ.

‘బాగున్నావుర మనుమడా! ఎప్పుడొచ్చినవ్?’ నవ్వుతూ పలుకరించింది.

‘వారం అయింది బాపమ్మా! నువ్వు ఎట్లున్నవ్?’ అడిగాడు నాయనమ్మని.

‘మాదేమున్నదిరా, మీ పడుసోండ్లు బాగుండాలె! పెండ్లి సమ్మందం చూసే తందుకు బచ్చినావురా? పెద్దనౌకరీ చేస్తానవట గద!’ సంతోషంగా అడిగింది .

‘నా బొంద నౌకరి’ అనుకున్నాడు మనసులో.

‘ఒగ ఊరోల్లను ఇంకొగ దిక్కు రానిస్త లేరట గద! నువ్వెట్లొచ్చినవ్?’ తనే అడిగింది.

‘ఇప్పుడు కొంచెం నయమే! ఎరుకున్నోళ్ళు బస్తుంటే వాళ్ళ తోని బచ్చిన!’ అన్నాడు.

తనతో మాట్లాడుతూనే నర్సమ్మ ఏదో ఒక పని చేస్తూనే ఉండడం గమనించాడు సురేష్. దూడకు గడ్డివేసింది. రెండు గోలాల నిండా నీళ్లు చేది నింపింది. చెట్లకు నీళ్లు పెట్టింది. కట్టెల పొయ్యి అంటించి పెనం మీద జొన్నరొట్టెలు కాల్చింది. రోట్లో ఉల్లిగడ్డ కారం నూరింది.

“పెద్దమ్మా! కోడి గుడ్లు కావాలె.” అంటూ వచ్చిందొక అమ్మాయి.

"ఉండే పిల్లా! ఇస్త..ఎన్ని గావాలె?" అంటూనే చేతులు కడుక్కుని లోపలికెళ్ళి కోడిగుడ్లున్న బుట్ట తెచ్చింది.
"మూడు గుడ్లు గావాలె!" అని డబ్బులిచ్చి గుడ్లు కొనుక్కుని వెళ్ళింది అమ్మాయి.
"గుడ్లు కూడా అమ్ముతవా బాపమ్మా?" అడిగాడు.
"అయ్యో! ఎన్ని పనులు జేస్తె గీ బతుకు తెల్లారుతది కొడుకా! కాల్ రెక్కలు ఆడినన్నాళ్లు ఏదో ఒగ పనిజెయ్యాలె గద ! రెండు బర్రెలున్నయ్, వాటి పాలు పిండి కేంద్రంల పోస్త, కోళ్లు పెంచుతాన గద.. వాటి గుడ్లు అమ్ముత. ఇంటి కాడివి, పొలం కాడివి కూర గాయలు మార్కెటుకు పొయ్యే వ్యానుకు ఇస్త! పొలం కాడ పని ఎక్వఉంటె ఆడికి కూడ పోత. మీ పెద్దమ్మ, పెదనాయిన బాయి కాడినించి అచ్చేదాక ఇల్లు పట్కోని ఉంట. నా పైసలు నాకు ఉండాలె గద!" అన్నది నర్సమ్మ.
మాటల్లోనే సురేష్ పెద్దమ్మ, పెదనాయన పొలం నుండి ఇంటికి వచ్చారు. సురేష్ ను పలుకరించారు. మరికొద్ది సేపటికే ట్రాలీ ఆటోతీసుకుని మధు వచ్చాడు.
"మీ ఇంటికి పోయిన తమ్మీ! నువ్వు లేవు. బయిటికి గిట్ల పోయినవనుకున్న!" అన్నాడు.
సురేష్ ఏమీ మాట్లాడలేదు.
ఇంట్లోకి వెళ్లిన మధు గోనె పట్టాలు తెచ్చి బావి గట్టు మీద వాటిని తడిపి ట్రాలీలో ఉన్న సంచుల మీద కప్పాడు.
"ఎందుకన్నా తడి సంచులు కప్పుతున్నవ్?" అడిగాడు సురేష్.
"కూరగాయలున్నయ్, పాడు గాకుండ ఉంటయని!" చెప్పాడు మధు.
"మీ అన్న దినాం ఊర్లె అందరి కాడ సాయంత్రం కూరగాయలు కొని తెల్లారగట్ల నాలుగింటికి పొయ్యి వరంగల్ మార్కెట్ల అమ్ముకొస్తడు. మల్ల ఆడికెల్లి ఏమన్న కిరానం గిట్ల లోడ్ ఉంటె కిరాయికి ఏస్కోని వొస్తడు. వానిది వాడు మంచిగానె సంపాయిస్తాండు. కరోన ఉన్నా ఏదున్నా వండుక తినుడు ఆగదు గాదుర ! వాని పనికి గిరాకి మంచిగనే ఉన్నది." అన్నది నర్సమ్మ.
"వదినె కనిపిస్త లేదు?" అన్నాడు సురేష్ ఏం మాట్లాడాలో తెలియక.
"మీ వదినె అవ్వగారింటికి పోయింది డెలివరుకు! ఆమె సుత వట్టిగ ఏముండదు, అంగన్ వాడిల పనిజేస్తది." చెప్పింది నర్సమ్మ.
"గవ్వన్ని గిప్పుడెందుకే బాపమ్మా! ఏదో మనిషొక్క పని చేసుకుంటెనే అయితది. వాని లెక్క పెద్ద నౌకరీ గాదు గద! శిన్నప్పుడు మంచిగ చదువుకోక పోతిని!" అన్నాడు మధు.
"ఏం పెద్ద ఉద్యోగం? అంత ఏమీ లేదు." సురేష్ అంటూండగానే లోపలి నుంచి మధు తల్లి వచ్చి, "ఇయ్యాల గిడనే తిను సురేష్ ! ఎప్పుడు మా ఇంట్ల ఇస్తరు ఏస్తనే లేవు." అన్నది.
"అయ్యో! ఎందుకు పెద్దమ్మా, ఇంటికి పోత! అమ్మా, నాయిన ఎదురు చూస్తుంటరు." అని లేచాడు. కానీ, వాళ్ళు తినేదాకా వదిలి పెట్ట లేదు.

★★★

రాత్రి ఎంతకూ నిద్ర పట్టలేదు సురేష్ కి. అలసి పోయారేమో తల్లీ తండ్రీ గాఢ నిద్రలో ఉన్నారు. 'రోజంతా కష్టం చేస్తారు, ఉన్నదేదో తిని కంటి నిండా నిద్ర పోతారు. కలిగిన దానితో తృప్తి పడతారు. ఒక విధంగా వాళ్ళే సంతోషంగా ఉన్నారు. తనేదో ఉద్ధరిస్తాడనుకుంటే ఇలా ఏమీ చేయకుండా వాళ్ళ మీద పడి తినడం సిగ్గుగా ఉంది.
చదువు పేరుతో తనకు వ్యవసాయం గానీ, ఇంకే పని గానీ నేర్పలేదు. తన లాగా తన కొడుకు ఎదుగూబొదుగూ లేకుండా ఉండొద్దనీ, బాగా చదివి పెద్ద ఉద్యోగం చేయాలనీ కోరుకున్నారు వాళ్ళు. తీరా తన పరిస్థితిచూస్తే ఇలా ఉంది. ఇప్పట్లో మరేదో పని దొరుకుతుందనే నమ్మకం కూడా లేదు. ఈ కరోనా వల్ల ఆర్థిక వ్యవస్థే అతలాకుతలం

అయింది. అన్ని ప్రైవేట్ కార్పొరేట్ ల వాళ్ళు ఆఫీస్ నడిపే ఖర్చు లేకుండా, వర్క్ ఫ్రమ్ హోమ్ పేరుతో సిబ్బందిని తగ్గించేసి ఉన్న వాళ్ళ మీదే డబల్ లోడ్ వేస్తూ పని చేయిస్తున్నారు. ఒక్క ఐటీ అనే కాదు దాదాపుగా అన్ని రంగాల పరిస్థితీ అలాగే ఉంది. గవర్నమెంట్ లో ఉద్యోగాల భర్తీ లేదు. ఎక్కడైనా చిన్న జీతానికైనా ఉద్యోగం దొరికేలా లేదు. ఈ పరిస్థితి ఎప్పటికైనా చక్కబడుతుందో లేదో తెలియదు. మరేంచేయాలి?' సురేష్ తల వేడెక్కింది.

★★★

చూస్తుండగానే మరో నెల రోజులు గడిచాయి. సురేష్ ఇంచుమించు అజ్ఞాతవాసం గడుపుతున్నాడు. ఆ సాయంత్రం సురేష్ తల్లికి అన్న వరుస అయిన రాజమౌళి వచ్చాడు. తల్లితో మాట్లాడుతుంటే సురేష్ తెలియకుండానే వినసాగాడు.

"ఏమైందన్నా! వాల్లు మాట ముచ్చటకు ఎప్పుడు వస్తరట?" సురేష్ తల్లి పద్మ అడిగింది.

"ఆ ముచ్చెట ఇడిశి పెట్టు! దాని తాత అసుమంటి సమ్మందం సూస్త!"

"గదేందన్నా, అంత మంచిగనే ఉండె గద, ఈ ఉగాది ఎల్లంగనె లగ్గం సుత జేస్తమనిరి!"

"గది గాదు సెల్లే, వీనికి ఉద్యోగం గిట్ల లేదని గా పిల్ల నచ్చుత లేదట!"

వింటున్న సురేష్ ఉలిక్కి పడ్డాడు.

"అయితేంది? వానికేం తక్వ? బూమి జాగ లేదా, ఇల్లు లేదా, తినేతందుకు తిండి లేదా? నువ్వు సంజాయించక పోయినవ్ అన్నా!" ఉక్రోషంగా తల్లి గొంతు ....

"ఇయ్యాల రేపు ఆడి పిల్లలు ఇంటలేరు శెల్లె! నీకెందుకు? నేను ఉంకో పిల్లను జూస్త గద!" ఇంకా మాట్లాడుకుంటున్నారు వాళ్ళు .

ఆ రాత్రి అందరూ నిద్ర పోయినా, సురేష్ ఒక్క క్షణం కూడా పడుకోలేక పోయాడు. చివరికి చేసుకునే అమ్మాయికి కూడా తను నచ్చలేదు. అసలు ఎవరో ఎందుకు.. తనకు తనే నచ్చడం లేదు. ఇది కరోనా ఉందనీ, ప్రస్తుత సమస్య అనీ కాదు. తనకు మళ్ళీ ఉద్యోగం దొరుకుతుందా? అసలు ఏ ఉద్యోగమూ దొరక్కుంటే ఏం చెయ్యాలి? తనకు ఇంకో పనేదీ చేతకాదు. ఇలా ఎన్నాళ్ళు? ఏం చేయాలి? తన లాంటివాళ్ళు ఏం చేస్తున్నారో!

ఇంట్లోంచి బయటికి వచ్చాడు సురేష్. టైం ఎంతయిందో కూడా తెలీదు. కళ్ళు మండుతున్నాయి. ఎటువెళ్తున్నాడో కూడా తెలియక కాళ్ళు తీసుకెళ్లిన వైపు నడిచాడు. దూరంగా ఎక్కడో రైలు కూత విన్పించింది. ఊరి నుండి రెండు కిలో మీటర్ల దూరం అడ్డ బాట నుండి వెళ్తే రైలు పట్టాలొస్తాయని గుర్తొచ్చింది. రైలు కిందపడితేనో ... ఒక్క క్షణం గుండె ఝల్లుమంది. మళ్ళీ ఆలోచిస్తే అదే కరెక్ట్ అనిపించింది. చచ్చిపోతే ఎవ్వరికీ ఏ బాధా ఉండదు. రెండ్రోజులు ఏడ్చి ఊరుకుంటారు. మళ్ళీ మనసు మారుతుందేమోనని వడి వడిగా నడవసాగాడు.

ఎక్కడో కోళ్లు కూస్తున్నాయి. ఒక్కసారి చుట్టూ చూసాడు. కరెంట్ మోటార్ శబ్దం వినిపిస్తోంది. పంపు లోంచి నీళ్లు ధారగా పడుతూ వరి పొలాన్ని తడుపుతున్నాయి. ఎవరో పారతో కాలువ చేసి నీరు ఒక దాని తరువాత మరో మడికి మళ్లిస్తున్నాడు. ఎటూ చూడకుండా తాను చేస్తున్న పనిని దీక్షగా..ఒక తపస్సు లాగా చేస్తున్నాడు అతడు. అంతా నిశ్శబ్దంగా ఉంది.

"ఏందిరా! గిటొచ్చినవ్? పండుకోలే?" అన్న మాటలు పక్కగా వినపడే దాకా చేతిలో పారతో అప్పటిదాకా పని చేస్తున్నది తన తండ్రి యాదగిరి అని తెలియలేదు సురేష్ కి.

"గింత రాత్రి ఏం జేస్తున్నవ్ బాపూ?" అడిగాడు సురేష్ తండ్రి ప్రశ్నకు జవాబు ఇవ్వకుండా.

"రాత్రేందిర! గిప్పుడు ఏగిలి బారుతాంది! జర్ర ఆగితె తెల్లారుతది. గీ టైంల ఫుల్లు కరంటు ఉంటది. పొలానికి నీళ్లు పెడితె మంచిగుంటది. అందరం గిప్పడే వస్తం బాయి కాడికి. జర్ర ఆగినంక పురుగులమందు కొడ్తే మంచిగ పట్టుకుంటది."

"గింత కష్టపడుతున్నవు బాపూ, ఏమన్న వస్తుందా ఇండ్ల?" సురేష్ అడిగాడు.

"కన్నతల్లి లెక్క బువ్వ పెడతాంది గాదుర! మీరంత ఎట్ల పెరిగిన్రు ... ఎట్ల పెద్దగ అయిన్రు! గీ బూమితోనే గాదా! అయినా గీ పని గాక నాకు ఇంకేమొస్తది? సదువుకున్ననా ఏమి? ఏదో గింత పంట ఏస్త .. ఒగ దిక్కు కోళ్లు సాదుతది మీ అమ్మ. మన గొర్రెలు నాలుగు గా మల్లేశం సూస్తడు. ఒగ బర్రె పాలు అమ్మతం, ఇంకొకటి గిప్పుడే కట్టింది. ఒగ మడిల కూరో కాయో ఏస్తం ! అన్ని కలిస్తెనే గిట్ల బతుకుతానం" తండ్రి కళ్ళల్లో పొలం పట్ల అంతు లేని ప్రేమ!

"నీ కొడుకొచ్చిండా ఏంది యాదన్నా!" శంకర్ రావడంతో వాళ్ళ సంభాషణ తెగి పోయింది.

"ఏం జేస్తున్నవ్, సిటీల జాబ్ చేస్తున్నవట గద! ఎప్పుడొచ్చినవ్?" శంకర్ అడిగాడు. అతడు ఊర్లో కొంచెం మోతుబరి. ఎమ్మెల్యేకి దగ్గర అని చెప్పుకుంటారు. చిన్న చిన్న పైరవీలు చేస్తుంటాడు. మూడు ట్రాక్టర్లు, ఒక హార్వెస్టర్ ఉంది. అన్ని ఖర్చులూ పోను రోజుకి మూడు నుండి అయిదు వేలు సంపాదిస్తాడంటారు.

"కరొన జెయ్యంగ ఉద్యోగం పోయింది శంకరన్నా, ఇంటి కాడనే ఉంటాండు. మల్ల చాల్ అయితె పోతడు !" సురేష్ మాట్లాడే లోపలే యాదగిరి చెప్పాడు.

"ఎన్ని దినాలయింది?" వదిలేలాగా లేడు శంకర్.

"ఆరు నెల్లు దాటింది, అయితేంది?" చెప్పాడు యాదగిరి.

"ట్రాక్టర్ నడుపుతవా? అయినా ఇయ్యాల రేపటి పోరలకు బండ్లు నడుపుడు రాక పోవుడేంది?" నవ్వాడు శంకర్.

నైన్త్ క్లాస్ లో ఉండగా సరదాగా ఫ్రెండ్ రాజేష్ వాళ్ళ ట్రాక్టర్ నడిపింది గుర్తొచ్చింది. తలూపాడు.

"మరింకేంది? రేపట్నుంచి రా! ట్రాక్టర్ ఇస్త ...నడుపు! ఏడ గిరాకి ఉంటె గాడికి పోవాలె!"

సురేష్ ఏదో మాట్లాడబోయాడు .

"రోజుకు అయిదు వందలిస్త... గంట రొండు గంటలు ఎక్వ ఐతే ఇంకో వందిస్త! ఉత్తగ ఉండేదానికంటె నయమే గద! నీ ఇష్టం!" శంకర్ అన్నాడు.

'రోజుకు అయిదు వందలు... నెలకు పదిహేను వేలు! తన జీతం కంటే ఎక్కువ!' ఆలోచిస్తున్నాడు.

"నీకిష్టం లేకుంటె ఒద్దు కొడుకా! శంకరన్న ఏమనుకోడు తియ్యి!" కంగారుగా అన్నాడు యాదగిరి.

"ఇయ్యాల రేపు బిల్డింగ్ మేస్త్రీలకు, కార్పెంటర్లకు రోజుకు ఎనిమిది వందలు ఒస్తానయ్. పత్తి శేన్లల్ల కూలికిపొయ్యే ఆడోండ్లకు ఇస్తాన్రు అయిదు ఒందలు !" అన్నాడు మళ్ళీ యాదగిరి.


"వాళ్ళది మోటు కష్టం గాదె యాదన్నా! సరె తియ్యి ... ఇగ రోజుకు ఆరు వందలిస్త! రేపట్నుంచి రమ్మను" అన్నాడు శంకర్.

తొందరగా' సరే 'అన్నాడు సురేష్. శంకర్ వెళ్ళిపోయాడు.

"నీకిష్టమేనా కొడుకా? గా పని చెయ్య లేస్తవా మరి!" అడిగాడు యాదగిరి.

అంగీకారంగా తలూపాడు సురేష్. దూరంగా రైలు కూత విన్పించింది. కాసేపటి కిందటి తన ఊహ గుర్తొచ్చింది. తూరుపు కొండల మధ్య నుండి సూర్యుడు మెల్లగా పైకి వస్తున్నాడు. పక్షులు కిచకిచ మంటూ ఆహారానికి బయలుదేరాయి.

★★★O★★★



# వల్లకాటి వసంతం

బద్రి నర్సన్

తెల్లారింది గాని ఆమె లేవలేదు. రోడ్డు పక్కన బతుకు కాబట్టి పొగ దుమ్ముకు దగ్గి దగ్గి, ఇక తట్టుకోలేనంటూ ఆమె ఊపిరి ఏ నడిరాత్రో ఆగిపోయింది. అందుకే పొద్దు పొడిచినా ఆమెలో చలనం లేదు. మామూలుగానైతే ఇలాంటి శవాలను మున్సిపల్ బండివాళ్లే చెత్తలో వేసుకొని పోయి ఊరు బయట కుప్పల పక్కన పూడ్చి పెట్టేస్తారు. జనాభా లెక్కల్లో జమా , ఖర్చు ఏదీ ఉండదు. ఈ శవానికి మాత్రం ఒక కొడుకున్నాడు. ఆ సాగనంపు బాధలేవో వాడే పడతాడని చెత్త బండి తప్పించుకుంది. శవం పక్కన కూచున్న పదేళ్ల మల్లేషు తల్లి చచ్చిపోయిన దుఃఖం మరచిపోయి తనేం చేయాలో తోచక దిక్కులు చూస్తున్నాడు. అప్పుడప్పుడే తెరుచుకుంటున్న కూరగాయల, చిన్న కిరాణా కొట్ల దగ్గరికెళ్లి 'మా అమ్మ లేస్త లేదు' అని చెప్పాడు. ఖాళీగా ఉన్నవాళ్లు, ఏమైందో చూద్దామనుకొనేవాళ్ళు మెల్లగా వచ్చి వంగి అటు ఇటు చూసి ఆమె కళ్ళు తేలేసి నోరు తెరుచుకున్న తీరు, ఈగలు వాలుతున్న ముఖాన్ని చూసి 'ఔనా.. ఇది చచ్చింది' అని ఒకరు, 'కాల్చేస్తావో పూడ్చేస్తావో' అని ఒకరు, 'ఇట్లా చక్కగా పోతే శ్మశానం ఉంటది. ముందు వాళ్ళనడిగిరాపో' అని ఒకరు చెప్పేసి ఎవరి పనుల్లో వారు బిజీ అయ్యారు. మల్లేషు అడుక్కుంటూ శ్మశానం దారి పట్టాడు.

★★★

సర్కారు దవాఖాన సంతలా ఉంది. గంట నించి ఎదురుచూస్తున్న శివయ్యకు డాక్టరు ముందుకెళ్లే అవకాశం దొరికింది.

"ఏపని చేస్తావ్?" అని డాక్టరు అడిగాడాయన్ని.

"కాటికాపరినయ్యా!" అన్నాడు.

ఆ మాట వినగానే డాక్టరు షాకు తిన్నట్లు కొద్దిగా వెనక్కి జరిగి "ఆ...! చెప్పు." అన్నాడు.

శివయ్య కొద్దిసేపు చెప్పగానే డాక్టర్ మధ్యలోనే ఆపేసి "అదే పని చేస్తే ఎక్కువ కాలం బతకవు. ఈ మందులు వాడు." అని చీటి చేతిలో పెట్టి ఊపిరి పీల్చుకున్నాడు.

శివయ్య బయటికి రాగానే గాబరాగా ఎదురెళ్ళిన బాలమ్మ "డాక్టరేమన్నాడు?" అంది.

ఏదో గొణుగుతూ ఆమె భుజం మీద ఆసరాగా చెయ్యేసి బయటికి నడిచాడు.

శివయ్య పుట్టి బుద్దెరిగిన్నుంచి శవాల్ని దహనం చేయడమే బ్రతుకుతెరువు. చిన్నప్పుడు తండ్రికి సాయపడ్డాడు. తల్లెవరో తెలియదు. ఆమెను చూడనైనా చూడలేదు. ఎప్పుడు మత్తులో ఉండే తండ్రి, తల్లి గురించి ఏనాడూ చెప్పలేదు.

తనకు కూడా పెద్దగా ఆసక్తి లేకుండేది. తండ్రి పెట్టింది తింటూ ఇచ్చింది తాగుతూ పెరిగాడు. కుక్కలు, పిల్లులతో తప్ప మరో మనిషి అనే ప్రాణితో వారికి అనుబంధం ఉండేది కాదు. తండ్రి పోయాక తానొక్కడే ఆ పనంతా చూసుకుంటున్నాడు. బాలమ్మ పక్కింటి పిల్లా కాదు, పాత చుట్టమూ కాదు. ఓ బిచ్చగత్తె. కడుపంటే ఆకలేనని తెలిసిన ఆమెకు, కడుపు కావడమొకటి ఉంటుందని తెలియని వయసులో కాలు జారింది. కాలానికి పెరిగిన కడుపు తెచ్చిన చిక్కులతో చావడానికో, ఆశ్రయానికో ఓ రాత్రి శ్మశానంలోకి వచ్చింది. జన్మజన్మల బంధంలా ఒకరికొకరు తోడయ్యారు. పెళ్ళీ లేదు, పేరంటం లేదు. కలిసి బతుకుతున్నారు.

పేరుకు ఊర్లో ఉన్నట్టే గాని వీరు మనుషుల మధ్య ఉన్నట్టు లెక్కలోకి రారు. శవాలు తగలేసే వారంటే అందరికి ఈసడింపే., పైగా వీళ్ళేదో దయ్యాలు, భూతాలతో సహవాసం చేస్తారనే భయం. వీరి వృత్తి నెరిగిన వారు ఎదురైతే ఆ వైపుగా వెళ్ళిపోతారు. ఎదురెళ్ళడమే అపశకునంగా భావిస్తారు. దుకాణాల వాళ్ళు దూరం నుండే వస్తువులిస్తుంటారు. హోటల్ వాళ్ళైతే లోపలికే రానియ్యరు. ఒక్క బ్రాందీ షాపు దగ్గరే ఏ బాధ ఉండదు. మద్యమే శివయ్య నిత్యావసర వస్తువు. మత్తు సెగలో తనను కాల్చుకుంటే తప్ప కాష్టం దగ్గరగా వెళ్లి శవాన్ని కాల్చలేని వృత్తి అతనిది.

శివయ్య చూసినన్ని శవాల్ని ఎవరు చూసి ఉండరేమో. హాస్పిటల్లో చనిపోయినా, ప్రమాదాల్లో ప్రాణం పోయినా, ఇంట్లో ఊపిరి వదిలినా అన్నిటి గమ్యస్థానం శివయ్య క్షేత్రమే. ఎన్ని రకాల శవాల్ని చూశాడో అతను. కొన్ని కుళ్లిపోయి తల తిరిగే వాసన కొడుతుంటాయి. కొన్ని ఆత్మహత్యలతో నాలుక బయటపెట్టి గుడ్లుమిరి చూస్తుంటాయి. కొన్ని రోడ్డు ప్రమాదంలో ముక్కలై పీక్కుతిన్నట్లుగా ఉంటాయి. ప్రేమించి ఓడిపోయిన యువ మృతజీవాలు ఉంటాయి. కృంగి కృశించి ఎముకలగూడులైన ముదుసలివి ఉంటాయి. హఠాత్తుగా గుండెపోటుతో చచ్చి, నిద్రలో ఉన్నట్టుగా కనబడే శవాలూ ఉంటాయి. దేన్నయినా శివయ్య కాల్చి బూడిద చేయాల్సిందే. శవాన్ని ఇంటివారు తప్ప ఎవ్వరు దగ్గరగా చూడరు. యింటివారిని కూడా ముట్టు, అంటూ అని తెలిసినవారు అంటీ ముట్టనట్టే ఉంటారు. కర్మలకు పిలిస్తే వారాలు తిథులు చూసుకుంటారు. అదే కాటికాపరికయితే ఏ నియమాలు, భయాలు ఉండకూడదు. వాడు శవాలను మట్టిలో కలిపే మానవాతీతుడు. ఇంట్లో శవం లేచినప్పుడే వాడు ఆపద్బాంధవుడు. వాడికి కాల్చడానికి కిరోసిన్, తాగడానికి బ్రాందీ ఎంతంటే అంతా ఇస్తుంటారు. ఆ తర్వాత వాడు ప్రేతాత్మల మిత్రుడిగా కనబడతాడు.

చివరకు శవాల్ని కాల్చి కాల్చి శివయ్య శవమయ్యే కాలం దగ్గరికొచ్చింది. శవాల కంపు, పొగ, అన్నిటికి మించి తాగక తప్పని మద్యపు సెగ అతన్ని లోలోన దహనం చేస్తున్నాయి.. "ఈ పని కాదంటే ఇద్దరమూ కాష్టాన్ని పేర్చుకోవడమే." అనుకుంటూ శివయ్య, బాలమ్మ శ్మశానం దగ్గరికి వచ్చారు.
వారిని చూడగానే మల్లేషు ఎదురెళ్లి "మా అమ్మ చచ్చిపోయింది" అని ఏడుస్తూ చేతులు జోడించాడు. మల్లేషు బతుకు, బతుకే చోటును ఆరా తీశారిద్దరు. విషయమంతా అర్థమైంది. బాలమ్మ గుడిసె వైపు వెళ్లగా, శివయ్య లేని ఓపిక తెచ్చుకొని మల్లేషు వెంట నడిచాడు. ఓ పాత పళ్ళ బండిలో శవాన్ని వేసుకొని వచ్చి, అక్కడక్కడ సగం కాలిన కర్ర మొట్లను, ఎండిన చెట్ల కొమ్మలను దగ్గరికి చేసి మొత్తానికి దహన సంస్కారం ముగించారు.

తమతో పాటు మల్లేషును పిలిచి బాలమ్మ అన్నం పెట్టింది.
"ఎక్కడైనా చుట్టాలున్నారా..?" అడిగింది బాలమ్మ మారన్నం పెడుతూ.
తింటున్న తల ఎత్తకుండా అడ్డంగా ఊపాడు మల్లేషు.

"నాయన..?" అన్నాడు శివయ్య.
"తెల్వది, ఎన్నడూ చూడలేదు." అన్నాడు తలఎత్తి నోట్లో ముద్ద గొంతుకు అడ్డం పడ్డట్లు.
'వీడికి తండ్రి తెలియదు, తనకు తల్లి తెలియదు, తామిద్దరికి అంతే తేడా' అనుకున్నాడు శివయ్య. తనలాగే మానం పోగొట్టుకున్న తల్లేమోనని బాలమ్మకు గతం గుర్తొచ్చింది.
అన్నం తిన్న శివయ్య మంచంలో ఒరిగాడు. బాలమ్మ గిన్నెలు సర్దడానికి గుడిసెలోకెళ్లింది. మల్లేషు కొద్ది దూరం నడిచి శ్మశానం పిట్టగోడపై కూచున్నాడు. వాడికి తెలియకుండానే కళ్ళు మూతలు పడడంతో గోడపైనే నిద్రలోకి జారుకున్నాడు. గిన్నెలు కడగడానికి బయటికొచ్చిన బాలమ్మ వాడి పరిస్థితి చూసి "అయ్యో కొడుకు అట్ల నిద్రవోయిండు..కిందవడితే ఎట్లా" అనుకుంటూ వాకిట్లో చాప పరిచి మల్లేషు దగ్గరికి పోయి నిద్రలోనే నడిపించుకుంటూ తీసుకొచ్చి చాపపై పడుకోబెట్టింది. గిన్నెలు మెల్లగా కడిగి లోపల పెట్టి బయట తడికకు ఆనుకోని కూచున్న బాలమ్మకు మల్లేషును చూస్తుంటే కడుపులో పేగు కదిలింది. నిండు కడుపుతో స్మశానానికి వచ్చిన రోజులు గుర్తుకొచ్చాయి.

★★★

ఆనాడు ఎండిన కొమ్మకు రాలడానికి సిద్ధంగా ఉన్న పండులాంటి కడుపుతో కనబడ్డ బాలమ్మను పిలిచి కూచోబెట్టి నీళ్లు తాపించాడు శివయ్య. ఆమె జీవితంలో నీళ్లడిగితే తరిమినవారే గాని, నీళ్లందించిన వారెవరు లేరు. నీళ్లు గొంతులో దిగుతుంటే ఏండ్లుగా గడ్డకట్టుకుపోయిన కన్నీరు కరిగి ఆమె గుండె బరువు తగ్గేలా సంద్రంలా పొంగి పొర్లింది. శివయ్య ఊరడింపుతో తెరలు తెరలుగా వచ్చిన దుఃఖం తెప్పరిల్లింది. తాను వండుకున్న దొంట్లోంచి సగం అన్నం గిన్నెలో వేసుకొని వచ్చి బాలమ్మ చేతికిచ్చాడు.
'ఏ వూరు నీది?" అడిగాడు అన్నం తినమన్నట్లు చేతితో సంజ్ఞ చేస్తూ.
"చిన్నప్పటి నుండి బస్టాండులో బిచ్చమెత్తుకొని బతికేదీ తెలుసు" అంది అన్నం కలుపుతూ.
"పెళ్లయిందా?" లేదన్నట్లు తలాడించింది.
తన కడుపుపై శివయ్య చూపులు పడగానే బాలమ్మ ఉన్నదున్నట్లు చెప్పింది.
"ఓ రోజు సెకండ్ షో అయినాక నలుగురు వచ్చి వంద రూపాయలు ఇస్తాం..వస్తావా.." అంటూ బస్టాండు వెనుకకు తీసుకపోయారు. తనను ఏంచేసినా రూపాయలే ఎక్కువనిపించినయ్ అప్పుడు.

అప్పడప్పుడు అట్ల వచ్చి డబ్బులు చేతిలో పెట్టేవాళ్ళు. ఓ రోజు పోలీసులు చూసి వాళ్ళని పట్టుకొని డబ్బులు తీసుకోని వదిలేశారు. మళ్ళీ బస్టాండులో కనబడితే జైలుకు పంపిస్తామని నన్ను వెళ్లగొట్టారు. అంగట్లో బిచ్చగాళ్లతో కొన్ని రోజులు గడిచినయ్.. కడుపు పెరగడంతో ' దొంగ ముండా..నువ్వు లంజెరికం చేస్తావని తెల్వది. ఇక్కడినుంచి కదులు. మళ్ళీ ఇటు కనబడితే కాళ్ళిరగ్గొడతాము' అని ఆడోల్లు నెట్టేసినారు. అక్కడిక్కడ తిరిగి ఇటు దిక్కు వచ్చిన" అంది.
శివయ్య తెలిసిన మంగలావిడను తీసుకొచ్చి బాలమ్మను పరీక్ష చేయించాడు.
బాలమ్మ కళ్ళు, నాలికను చూసి, కడుపును నిమిరి పిండం కదలికల్ని గమనించి ' "బలం లేదు., మంచిగా తినాలి. లేకుంటే తల్లికి బిడ్డకు ప్రాణగండమే." అందామె. ఇద్దర్ని కాపాడేందుకు శివయ్య ఎన్నో సేవలు చేశాడు. రెండు నెల్ల తరవాత బాలమ్మ బక్క పిసరు కొడుకును కన్నది. పిల్లాడు పెరుగుతున్నా కండ పుష్టి లేదు, నోట మాట లేదు. ఇరుగు పొరుగు లేని బతుకులు. అమ్మ, అన్నం, బాపు అనే చిన్న చిన్న పదాలను బాలమ్మ వాడితో వల్లె వేయిస్తోంది. ఫలితం అంతంతే. శవాన్ని దహనం చేస్తున్నప్పుడు ఎగిసిపడుతున్న మంటలు చూసి పిడికిళ్లు బిగించి గట్టిగా ఏడ్చేవాడు.

"మీరిక్కడుంటే వాడేమైతదో చెప్పరాదు" అని మంగలావిడ తనకు తెలిసింది చెప్పింది.
ఏం చేద్దాం, ఎక్కడికెళదాం, ఎలా బతుకుదాం అని ఇద్దరూ కొలిక్కి రాలేని సమస్యతో కాలు కదపలేకపోయారు. కాలం గడిచిందిగాని కలిసిరాలేదు.
మూడేళ్ళ పిల్లాడు ఓ రాత్రి పూట పక్కలోంచి మాయమయ్యాడు. ఆ చీకట్లోనే ఊరంతా వెదికారు, చితి మంటల్లో వెదికారు. దొరకలేదు. బయటికి వచ్చినవాడు తానే తప్పిపోయాడా.. ఎవరైనా ఎత్తుకెళ్లారా ఏమోగానీ ఇప్పటికి జాడలేదు.

★★★

పిల్లాడి రూపు కళ్ళల్లో తిరిగి కన్నీరైంది.
నిద్రలోంచి లేచిన శివయ్య మంచంలో కూచొని పక్కన పడుకొని ఉన్న మల్లేషును చూసి "వీడింకా ఇక్కడే వున్నాడా." అన్నాడు.
కళ్ళు తుడుచుకుంటూ ఔనన్నట్లు తల ఊపుతూ "పాపం కొడుకు.." అంది.
వీరి మాటల చప్పుడు మల్లేషు లేచి కూచున్నాడు.
కొద్దిసేపటికి వాడికి తానెక్కడున్నది ఎందుకొచ్చింది అర్థమైంది. లేచి ఎటువెళ్ళాలో తెలియక తల దించుకొని ఆలోచనలో పడ్డాడు.
విషయం అర్థమైనట్లు శివయ్య "నీకెవరు లేకపోతే ఉండాలనుకున్నంత కాలం మాతో ఉండు." అన్నాడు. "ఔను కొడుకా.. ఎనుక ముందు దిక్కులేనోనివి..ఎక్కడికని పోతావు..మాతోనే ఉండు." అంది బాలమ్మ. సరే అనలేదు..విడిచి వెళ్ళలేదు. కాలం గడుస్తోంది.

★★★

కుయ్..కుయ్..అనుకుంటూ అంబులెన్సు స్మశానంలోకి వచ్చింది. అప్పుడప్పుడు వస్తుంటాయి కానీ ఇప్పుడు నిండా నీలం రంగు ముసుగు కప్పుకున్నవాళ్ళు దిగారు. శివయ్య కోసం చూడకుండా వాళ్లే కట్టెలు పేర్చి పొడుగాటి సంచిలో తెచ్చిన శవాన్ని పడుకోబెట్టి నిప్పంటించారు.
కాటికాపరినంటూ శివయ్య దగ్గరికెళితే ఒకాయన అడ్డొచ్చి "అరేయ్..కరోనా శవం..దగ్గరికిపోతే రోగం అంటుకుంటది. కుక్కచావు చస్తవ్. దూరముండు." అని గద్దరిస్తూ "ఈయనకు వెయ్యి రూపాయలు చేతిలో పెట్టు" అని పక్కోడిని పురమాయించాడు.
చేతిలో పెట్టిన పైసలు తీసుకోని అంతా చూస్తూ దూరంగా నిలబడ్డాడు శివయ్య.

ఒకటి రెండ్రోజులకు ఒకటి వచ్చే శవాల లెక్క మారిపోయింది. రోజు అయిదారు వస్తున్నాయి. పనేమీ చేయకున్నా శివయ్య చేతికి డబ్బులొస్తున్నాయి. అప్పుడప్పుడు బజారుకెళ్తున్న మల్లేషు ఊర్లో విన్న కరోనా ముచ్చట్లు చెబుతున్నాడు. అదేంటో పూర్తిగా అర్థం కాకున్నా శివయ్య ఆరోగ్యం కుదుటపడుతోంది.

మెల్లగా పరిస్థితులు మాములుగా మారిపోతున్నాయి. శవాన్ని కాల్చేందుకు మల్లేశే ముందుకొస్తున్నాడు.
ఓ రోజు చితి చివరి మంటల్ని సరి చేస్తున్న మల్లేషుతో "చదువుకుంటున్నావా" అని అడిగాడొకాయన.
'లేదు' అన్నట్లు తల ఊపాడు.


ఆయన అంతటితో ఆగకుండా శివయ్య వైపు తిరిగి "ఏమయ్యా కొడుకును చదివిస్తలేవేమి?" అని గట్టిగా అడిగాడు.
కొడుక్కాదని చెప్పలేక "ఏడాది నుంచే మాతో ఉంటున్నాడు." అన్నాడు.
"అయితేంది? చదివిపించాలే" అన్నాడు.
"ఇప్పుడు నేర్చుకుంటే పొడువవుతాడా?" అన్నాడు శివయ్య.
"మా ఇల్లు దగ్గరే.. రోజ సాయంత్రం పంపు..నేనే చెప్తాను.. సరేనా.." అన్నాడాయన.
"ఏమిరా..చదువుకుంటావా?" అన్నాడు శివయ్య.
మల్లేషు తలెత్తి ఆశగా "చదువుకుంటా" అన్నాడు.
"అయితే ఈ పుస్తకాలూ కొనుక్కొని సాయంత్రం రా.. గాంధీ బొమ్మ పక్కనే మా ఇల్లు" అంటూ కాగితంపై వివరాలు రాసిచ్చాడు.

అన్నిలయ్యాక ఆ చీటీ పట్టుకొని శివయ్య, మల్లేషు పుస్తకాల దుకాణానికి బయల్దేరారు. వాళ్ళ వైపు చూస్తున్న బాలమ్మకు ఇదంతా ఓ ఆనంద క్షణంలా కనబడినా తమ బతుకులు పచ్చబడతాయనే నమ్మకం కలుగడం లేదు. బతుకంతా కష్టాల్లోనే సాగినందువల్ల గుండెలో భయం గుబులు అలాగే ఉంది. మనుషుల్లో కలిసే అవకాశం వచ్చి చేజారిపోవద్దని ఆశపడుతోంది.

"ఇంకా పరీక్షలను తట్టుకోలేము సామీ..ఇట్లనన్నా బతకనీయ్యి" అంటూ ఆకాశంవైపు చేతులెత్తి మొక్కిందామె.

★★★0★★★

కథామంజరి దీపావళి కథల పోటీలో ప్రత్యేక ప్రశంస పొందిన కథ



# తోడు

**శేషచంద్ర**

మార్కండేయులుకు మెలుకవ వచ్చింది. నిద్రలేమితో కళ్ళు మండుతుండగా బలవంతంగా కళ్ళుతెరిచాడు. మసగ్గా కనిపిస్తున్న అరచేతుల్ను ఒక సారి కళ్ళకద్దుకుని, దిండు పక్కనే ఉన్న కళ్ళజోడు తీసుకొని బైట వాకిలి వైపు చూసాడు. వాకిలి మూసే ఉంది. ఇంకా భాగ్యం రానట్లుంది. మరి ఏమిటా శబ్దాలు. బైట కాబోలు అనుకొంటూ టైమ్ చూసాడు మొబైల్లో. ఇంకా ఏడు కూడా కాలేదే అనుకొంటూ కళ్ళ జోడు పక్కన పెట్టి, మళ్ళీ నిద్రకు ఉపక్రమించపోతూ కళ్ళు మూసుకొన్నాడు. కళ్ళు మూసుకొన్నాడే కాని, రాత్రి కొడుకులు మాట్లాడిన మాటలు గుర్తుకు రావడంతో నిద్ర దూరమైంది.

“మీకు ఎంత చెప్పినా అర్థంకాదేం డాడీ. అవసరం ఉన్నప్పుడు లేని డబ్బు తర్వాత వచ్చినా ప్రయోజనమేముంది? ఒంటిగానున్న మీకు అంత పెద్ద ఇల్లు ఎందుకు! ఏదో ఓ చిన్న రూం తీసుకొన్నా మీకు కాలం గడిచిపోతుంది. ఎందుకంత మొండికేస్తున్నారు.“

“జ్ఞాపకాలు... జ్ఞాపకాలు అంటూ పిచ్చివాడిలా మాట్లడటం తప్ప చెప్పేది వినిపించుకోరే! బిజినెస్లో పెట్టుబడిపెడ్తే మంచి లాభం వచ్చేలా ఉంది. దాని వల్ల మేము చాలా వృద్ధిలోకి వస్తామని పదే పదే చెప్పినా, నా మాటకాని అన్నయ్య మాటకాని పట్టించుకోవడంలేదు. ఆ ఇంటిని పట్టుకొని వేలాడుతున్నారు. పోతూ పోతూ దీన్నేమైనా వెంట పెట్టుకుపోతారా?“ కొడుకులిద్దరు మాట్లాడిన మాటల్తో చాలాసేపటికి నిద్రపట్టింది.

కలత నిద్రలో భార్య కనపడింది. “ఎందుకండి వాళ్లచేత మాటలు పడ్తారు. వాళ్లకోసమే మీ సగం జీవితం గడిచిపోయింది. చివర్రోజుల్లో కూడా మిమ్మల్ని ప్రశాంతంగా ఉండనీయని ఆ ఇల్లు మీకెందుకు...? “

“నాది భ్రమ కాంతం... నువ్వు నాకు దూరమైనా వాళ్ళు ఎక్కడో దూరంగా ఉండి రాకపోయినా, మీరు తిరిగిన ఇంట్లో ఒంటరి అన్న బాధ మరిచిపోతూ బ్రతుకుతున్నా. వాళ్లన్నట్లు పోతూ పోతూ నేనేం దీన్ని వెంట పెట్టుకపోతానా. నేను పోయాక అమ్ముకోవచ్చు కదా .. ఎవరు అడ్డు చెప్తారు.'' కలలోనే భార్యకు తన బాధ చెప్పుకొన్నాడు మార్కేండేయులు. రాత్రంతా ఆలా కలలతో, కలత నిద్రతో గడిచిపోయింది. నిద్రలేవగానే మళ్ళీ అవే తలంపులు...

బైట శబ్దాలు మరింత ఎక్కువ కావడంతో నిస్సత్తువుగా ఉన్నా, ఓపిక తెచ్చుకొని లేచి వాకిలి తీసి బైటకి వరండాలోకి వచ్చాడు.

ఆ శబ్దాలు చేస్తున్నది పిడికెడుకూడా లేని రెండు పిచ్చుకలు. నానా హంగామా చేస్తున్నాయి. గరళకంఠుని కంఠం మీది చారల్లాగ నల్లని చారతో ఉన్న పిచ్చుక ఒకటి కిటికి అద్దాల మీద ఎగురుతూ అద్దాన్ని ముక్కుతో పొడుస్తుంటే, మరొకటి ఎత్తుగా గుబురుగా పెరిగిన బలమైన మందారం మొక్క మీద కూర్చుని అరుస్తుంది. బైటకి వచ్చిన మార్కండేయుల్ని చూడగానే, చెట్టు మీద కూర్చున్న పిచ్చుక భయంతో తల అటూ ఇటూ తిప్పుతూ కొద్ది క్షణాలు

చూసి వెంటనే మగ పిచ్చుకకు ప్రమాద హెచ్చరికగా మరింత గట్టిగా అరవసాగింది. కిటికి మీద టకా టకా కొడ్తున్న పిచ్చుక కొట్టడం ఆపి, తల తిప్పి మార్కండేయుల్ను చూచి చేస్తున్న పనిని ఆపి, తుర్రుమని మందారం చెట్టు మీదికి పోయి ఆడ పిచ్చుక పక్కన వాలింది. రెండు మార్కండేయుల్ను చూస్తూ తల క్రిందికి పైకి ఆడిస్తూ ఎగరుతూ కిచ కిచ మని అరవసాగాయి. వాటి అరుపులు, చేస్తున్న చేష్టలకు ఏదో కొత్త ప్రపంచంలోకి జారుకొన్న చిన్న పిల్లవాడిలా చూస్తుండిపోయాడు మార్కండేయులు.

కొద్ది సేపు వాటిని చూసి కొన్ని బియ్యపు గింజలేమైనా వేస్తే తింటాయెమోనని లోపలికి పోయాడు. అదే సమయంలో బైట గేటు తీసుకొని లోపలికి వచ్చిన భాగ్యం కసువు చిమ్మను చీపురు తీసుకోపోతూ, ఇంటిబైట బాల్కనిలో వాకిలి బార్లా తెరిచి ఉండటం చూచి 'దొంగలు కాని పడలేదు కదా' అనుకొంటూ కంగారుగా పైకి వస్తూ , అప్పుడే లోపల్నుంచి వస్తున్న మార్కండేయల్ను చూసి ఊపిరి పీల్చుకొని, "ఏమిటి సారు పొద్దుట్నే లేసింఢ్రు. తలుపు తెరిసింది సూసి భెయపడిపోయినా, రాత్రి దొంగలు పడింఢ్రోమోనని!" అంది.

"ఇవిగో ఈ కొత్త నేస్తాలు నిద్రలేపాయి భాగ్యం. ఎంత ముద్దుగా ఉండాయో చూడు" అన్నాడు పిచ్చుకల్ను చూపిస్తూ, పిల్లోడిలా సంతోషపడిపోతూ.

ఆమె పిచ్చుకల వంక చూసి, "అయ్యో వోటిని తోలకుండా అట్టా సూస్తారేంది. అయి సెట్టు మీద గూడు పెట్టేకి సూస్తున్నట్టుండాయి సారు. చెత్తచెదారమంతా ఏస్తయి" అంటూ మార్కండేయలు వారించేలోపే, వాటిని చీపుర్తో చేత్తో హుష్ హుష్ అనడంతో రివ్వున లేచిపోయాయి అవి అరుచుకొంటూ.

"ఎంత పనిసేసావమ్మాయ్ .. అవి అక్కడ గూడు పెట్టుకొంటే. మనకొచ్చే నష్టమేముంది. మా నాన్నగారు వాటికి ఇంట్లోనే ఆశ్రమిచ్చేవారు. ఆ దూలాల్లో వాటికోసమే గూళ్లు ఏర్పాటు చేసేవాళ్లు. ఇంటి ముందర వరికంకులు కట్టేవాళ్లు. ఇప్పుడు వాటిని పట్టించుకొనే వాళ్లు ఎవరు? పెరిగిన నాగరికత పాపం వాటి ప్రాణాల మీదికి వచ్చి, చాల మటుకు కనుమరుగైపోయాయి. దగ్గర్లో టవర్ లేనట్లుంది, అందుకే ఇవి బ్రతికి బట్టకట్టినట్లున్నాయి. నువ్వేమో వాటిని తరిమేసావ్ పాపం" అంటూ విసుక్కొన్నాడు.

మొదటిసారిగా తన మీద విసుక్కోవడం చూసి విస్తుపోయింది భాగ్యం, అది కప్పిపుచ్చుకొంటూ,"ఎట్టా లేచింఢ్రు. తానమది కానించేయండి తొందరగా టిఫెను సేసేస్తా తినేస్తురు." అంది

"ఇంత పొద్దున్నే ఎక్కడ తింటానులే. నువ్వు చేసేసి హాట్ బాక్సో పెట్టిపో రోజ లాగే."

"మీరు టయానికి యాడ తింటరులే. ఇయ్యాల నేను పనికి పోతాండా మద్దేనానికి గూడా రాలేను. కూరలు సేసి, స్టౌ మీద బియ్యం మేసి పోతా, మల్లా స్విచ్చేసుకొంటర గందా... "

'అలాగేలే వెళ్లు' నిర్లిప్తంగా అని మొబైల్ వైపు చూస్తున్న వాడల్లా బోసినోటితో బిగ్గరగా నవ్వసాగాడు. ఇప్పటిదాక విసుకొన్నవాడు అంతలా నవ్వేలా చేసింది ఏందబ్బా అనుకొంటూ, "ఏంది సారు ఎప్పుడు నవ్వనోల్లు అంతలా నవ్వుతుండరు, మనవలు మనవరాల్లైమైనా ఫుటోలు పెట్టింఢ్రా లేక ఈడకేమైనా కొడుకులు కోడళ్లు పిల్లల్తో వస్తుండారా."

"ఈ రోజ నా పుట్టిన రోజంటా. నాకూ, నా అనే వాళ్లకూ గుర్తులేకపోయినా, ఈ బ్యాంక్ వాళ్లు పెట్టిన మెసేజ్ చూసేటప్పటికి నవ్వు వచ్చింది".

"ఇయ్యాలా మీ పుట్టిన రోజా...! ఏమన్నా స్పెషల్ సేసేదా సారు...?"

ఆ మాట అనగానే మార్కండేయులు నవ్వు మాయమై ముఖం మ్లానమైంది. "వద్దమ్మాయ్ దానిమీద నాకేం పెద్ద ఇంట్రెస్టు లేదు. మీ అమ్మగారు పోవడంతోనే అన్నీ వదిలేసాను. అది ఉన్నప్పుడు నానా హడావుడి చేసేది. గుడికని,

గోపురానికని తీసుకపోయేది. ఏదో ఒక ఆశ్రమంలో అన్నదానం చేయించేది......" భార్య గుర్తుకు వచ్చి. మార్కండేయులు కంఠం జీర పోయింది.
"జరిగి పోయినేది తిరిగి రమ్మంటే వస్తదా? వోటిని మతికి తెచ్చుకొని బాధ పడితే ఎట్టా? ఈ మద్దేనే సానా తగ్గిండ్రు. ఎప్పుడు పిల్లలు మీద ద్యాసైతే ఎట్టా. అట్టా ఈడుండి దిగులు పడేదానికన్నా, ఈ పారి మీ పిల్లోళ్లు వచ్చినాక ఇద్దరి పిల్లల్లో ఎవరో ఒకళ్లకాడికి ఎల్లండి. ఒంటిగా ఎన్నాలిట్టా బాధపడ్తా ఉంటారు".
"నీ పిచ్చిగాని వాళ్లకు రాను తీరిక ఎక్కడుండాది. మీ అమ్మగారు చనిపోయినప్పుడే బలవంతంగా వచ్చి నాలుగు రోజులుండేందుకు గింజుకొన్నారు. పోతా పోతా పొలం స్థలాలు అమ్మకు పోయారు. ఇంటిని అమ్మేసి నాకో చిన్న ఇల్లు కొనిపెట్టాలని చూసారే తప్ప, మాట వరసక్కూడా తీసుకుపోతామనలేదే. వాళ్లకు నా ఆస్తి కావాలి కాని నా బరువును మోయాలని లేదు. నేను వాళ్లకు బరువు కావాలనుకోవడం లేదు. మనసు దిటవు పరుచుకోవాలని ఉంటుంది వాళ్లు ఎంత కాదన్న వాళ్ళు, వాళ్ల పిల్లలు మనసులోన మెదల్తుంటారు. మనసు పీకుతుంటుంది వాళ్లను చూడాలని, వాళ్లతో మాట్లాడలని. కాని నా బాధ వాళ్లకు పట్టదు .. ఎప్పుడైనా ఏదో ఒక రాత్రి ఒంటిగా పోయేటోన్నే"
"పొద్దున్నే పుట్టిన రోజున ఆపసకునం మాటలెందుకులే సారు. ఏం సేస్తం ఈ కాలం పిల్లలంతే నేమో..ఎంత ప్రేమగా సూసినా పెద్దైనాక అన్ని మరిసిపోతారు. వోళ్లు వాళ్ల పెళ్లాం, పిల్లలు తప్ప ఇంకెవరు గురుతుకు రాదు. సదువుకొన్నోళ్లు ఆస్తి ఉన్నోళ్లు కాబట్టి మీకు ఇట్టాగైనా జరిగిపోతాండాది. కూలి నాలి చేసుకొనే మా బతుకులెట్టా ఉంటాయో రేపు అనుకొంటే భయమేస్తాంటాది." తన భయాన్ని బైట పెట్టింది భాగ్యం.
"డబ్బుంటే సరిపోతుందా భాగ్యం ... తోడు లేకుండా ఒంటరితనంతో ఎందుకు బ్రతుకుతున్నానా అనిపిస్తుంది."
"ఏం సేస్తం సారు. మరిచిపోవాలా, ఏదన్నా వ్యాపకం పెట్టుకోవాలా"
పేరుకు భాగ్యం పనిమనిషే కాని స్వంత తండ్రిలాగా మార్కండేయుల్ని చూసుకొంటుంది. ఇంటి తాళం చెవులు ఒకటి ఆమెకు ఇచ్చాడు. అతను నిద్ర లేచినా లేవకపోయినా, ఇంట్లో ఉన్నా లేకపోయినా ఉదయం ఇల్లు శుభ్రం చేసేసి, బట్టలేమైనా ఉంటే వాషింగ్ మిషన్ల్ వేసేసి ఆరేసి, టిఫెన్ చేయడం, ఒక వేళ ఎక్కడా పనికి పోకుంటే మధ్యాహ్నం వచ్చి వంట చేయడం, లేకుంటే ఒకేసారి టిఫెన్తో పాటు మధ్యాహ్నం వంట చేసి, మళ్లీ రాత్రి ఏడుకు వచ్చి వంట చేసి పెట్టడం చేస్తుంటుంది.

★★★

టిఫిన్ అయిందనిపించి పిచ్చుకల వస్తాయో రావో అనుకుంటూ, వాటికోసం ఎదురు చూడసాగాడు మార్కండేయులు. గంట సేపైనా పిచ్చుకలు రాకపోవడంతో ఇక అవి రావేమో అనుకొని నిరాశ పడుతుండగా, కిచ...కిచ శబ్దం వినపడటంతో ప్రాణం లేచి వచ్చినట్లైంది. చుట్టాలు పలకరించినంత సంతోషమేస్తుండగా, బైటికి రాబోతు అవి తనని చూడటంతో అవి ఎక్కడ వెళ్లిపోతాయోమోనని కిటికిల్లోంచి వాటిని చూడసాగాడు. కొద్ది సేపు పిచ్చుకలు అద్దంలోని పిచ్చుకతో ముక్కుతో పొడిచి పొడిచి విసుగేసి కాబోలు, మందారం చెట్టు మీద కొద్దిసేపు విశ్రాంతి తీసుకొన్నాయి. చెట్టు మీద కూర్చున్నా కిచ కిచ మనే అరుపులు మాత్రం అరవడం ఆపలేదు. తర్వాత వరాండలో వేసిన గింజల్ను, గమనించి అటూ ఇటూ చూసి క్రిందికి తిగి ఆత్రంగా తినసాగాయి. మార్కండేయులుకు తృప్తి అనిపించింది. ఇంట్లో నిశబ్దం వాటి అరుపుల్తో దూరమైంది. మార్కండేయులుకూ ఒంటరి తనం దూరమైనట్లుగా అనిపించింది. వాటిని చూస్తున్నా అవి తన పక్కన చూస్తునప్పుడు తల పక్కకు తిప్పుకోసాగాడు వాటిని చూడనట్లు. పిచ్చుకలు కొద్ది సేపు

వచ్చి అరుస్తూ, మళ్లీ ఎక్కడికో ఎగిరిపోతూ, మళ్లీ వస్తూ, రెండు రోజులు రెక్కి చేసినట్లు తిరిగి, తమకు అక్కడ భద్రత ఉంటుందని నిర్ణయించుకొని గూడు కట్టుకోసాగాయి.

★★★

పిచ్చుకలు గూడు కట్టుకోవడంతో పాటు అవి మార్కండేయులకు దగ్గరయ్యాయి. అతన్ని చూసి ముందులా భయపడి అరవడం మానేసాయి. అతను వరండాలో పడక కుర్చీలో కూర్చుంటే, పక్కనే వచ్చి అతనేసిన గింజలు తిని అక్కడక్కడే తిరిగేవి. ఒకోసారి ఇంట్లోకి కూడ వచ్చేవి. తను భోంచేసేటప్పుడు వస్తే వాటికి చిన్న ప్లేటులో తను తినేవన్ని కొద్ది కొద్దిగా వేసేవాడు. అవి భయం లేకుండా వచ్చి తినేవి, ఇంట్లో అటూ ఎగరుతూ తిరిగేవి. అవి తిరుగుతుంటే ఇంట్లో పిల్లలు తిరుగుతున్నట్లుగా అనిపించేంది మార్కండేయులుకు. అది వీడియో కాల్ చేసి పిల్లలకి చూపించాలని ప్రయత్నం చేసాడు మార్కండేయులు. కాని కొడుకులు ఫోన్ ఎత్తడం మానేసారు. పిచ్చుక గుడ్లు పెట్టడంతో ఆడ పిచ్చుక కాని మగ పిచ్చుక కాని వంతులు వారిగా గూడును వదలకుండా కూర్చుంటున్నాయి. పిచ్చుకలు తనను చూచి పెద్ద పెట్టున అరిచినా మార్కండేయులు దగ్గిరికి స్వేచ్ఛగా రావడం చూసి భాగ్యం ఆశ్చర్యపోయేది. మార్కండేయుల్లో చాలా మార్పు వచ్చింది. వాటిని చూసి పిల్లోడిలో సంతోష పడుతుంటే, పోనీలే ముసలాయనకు అయి తోడుండి, ఒంటరితనం దూరమైతాండది అనుకొంది భాగ్యం. ఒక జత పిచ్చుకలు గూడు కట్టుకొన్నాక అక్కడ బాగుందని మరికొన్ని పిచ్చుకలకు వార్త చేరవేసాయోమో, మరో రెండు జతల పిచ్చుకలు గూడు కట్టుకొన్నాయి. గూడు కట్టుకోవడంతో పాటు గుడ్లు కూడా పెట్టుకున్నాయి.

★★★

పిచ్చుక పిల్లలు కొద్దిగా పెద్దవి అయి గూడు దిగి క్రిందికి రాసాగాయి. పెద్ద పిచ్చుకల్తో పాటు పిల్ల పిచ్చుకలు కూడా మార్కండేయులు దగ్గరగా వచ్చేవి. అవి ఎగర లేక ఎగురుతూ ముద్దుగా ముక్కులు పైకి పెట్టి అరుస్తూ, రెక్కలు అల్లాడిస్తుంటే, పిల్లప్పుడు తన కొడుకులు, మనవళ్లు మనవరాళ్లు నడవలేక నడుస్తూ అరుస్తూ చేతులూపుతున్నట్లు అనిపించి, వాటిని వీడియో కాల్ చేసి మనవళ్లకు మనవరాళ్లకు చూపించాలని, వాళ్లు ముఖంలో ఆశ్చర్యాన్ని చూడాలని, ముద్దు ముద్దుగా అడిగే ప్రశ్నలకు బదులు చెప్పాలని అనుకుంటూ, ఎన్ని సార్లు ఫోన్ చేసినా ఫోన్ ఎత్తలేదు వాళ్లు. ఉదాసీనంగానే గడిపాడు మార్కండేయులు. రాత్రి చాల సేపటివరకు నిద్ర పట్టలేదు. ఆరు బైటే కూర్చోని చాలసేపు ఆలోచించి, చివరి రోజుల్లో కొడుకులకు ఎందుకు వ్యతిరేకంగా నడుచుకోవాలి .. ఉదయమే ఫోన్ చేసి చెప్పాలి. కనీసం అప్పుడైనా పిల్లల్ని పిల్చుకొని వస్తే, కడసారి వాళ్లతో గడిపినట్లుంటుంది అనుకొని, ఉదయమే వాళ్లకు ఆ విషయం చెప్పాలనుకొని నిద్రపోయేందుకు లోపలకి పోబోతుంటే ఉన్నట్లుండి విపరీతంగా గాలి వీయడంతో పాటు కరెంటు పోయింది. చూస్తుండగానే కుండపోత వర్షం కురవసాగింది.

★★★

వాకిలి దబా దబా కొడ్తుంటే ఈ టయిమ్లో ఎవరబ్బా అనుకొంటూ వాకిలి తీసి చూసాడు భాగ్యం మొగుడు. ఇంటి ముందు తడిసి ముద్దైపోయి నిల్చున్న ఆకారాన్ని గుర్తించలేక "ఎవరు?" అన్నాడు. ఆ చప్పుడుకు లోపల్నించి భాగ్యం లేచి, బుడ్డి పట్టుకొచ్చింది. మార్కండేయల్ను చూసి ఆశ్చర్యపోయారిద్దరు.

"అదేంది సారు ఇంత రాత్రేళ వానలో ఇట్టా వొచ్చిండ్రు. ఫోన్ చేసింటే నేనోచ్చేవోడ్ని గందా .. అయినా ఏమైనాది.... లోనకి రాండి" అంటూ పిలిచాడు.

గొడుగు ఉన్నా గాలికి తడిసి ముద్దైపోయిన మార్కండేయులు చలికి వణుకుతూనే, "ఫోన్ చేసానమ్మయ్, పనిచేయలేదు మీది. దగ్గరేకదా అని వచ్చాను. నువ్వు కొద్దిగా మా ఇంటి కాడికి రారా అబ్బాయ్, కొద్దిగా పని ఉంది. తాడు ఏదన్నా ఉంటే తీసుకురా" అన్నాడు వచ్చిన పని చెప్పకుండా మార్కండేయులు.

"వస్తడులే సారు. అసలు ఏమైనాది. ఈ వానలో మీరిట్టా రావడమేంది. సలికి వొణుకుతుండరు ఇట్టా లోపలికి వొచ్చి కూకోండి. పనేందో సెప్పండి అయన సేసోస్తాడు." తాడెందుకు అర్థంకాక అడిగింది భాగ్యం. మార్కండేయులు లోపలకి పోకుండా, సమాధానం చెప్పకుండా, అలాగే నిల్చుండిపోవడంతో భాగ్యం మొగుడు ఆలస్యం చేయకుండా నులక మంచం తాడు తీసుకొని "పదసారు" అన్నాడు. "నేను వొచ్చేదా సారు" అంది భాగ్యం.

"వద్దొద్దులే... నీ మొగుడు వచ్చేస్తడు త్వరగా. చిన్న పనేలే."

ఇంటికి వచ్చి పిచ్చుకల గూళ్లను ఆత్రంగా చూచాడు. అవి పడిపోకుండా ఉండటంతో ఊపిరి పీల్చుకొన్నాడు. లోపల పిచ్చుకలు భయతో బిక్కచచ్చిపోయి చలికి వణుకుతూ కూర్చోవడం చూసి మనసు విలవిల లాడింది అతనికి .

విపరీతమైన గాలికి మందారం చెట్టు పైనున్న పిచ్చుకల గూళ్లు ఎక్కడ పడిపోతాయోనని మందారం చెట్టు ఊగకుండా పక్కనే ఉన్న స్తంభానికి గట్టిగా కట్టమన్నాడు. తర్వాత కొమ్మలపైన పిచ్చుకలు తడవకుండా ప్లాస్టిక్ కవర్ వేయమన్నాడు. మార్కండేయులు వర్షానికి తడుస్తూ వచ్చింది ఈ పనికోసమా అంటూ ఆశ్చర్యపోతూ, ఇదేం తిక్క అనుకొన్నాడు భాగ్యం మొగుడు.

"పైన కవరు ఏయచ్చు గాని అది యాడ నిలబడ్తది. చెట్టును కదలకుండా సేయడానికి ఈ నులక తాడు నిలవదు సారు" అన్నాడు.

ఇంట్లోంచి తెచ్చి బైడింగ్ వైరు కటింగ్ ప్లేయర్ ఇచ్చాడు, కట్టక తప్పదన్నట్లు. నిచ్చెనేసుకొని మార్కండేయులు చెప్పినట్లు చేయక తప్పలేదు భాగ్యం మొగుడికి. గాలికి చెట్టు ఊగడం తగ్గడంతో పాటు, పైన కవరు కూడా తాళ్లతో కట్టడం వల్ల వర్షం బొలిన పడకుండా గొడుగులాగా ఉండటంతో మార్కండేయులుకు తృప్తి అనిపించింది.

★★★

రాత్రి అనుకొన్నట్లే కొడుకులు లేచి ఉంటారని ఇద్దరికి ఫోన్ చేస్తుండిపోయాడు. ఎత్తలేదు వాళ్లు. ఎత్తకపోయినా కోపగించుకొంటే కోపగించుకోని అని ఆపకుండా ఫోన్ రింగ్ చేస్తునే ఉండిపోయాడు. చివరికి పెద్ద కొడుకు ఫోనెత్తి "ఫోన్ ఎత్తకపోతే ఏదో పని మీద ఉన్నామని ఆ మాత్రం తెలియదా? వదలకుండా ఫోన్ చేస్తున్నారు. మేమిక్కడ మీలాగా ఖాళీగా లేం డాడ్. ఎన్నో పనులు. తెలిసి కూడా మీరు ఎందుకు విసిగిస్తారో తెలియదు. మీరు బాగున్నారు కదా అంతే చాలు. మాకు ఫోన్లు చేయడమెందుకు." అంటూ ఎగిరి పడ్డాడు.

"నెల రోజులుగా పిల్లల్ను చూడలనుకొంటూన్నానురా. ఓ సారి పిల్లల్ని చూపించి మాట్లాడించురా!" ఆర్తిగా అడిగాడు.

“దీనికేం తక్కువవలేదు, ప్రేమ కాలిపోతున్నట్లు. పిల్లలు లేరు, బైటికి పోయారు వాళ్ల మమ్మితో. మేము కొద్ది రోజులు సిటి వదలి బైటికి పోతున్నాం. మీరు ఫోన్ చేసినా మేము సమాధానం చెప్పలేం. అనవసరంగా ఫోన్ చేసి విసుగించవద్దు. వచ్చాక నేనే ఫోన్చేస్తాను.“

“అదికాదురా మీరు చెప్పినట్లు......“అంటూ ఇల్లు అమ్ముకోబోమ్మని చెప్పబోతుండగానే ఫోన్ పెట్టేసాడు.

మాన్పడిపోయాడు మార్కండేయులు. చాలాసేపు ప్రతిమలా ఉలుకు పలుకు లేకుండా కూర్చుండిపోయన మార్కండేయుల్ను చూస్తుండిపోయిన ఓ మగపిచ్చుక ఏమనుకొందో ఏమో, చెట్టు మీదనుండే కిచ కిచమంటూ పలకరించింది. అతను పలకకపోయే సరికి, అతని పక్కన వాలి ముఖంలోకి చూస్తూ మరింత గట్టిగా అరవడంతో ఇహలోకంలోకి వచ్చాడు మార్కండేయులు. అది తనను ఎందుకు దిగులుగా ఉన్నావని పలకరిస్తున్నట్లన్పించింది. ఆ చిన్న ప్రాణిని, దాని ఆరాటాన్ని చూడగానే ఉన్నట్లుండి మార్కండేయుల్లో మార్పు వచ్చింది. మనుసు దిటవు పరుచుకుని, ఓ స్థిరమైన నిర్ణయానికి వచ్చాడు. అవును ఆలాగే చేయాలనుకొన్నాడు.

★★★

వారం రోజుల తర్వాత తన చేతిలో పెట్టున్న కాగితాలను చూచి “ఏంటి సారు ఇయి?“ అంది భాగ్యం.

“ఇంటి తాలుకా రిజిస్ట్రేషన్ కాగితాలు భాగ్యం. నీ మీద నమ్మకంతో నా తదనంతరం ఈ ఇల్లు నీ పేరు మీదే రాసాను. ఇంట్లో మీరు ఉండటంతో పాటు ఈ పిచ్చుకల్ను, వీటి సంతతిని మీరు కాపాడుతూ ఉండాలి. నేను పోగానే నా కొడుకులు దీన్ని అమ్మేస్తారు. అప్పుడు నా ఆశ్రయంలో నన్ను నమ్ముకొని ఈ మూగ జీవులు ఏమైపోతాయోనన్న ఆలోచనతో ఈ పనిచేసాను. నా మీద ప్రేమలేని పిల్లలకోసం ప్రాకులాడటం దేనికి! అయినా ఈ ఆస్థి వాళ్లకు పెద్ద లెక్కేంకాదు. అందుకే చివరిరోజుల్లో నాకు తోడుగా ఉన్న చిరుజీవుల కోసం ఈ చిన్న సహాయం చేయడం మంచిదనిపించింది. నువ్వు న్యాయం చేస్తావన్న నమ్మకం నాకుంది.“

భాగ్యానికి నోట మాటరాలేదు.

పిచ్చుకలు మాత్రం కిచకిచమని అరుస్తున్నాయి మార్కండేయులు చుట్టు చేరి “మేము ఉన్నాం నీకు తోడు” అంటున్నట్లు.

★★★0★★★

## కథామంజరి దీపావళి కథల పోటీలో ప్రత్యేక ప్రశంస పొందిన కథ



# ఈ ప్రశ్నకి బదులేది

### తిరుమలశ్రీ

పూర్తిగా తెల్లవారకుండానే నగరం ఉలికిపాటుతో మేల్కొంది.

ఓ భార్య, ఓ భర్తను నిదట్లోనే కత్తితో పొడిచి చంపేసిందన్న వార్త దావానంలా వ్యాపించడమే అందుక్కారణం! భర్తను కత్తితో ఒళ్ళంతా పొడిచేసిన ఆమె– '100' కి ఫోన్ చేసి పోలీసులకు లొంగిపోయింది. హత్యాయుధంతో సహా ఆమెను అదుపులోకి తీసుకున్న పోలీసులు మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. హంతకురాలిని రిమాండ్ నిమిత్తం న్యాయమూర్తి వద్దకు తీసుకువెళ్ళేముందు మీడియా ఎదుట ప్రవేశపెట్టడం జరిగింది.

భర్త, భార్యను చంపితే అది వార్త కాదు. సర్వసామాన్యం! అదే, భార్య భర్తను చంపితే అది సెన్సేషనల్ న్యూస్ అవుతుంది! అందుకే ప్రెస్, ఎలెక్ట్రానిక్ మీడియా అధిక సంఖ్యలో హాజరయింది.

హతురాలికి ఇరవయ్యొక్క ఏళ్ళుంటాయి. తెల్లగా, పొడవుగా, నాజూకుగా ఉంది. అమాయకత్వం ఉట్టిపడే అందమైన ఆమె వదనంలో అలసట, నీరసం, బాధ ప్రస్ఫుటమవుతున్నాయి.

మీడియా తనదైన శైలిలో ప్రశ్నలవర్షం కురిపించింది...
'చూస్తూంటే చదువుకున్నదానిలా ఉన్నావు. నీ భర్తను ఎందుకు హత్యచేసావు?' అని ఒకరూ –
'పతియే ప్రత్యక్షదైవం అని నమ్మే పవిత్ర భారతావనిలో స్త్రీగా పుట్టి...తాళి కట్టిన భర్తను చంపుకోవడానికి నీకు చేతులు ఎలా వచ్చాయి?' అని ఓ స్త్రీ విలేఖరి –
'నీ అందమైన రూపు మాటున...నీ అమాయకపు వదనం వెనుక...అంతటి రాక్షసత్వం దాగి ఉందంటే నమ్మలేకపోతున్నాము. అది ఇటీవలే రూపుదిద్దుకుందా, లేక చిన్నప్పట్నుంచీ ఉందా??' అంటూ మరొకరూ
'ఏదైనా ప్రేమవ్యవహారమా? ప్రియుడితో లేచిపోయేందుకే నీ భర్త అడ్డు తొలగించుకోవాలనుకున్నావా?' అంటూ ఇంకొకరూ –
'నీ ప్రియుడి పేరేమిటి? ఎక్కడ ఉంటాడు? మీరిద్దరూ పెళ్ళికి ముందునుంచే ప్రేమించుకున్నారా, లేక పెళ్ళి తరువాతే కలుసుకున్నారా?' అంటూ వేరొకరూ –

‘ఈ హత్యలో నీ ప్రియుడు కూడా పాలుపంచుకున్నాడా? లేక, నువ్వు ఒక్కదానివే చేసావా?’ అంటూ మరో విలేఖరి …
‘ఒకవేళ నీ భర్తకు ఎవరితోనైనా అక్రమ సంబంధం ఉందా? అది తెలిసి గొడవపడి ఆవేశంలో అతన్ని హత్యచేసావా? అతని ప్రియురాలిని కూడా చంపేసావా? లేక…’ ఓ నడివయసు మహిళా విలేఖరి ప్రశ్న -
ప్రశ్నలు వేయడం సులభం. జవాబులు ఇవ్వడమే కష్టం. శూన్యపుదృక్కులతో నిర్లిప్తంగా, మౌనంగా చూసింది ఆమె.

“ఇంత పిన్న వయసులో అంతటి సాహసానికి పూనుకున్నావంటే…అందుకు బలమైన కారణం ఏదో ఉండివుండాలి. నువ్వు నోరు మెదపకపోతే ఎలా తెలుస్తుంది? ఇలా ఎందుకు చేసావో వివరంగా చెప్పమ్మా…” ఆమె తండ్రి వయసున్న అనుభవజ్ఞుడైన ఓ విలేఖరి అనునయంగా అడగడంతో– అప్రయత్నంగా ఆమె కన్నులనుండి అశ్రువులు జలజల రాలాయి. మౌనం వీడి, అదిరే పెదవులను మెల్లగా విప్పింది…..

★★★

“నా పేరు చరిత. మాది విజయవాడ. డిగ్రీ చదివాను. కాలేజ్ లో నా సీనియర్ సిద్ధూని ప్రేమించాను. అతనూ నన్ను గాఢంగా ప్రేమించాడు. చదువు పూర్తికాగానే పెద్దల అనుమతితో పెళ్ళిచేసుకోవాలనుకున్నాము మేము…మా వివాహం సిద్ధూ పెద్దలకు సమ్మతమే అయినా, కులాలు వేరన్న కారణంగా మా పెద్దలు అంగీకరించలేదు.
మా నాన్నకు కూతురి సౌఖ్యం కంటే కుటుంబపు పరువు మర్యాదలు ముఖ్యం... నాకు ఓ ఎన్నారై సంబంధం తెచ్చారు నాన్న. వరుడి పేరు అవినాశ్. వయసులో నాకంటే నాలుగైదేళ్ళు పెద్దవాడు. హ్యాండ్సమ్ గా ఉంటాడు. స్వస్థలం విశాఖపట్టణమైనా, అమెరికాలో సాఫ్ట్ వేర్ ఇంజనీరుగా పనిచేస్తున్నాడు. అతను సంపాదించే డాలర్లను రూపాయలలోకి మార్చి చూస్తే, చాలా పెద్ద జీతమే అతనిది. అతనిలో వంకపెట్టడానికి ఏమీ కనిపించలేదు నాకు, ఒక్క సిద్ధూని ప్రేమిస్తున్నానన్న విషయం తప్పితే…చూడగానే నేను నచ్చేయడంతో వెంటనే ‘ఓకే’ చేసేసారు అవినాశ్, అతని తల్లిదండ్రులూను. నా ప్రమేయం లేకుండానే తాంబూలాలు పుచ్చేసుకున్నారు పెద్దలు.

నా మనసంతా సిద్ధూతో నిండిపోయింది. అతన్ని మరచిపోయి, మరో వ్యక్తితో జీవితం పంచుకోవడానికి నేను సిద్ధంగాలేను...అదే విషయం అమ్మ దగ్గర చెప్పుకుని ఏడ్చాను.
‘సిద్ధూ అవినాశ్ కంటే అందగాడు కాదు. ఉద్యోగం కూడా లేదు. ఆర్థికంగా అతని కుటుంబం మనతో సరితూగదు. ముఖ్యంగా అతని కులం!...చక్కటి ఎన్నారై సంబంధం విడిచిపెట్టి, కులం గోత్రం కలవని ఓ అనామకుడికిచ్చి పెళ్ళి చేస్తామని ఎలా అనుకున్నావు నువ్వు? నోరుమూసుకో!’ అంటూ బాగా తిట్టిపోసింది.
సాహసించి నాగోడు నాన్నతో మొరపెట్టుకున్నాను. తనకు కుటుంబపు పరుప్రతిష్ఠలు ముఖ్యమనీ, అవసరమైతే అందుకు భార్యాపిల్లల్ని చంపడానికి కూడా వెనుదీయననీ స్పష్టం చేసాడు. పిచ్చి వేషాలు వేయొద్దంటూ నన్ను తీవ్రంగా మందలించాడు. ఆడపిల్లనయినా పెద్ద చదువులు చదివించినందుకు తాను విచారించేలా చేయొద్దంటూ నా నోరు మూయించేసాడు.

నాకంత గొప్ప సంబంధం వచ్చినందుకూ, నేను అమెరికా వెళుతున్నందుకూ బంధుమిత్రులంతా మురిసిపోతూ నన్ను అభినందిస్తూంటే నిర్లిప్తంగా ఉండిపోయాను నేను. సామాన్య మధ్యతరగతికి చెందిన ఓ సగటు ఆడపిల్ల…అట్టి పరిస్థితులలో ఏం చేస్తుందో– నేనూ అదే చేసాను. తల్లిదండ్రుల శాసనానికి లోబడి, నా ప్రేమకు సమాధి కట్టి, తలవంచి అవినాశ్ చేత మెళ్ళో తాళి కట్టించుకున్నాను.

పెళ్ళయ్యాక సిద్ధూని మరచిపోవడానికి ప్రయత్నించాను. నా భర్తను ప్రేమించడం ఆరంభించాను. క్రమంగా సిద్ధూ నా తలపులలోంచి తొలగిపోయాడు. ఓ సగటు స్త్రీగా వాస్తవానికి పట్టం కట్టి మనసా వాచా కర్మణా తాళి కట్టినవాడికే నన్ను అర్పించుకున్నాను.

అవినాశ్ స్వల్పసెలవులో ఇండియాకి వచ్చాడనీ, వివాహం చేసుకుని తిరిగి అమెరికాకి వెళ్ళిపోతాడనీ పెళ్ళికి ముందు చెప్పారు అతని తల్లిదండ్రులు. అందుకే హడావుడిగా మా పెళ్ళి జరిపించడం జరిగింది. నేను పెళ్ళవగానే అమెరికా వెళుతున్నందుకు నా బంధుమిత్రులు అభినందనల జల్లులు కురిపిస్తే...దూరంగా వెళ్ళిపోతున్నానని అమ్మ, తమ్ముడూ దిగులుచెందారు.
అయితే, అందరూ తలపోసినట్టుగా మేము అమెరికా వెళ్ళలేదు. ఏవేవో సాకులతో మా అమెరికా ప్రయాణాన్ని వాయిదా వేస్తూ వచ్చాడు అవినాశ్. ఆరునెలలు తిరిగేసరికి తెలిసివచ్చిన నిజం ఏమిటంటే...ఆర్థికమాంద్యం కారణంగా అమెరికాలో ఉద్యోగాలు కోల్పోయిన అనేకమందిలో అవినాశ్ కూడా ఒకడని! అదీ పెళ్ళికి ముందే. ఆ సంగతిని దాచిపెట్టి మా సంబంధం కలుపుకున్నారు వాళ్ళు. నిజం బైటపడకముందే హడావుడిగా పెళ్ళి జరిపించేసారు.

ఓసారి అనుకోకుండా అవినాశ్ స్నేహితుడి రాక ద్వారా నిజం బైటపడింది. అతనూ అవినాశ్ తో పాటు అమెరికాలో ఉద్యోగం కోల్పోయినవాడేనట. అక్కడే మరో ఉద్యోగం సంపాదించడానికి విఫల ప్రయత్నాలు చేసి, ఆ మధ్యే దేశానికి తిరిగివచ్చాడట. ఎట్టకేలకు హైదరాబాద్ లోని ఓ కంపెనీలో చేరాడట. ఆ కంపెనీ సి.ఇ.ఒ. తో మాట్లాడి, అవినాశ్ ని కూడా తీసుకునేందుకు ఒప్పించాడట. ఆ విషయం స్వయంగా చెప్పి తీసుకువెళ్ళడానికి వచ్చాడతను.

ఆ సంగతులన్నీ ఆలకించిన నేను నిశ్చేష్టురాలనయ్యాను. తరువాత అవినాశ్ ని నిలదీస్తే, నిర్లక్ష్యంగా ఓ నవ్వు నవ్వేసి ఊరుకున్నాడు. అంటే...అబద్ధాలు చెప్పి మానుండి పెద్దమొత్తంలో కట్నకానుకలు గుంజి, తమ నిరుద్యోగి కొడుక్కి పెళ్ళి జరిపించేసారన్నమాట అతని తల్లిదండ్రులు! షాక్ కి గురయ్యాను నేను.

జరిగిన మోసం గురించి నా తల్లిదండ్రులకు చెప్పాలన్నంత ఆత్రం కలిగింది నాకు. కానీ, నిగ్రహించుకున్నాను. అది ఇప్పుడు నా కుటుంబం. ఆ కుటుంబపు పరువును కాపాడవలసిన బాధ్యత నాపైన వుంది. అందుకే చెప్పలేకపోయాను.

అయితే నిజమూ, నిప్పూ ఎన్నాళ్ళు దాగుతాయి! ఆ సంగతి ఎలాగో నాన్నకు తెలిసిపోయింది. ఏం గొడవ జరుగుతుందోనని భయపడ్డాను నేను. కానీ, నాన్న పలుకులు నన్ను చకితురాలిని చేసాయి. 'నలుగురికీ తెలిస్తే మనకే తలవంపులు. ఈ విషయం ఎక్కడా పొక్కనివ్వకు' అంటూ హెచ్చరించారు నన్ను...
అవినాశ్ హైదరాబాద్ లో కొత్త కంపెనీలో చేరాడు. జీతం యాభైవేలు. అమెరికాలో సుమారు రెండు లక్షలు వచ్చేదట. అంత తక్కువ జీతం రావడానికి, నేను తన జీవితంలో అడుగుపెట్టడమే కారణమన్నట్టు సాధిస్తూవుండేవాడు నన్ను! అత్తమామలు స్వంత ఊరు వదిలి రాలేమనడంతో, మేమిద్దరమే హైదరాబాద్ లో కాపురం పెట్టాము. తల్లిదండ్రులకు ఏకైక సంతానం కావడంతో అతిగారాబం అవినాశ్ ని పాడుచేసింది. మేడిపండు చందం

అతనిది. పైకి, నలుగురి ముందూ ఎంతో మంచివాడిలా ప్రవర్తించేవాడు. ఏకాంతంగా ఉన్నప్పుడు అతని ప్రవర్తన పూర్తిభిన్నంగా ఉండేది.

లోగడ ఎవరో అన్నట్టు, పడగ్గదిలో ఏం జరుగుతుందో భార్యాభర్తలకే తెలుస్తుంది. అవినాశ్ రూపం ఎంత అందంగా ఉంటుందో, పడక మీద అతని ప్రవర్తన అంత వికృతంగా ఉండేది. రోజూ పోర్న్ సైట్స్ చూడడం అతని అలవాటు. అది ఎప్పుడు, ఎలా మొదలయిందో...ఇప్పుడది వ్యసనంగా మారింది. వాటిలో స్త్రీపురుషులు చేసినట్టు తానూ చేయడం అతనికి ఇష్టం. నన్నూ చేయమనేవాడు. ఆ వికృతచేష్టలంటే అసహ్యం, జుగుప్సాను నాకు. తీవ్రంగా వ్యతిరేకించేదాన్ని. అవన్నీ డబ్బుకోసం వ్యభిచారులు చేసే అసహజమైన కృత్యాలనీ, వారిని అనుకరించాలనుకోవడం ప్రమాదకరమనీ ఎంతో నచ్చజెప్పేదాన్ని. అదొక మానసిక జాఢ్యమనీ, ఆ వ్యసనాన్ని మాన్చుకోమనీ పోరేదాన్ని. విద్యావంతులు, సమాజంలో గౌరవ మర్యాదలతో జీవించేవారు అసహ్యించుకునే ఆ అకృత్యాలు తగవు అంటూ నిత్యమూ పోట్లాడేదాన్ని. పక్కలోకి రానని నిరాకరించేదాన్ని. వినిపించుకునేవాడు కాదు. ఆగ్రహం చెందేవాడు. అతనొక శాడిస్ట్! బలవంతంగా నన్ను పక్క మీదకు లాగేవాడు. అతని బలం ముందు నా పెనగులాట వీగిపోయేది. ఏవేవో నికృష్టపుచేష్టలతో నన్ను ఇబ్బందిపెడుతూ తాను పిచ్చి ఆనందాన్ని అనుభవించేవాడు. నేను ప్రతిఘటించే కొద్దీ నా వక్షం పైన, మర్మావయాల పైన పళ్ళతో కొరికేవాడు. సిగరెట్ తో కాల్చేవాడు. పెద్దలతో చెబుతానన్న నా బెదురింపులు కూడా అతన్ని మార్చలేకపోయాయి. అతని 'రేప్' తో ప్రతి రాత్రీ నాకు హింసే. మానసికవేదనే. నా శరీరంతో అతను విచ్చలవిడిగా ఆడుకుంటుంటే...నా శరీరం మీద, నా మీదా నాకే అసహ్యం వేసేది.

నా బాధ ఎవరితో చెప్పుకోవాలో తెలియలేదు. అత్తమామలతో చెప్పినా ప్రయోజనం ఉండదని ఎరుగుదును. ఆ నరకం నుండి ఎలాగైనా తప్పించుకోవాలన్న తపన... భగవంతుడు నా మొరాలకించాడా అన్నట్టు, ఓసారి మా పుట్టింట్లో ఏదో పూజ జరుగుతోంది. నన్ను పంపించమని నాన్న అవినాశ్ కి ఫోన్ చేసారు. బాహ్య ప్రపంచంలో సాధుత్వం, అతి వినయం చూపించే అతను కాదనలేకపోయాడు. అయితే, ఎప్పటిలాగే తీవ్రంగా హెచ్చరించాడు నన్ను, పడకటింటి రహస్యాలు ఎవరికైనా చెబితే చంపేస్తానంటూ.

నా బాధను అమ్మతో చెప్పుకుని ఏడ్చాను నేను. కన్నతల్లి కడుపులో పెట్టుకుని ఓదార్చుతుందనీ, ఆ సమస్యకు పరిష్కారం వెదుకుతుందనీ ఆశించిన నాకు ఘోరనిరుత్సాహం ఎదురయింది. 'నువ్వింకా సిద్ధూని మరచిపోలేదన్నమాట. అవినాశ్ తో ఇష్టంలేని పెళ్ళి నీది. అందుకే బంగారంలాంటి కుర్రాడిపైన సిగ్గుమాలిన అభాండాలు వేస్తున్నావు. నీ మూర్ఖత్వంతో పండంటి కాపురం పాడుచేసుకోకు...' అంటూ ఎదురు మందలించింది నన్ను. ఇంకెవరితో చెప్పుకోను!? నాన్నతో చెప్పుకోగల విషయాలు కావవి. ఒకవేళ సిగ్గు విడచి చెప్పినా, ఆయన స్పందన అమ్మకంటే భిన్నంగా ఉండదని తెలుసును.

హైదరాబాద్ తిరిగివచ్చాక నా వెతలు మళ్ళీ మొదలు... ఆత్మహత్య చేసుకోవాలనిపించింది నాకు. అందుకు నా మది ఎదురుతిరిగింది. 'ఓ పెర్వర్ట్ కారణంగా నా జీవితాన్ని ఎందుకు అంతం చేసుకోవాలి? నేను ఏం తప్పుచేసానని చచ్చిపోవాలి?'... పోలీస్ కంప్లెయింట్ ఇద్దామంటే, అందరమూ వీధికి ఎక్కడమే అవుతుంది... పోనీ విడాకులు ఇద్దామా అంటే, నా కన్నవారి తీరు నాకు బాగా తెలుసు. కూతురి బాగోగులు కంటే, కుటుంబపు పరువే ముఖ్యం వారికి. నన్ను ఆదరించరు సరికదా, తప్పంతా నాదేనన్నట్టు నన్ను అసహ్యించుకుంటారు కూడాను. పైగా, అవినాశ్

మగాడు. తన పైశాచికపుటానందానికి నేను కాకపోతే మరో స్త్రీ! దర్జాగా మళ్ళీ పెళ్ళి చేసుకుంటాడు, మరో ఆడదీ నాలాగే నరకయాతనకు గురవ్వడం నాకు ఇష్టంలేదు…
అందుకే…అందుకే…సమాజానికి పట్టిన ఆ చీడపురుగును నలిపేసాను. అతని డ్రింకులో మత్తుమందు కలిపి…కసి తీరేలా పొడిచి చంపేసాను…"

★★★

ముఖం చేతుల్లో కప్పుకుని భోరున ఏడ్చిందామె. భయంకర నిశ్శబ్దం ఆవరించుకుందక్కడ.

ఆ దుస్థితికి బాధ్యులెవరు? నేరప్రవృత్తిని ప్రేరేపిస్తూ స్త్రీల పైన అత్యాచారాలకు పురిగొల్పే, సమాజంలోని నైతిక విలువలను కూకటివ్రేళ్ళతో పెకలిస్తూన్న … ఆ చెత్త సైట్లను నిరోధించలేని ప్రభుత్వాలా? లేక, వెర్రితలలు వేస్తూన్న ఆధునిక విద్యామాధ్యమాలా??

"ఇప్పుడు చెప్పండి…నేను ఉన్న పరిస్థితుల్లో ఆత్మరక్షణకు, ఆత్మగౌరవాన్ని కాపాడుకునేందుకూ ఓ మహిళకు గల అవకాశాలు ఏమిటి? ఏ స్త్రీ అయినా ఏం చేసేది? అదే మీ ఆడకూతురైతే మీరెలా స్పందించేవారు?..."

చరిత ప్రశ్నకు బదులు తెలియక తలలు వంచుకున్నారంతా.

★★★0★★★

కథామంజరి దీపావళి కథల పోటీలో ప్రత్యేక ప్రశంస పొందిన కథ



# మార్పు మొదలైంది

కె.వి.లక్ష్మణరావు

ఆఫీసుకు బయలుదేరబోతూ చేతి గడియారం కేసి చూశాను.

అప్పుడే క్వార్టర్ టు టెన్ అయింది. ఆఫీసు ఐదు కిలోమీటర్లు దూరంలో ఉంది. సమయం పావుగంట మాత్రమే ఉంది. మోస్ట్ జూనియర్ ని కదా... లేటైతే బాసు క్లాసు పీకుతాడు.

గబ గబా బైక్ దగ్గరకు వెళ్ళాను. ఆఫీసుకు ఆలస్యం అయిపోతుందన్న కంగారులో కిక్ రాడ్ మీద కాలేసి బలంగా కొట్టాను.

బైక్ స్టార్ట్ అయింది. కానీ ఎడమ కాలి చెప్పు పుటుక్కున తెగింది. కొత్త చెప్పులే కానీ నా ఆవేశానికి బలం తోడవడంతో తెగిపోయింది. చెప్పుల్లేక పోయినా ప్రయాణం చేయవచ్చు. కానీ తెగిన చెప్పులతో ప్రయాణం కొంచెం ఇబ్బందే. కానీ ఏం చేస్తాం? ఆఫీసుకు వెళ్లే కంగారులో అలాగే వెళ్లిపోయాను.

'గాడ్! బాసు కంటే ముందుగానే ఆఫీసుకు చేరుకున్నాను.' నా సీటులోకెళ్లి కూర్చున్నాను. ఆఫీసు వర్క్ లో పడ్డాను.

సాయంత్రం అయింది. ఆఫీసు నుండి ఇంటికి వెళ్లబోతూ గుమ్మం ముందున్న చెప్పులు వేసుకోబోయాను. అప్పుడు గుర్తు కొచ్చింది. చెప్పు తెగిన విషయం.

'పోనీ వాటినలా వదిలేసి, కొత్త చెప్పులు కొనుక్కుంటేనో? ఉహూ! చూస్తూ, చూస్తూ ఈ కొత్త చెప్పులను వదిలేసి, మళ్ళీ కొత్త చెప్పులా? ఈ చెప్పులనే కుట్టిస్తే సరి!' అనుకుంటూ, వీధి చివర ఎవరైనా చెప్పులు కుట్టేవారున్నారేమో అనుకుంటూ బయలుదేరాను. రోడ్డుకు ఇరువైపులా పరిశీలిస్తూ ముందుకు నడుస్తున్నాను.

రోజూ వచ్చే దారే అయినా ఎందుకో పట్టి పట్టి చూడటం కొత్తగా ఉంది. అవసరం అటువంటిది మరి. వీధి చివర రోడ్డుకు పక్కగా ఉన్న రావిచెట్టు కింద ఒక ముసలివాడు కూర్చుని ఉన్నాడు. నాలుగు వైపులా నాలుగు పొడవాటి కర్రలు పాతాడు. వాటిపై కొబ్బరి తడకలు ఉంచాడు. పాపం అదే వాడి ఆస్తి, పాస్తి అనుకుంటా.

అతని కేసి పరిశీలనగా చూశాను. తైల సంస్కారం లేని జుట్టు, కాంతి లేని గాజు కళ్ళు, కర్ర శరీరం, ఎముకల గూడుకు గుడ్డలు తొడిగినట్టుగా చొక్కాలో ఒదిగి కూర్చున్నాడనిపించింది. ఆ చొక్కాకు కూడా అక్కడక్కడా అతుకులు.

చుట్టూ మరెవ్వరూ కనిపించక అతని వద్ద ఆగాను.

"చెప్పులు కుట్టాలి" అంటూ నా కాళ్ళకున్న రెండు చెప్పులనూ అతని ముందుంచాను.

అతను వణుకుతున్న చేతులతోనే ఆ చెప్పులను తీసుకుంటూ, కూర్చోమంటూ 'కాళ్లు' వంకరగా, అతుకులతో ఉన్న మొక్కల పీటను చూపించాడు.

జాగ్రత్తగా కూర్చున్నాను.

అతను చెప్పులను ఎగాదిగా చూస్తున్నాడు.
"త్వరగా కుట్టు. ఇంటికి వెళ్ళాలి" అన్నాను.
సెల్ రింగవుతుంటే, సెల్ తీసి డిస్ప్లే చూశాను. నా ఫ్రెండ్ సురేష్ చేస్తున్నాడు. సురేష్ పేరు చూడగానే విసుక్కున్నాను.
మా ఊరిలో యూత్ లెవెల్ సంఘాన్ని ఏర్పాటు చేశాడు. ఊరిలో ఉద్యోగం పొందిన వారితో విరాళాలు సేకరించి, ఊరిలో పాఠశాలల్లో చదివే పేదపిల్లలకు ఉచితంగా పుస్తకాలు,పెన్నులు కొనిస్తారు.
"ఆశ" కన్నా "ఆశయం" గొప్పదంటాడు.
"నీ ఆశ నిన్ను బ్రతికిస్తుంది, నీ సదాశయం పదిమందికీ బ్రతుకునిస్తుంది" అంటాడు.
దిగువ మధ్య తరగతి నుండి వచ్చినా సరే, సంపాదించిన దానిలో కొంత సాయం చేయాలంటాడు.
"దానం చేయడానికి మనం ధనవంతులం కాదని నేనంటే...!"
"ధనం కాదు, దానం చేయాలనే గుణం ప్రధానం" అంటాడు.
"విజయ్... సభ్యులెక్కువైతే మన సేవలు మరింత విస్తరించుకోవచ్చు. సంఘంలో చేరమంటాడు". వాడంటే మాత్రం .. డబ్బులెవరికి ఊరికే రావు. అందుకే వాడిని తప్పించుకు తిరుగుతున్నాను.
సెల్ పదే పదే రింగవుతోంది. ఇక తప్పక ఫోన్ లిఫ్ట్ చేసి "చెప్పరా! సురేష్!" అన్నాను.
అంతలో చెప్పులు కుట్టేవాడు .. ఒక చేత్తో చెప్పును, మరో చేత్తో దారం పట్టుకుని "కుట్టేయమంటారా బాబూ?" అంటూ సైగ చేశాడు.
"కుట్టడానికే కదా నీకిచ్చింది?" అంటూ విసుక్కున్నాను.
"విజయ్! నాపై కోపం దేనికి?" ఫోన్ లో వాడననుకుని అడుగుతున్నాడు సురేష్. ఇదే అదననిపించి
"సురేష్! ట్రాఫిక్ లో వున్నాను. నీకు మళ్ళీ చేస్తాను" అన్నాను.
అప్పటికే చెప్పు కుట్టడం పూర్తయిందనుకుంటా ... కుట్టిన ఆ చెప్పులను నా కాళ్ళ ముందుంచాడు.
కుట్టిన ఆ చెప్పును చూడగానే నా కోపం కట్టలు తెంచుకుంది.
నల్లటి రంగులో ఉన్న ఆ చెప్పులను తెల్లదారంతో కుట్టాడు.
"బిచ్చగాడి చెప్పుల్లా మార్చేశావే? నీకసలు చెప్పులు కుట్టడం వచ్చా, రాదా? కిలోమీటరు దూరం వెళ్లుంటే నీకన్నా బాగా కుట్టేవాళ్ళు ఉండేవారు. కక్కుర్తిపడ్డాను కదా .. నా కిలా కావాల్సిందే! అయినా నల్ల దారం లేనప్పుడు, నన్నడిగి కుట్టాలి కదా?"
నేను గట్టిగా అంటూంటే చెప్పులు కుట్టేవాడు బిక్క మొహం పెట్టి నాకేసి దీనంగా చూడసాగాడు.
అప్పుడే మాక్కొంచెం దూరంగా ఉంటూ, అంతా గమనిస్తున్న మరో ముసలి వాడు మా మధ్య లోకి వచ్చాడు. మాసిన పంచి, అతుకుల చొక్కా వేసుకున్నప్పటికి బాగానే ఉన్నాడనిపించింది.
భారతీయుడిలా ఫోజిస్తూ .. నా వైపు తిరిగి
"బాబూ! చూత్తే తమరు సదువుకున్నోరిలా ఉన్నారు. పాపం ఆడు సెప్పు కుట్టే ముందు తెల్లదారం మీకు సూపించాడు. 'కుట్టేయ మంటారా?' అని సైగ కూడా సేసినాడు. మీరే ఫోన్ లో పడిపోయి, కుట్టేయమన్నారు. తప్పు మీదే బాబూ, ఆడిది కాదు" పెదరాయుడి తీర్పు చెప్పినట్టుగా అన్నాడు.
అందుకే పెద్దలున్నారు 'చూసే కళ్లకూ, వినే చెవులకూ అనుసంధానం ఉంటేనే విషయం మెదడుకు చేరుతుందని.'
పక్కవాడు నన్ను నేరస్థుడ్ని చూసినట్టు చూస్తున్నాడు. తప్పు నాదని తెలిసాక, తగ్గడం ఉత్తమం అనుకున్నాను. కానీ ఆ చెప్పులు తొడుక్కో బుద్ధి కావడం లేదు. అందుకే ... దానం చేసిన వాడిలా ఫోజిస్తూ..

"ఈ చెప్పులు నువ్వే ఉంచేసుకో" అన్నాను.
చెప్పుల వాడు నాకేసి అదోలా చూశాడు.
"అనుమానం వద్దు. నువ్వు కుట్టినందుకు డబ్బులు కూడా ఇస్తానులే" అన్నాను.
జేబులో నుండి ఇరవై రూపాయల నోటు తీసి వాడికి ఇవ్వబోయాను.
"వాడు తీసుకోలేదు. వద్దని సైగ చేశాడు.
"పేదవాడైనా చేతిని చాచడు" అనుకున్నాను. ఇరవై రూపాయలు నా జేబులో పెడుతూండగా ..
చెప్పులు కుట్టిన వాడు, నేను దానంగా ఇచ్చిన చెప్పులను పక్కనే ఉన్న ఆ ముసలాడికి ఇచ్చేశాడు.
అది చూడగానే .. తగ్గిందనుకున్న నా కోపం పెరిగి పోయింది.
"నీకు దానం చేయడం నాది తప్పు. అపాత్ర దానం చేస్తావా?" కోపంగా అన్నాను.
మళ్ళీ పక్కనున్న ముసలాడు నాతో..
"బాబూ. ఆడికి కాళ్ళులేవయ్యా. పెమాదంలో పోయాయి." అంటూ చెట్టు వెనకాల ఉన్న జైపూర్ కాళ్ళను చూపించాడు.
"దయగల పెబువులు ఆడికి ఇచ్చారయ్యా. అవసరం అయినప్పుడు ఆటిని ఏసుకుంటాడు!" అన్నాడు.
నేను ఒక్కసారిగా నిర్ఘాంతపోయాను. పంచిలో కాళ్ళను దాచాడనుకున్నాను. కాళ్ళు లేవని తెలిసే సరికి ఆశ్చర్యపోయాను. నా చెంప మీద ఎవరో ఛెళ్ళున కొట్టినట్లనిపించింది. పక్కవాడు ఏదో మాట్లాడుతున్నా అవేమీ నా చెవికెక్కడం లేదు.
చెప్పులు కుట్టే వాడినే అలా చూస్తుండిపోయాను.

"కాళ్ళు లేకపోయినా ఎంతో నైపుణ్యంతో చెప్పులను కుట్టాడు. నేను దానం చేసిన వాటిని ఎవరికి అమ్మినా అంతో, ఇంతో డబ్బులు వచ్చేవి. కానీ అమ్మలేదు. అవసరం అయిన వారికి సహాయంగా ఇచ్చేశాడు. మాటలు రావు. కాళ్ళు లేవు. ఏ గుడి దగ్గర కూర్చున్నా అతనికి రోజు గడిచిపోతుంది. కానీ అతను "పనికి ప్రతి రూపంలా, కష్టానికి నిలువెత్తు నిదర్శనంగా ఉన్నాడు."
"గోరంత దీపం..కొండంత వెలుగు" అన్నట్లుగా అతను నా దృష్టిలో కొండంత ఎత్తుకు ఎదిగాడనిపించింది." అప్రయత్నంగానే నా రెండు చేతులూ జోడించాను.
అతను ఆశ్చర్యంగా నన్ను చూస్తున్నాడు.
"నాలో మార్పు మొదలైంది. నాకు తెలుస్తోంది. ఈ మార్పుకు కారణం మీరే" అన్నాను వినయ పూర్వకంగా...
నా మార్పుకు మొదటి సంకేతం...
"సురేష్ కు నేను ఫోన్ చేయడం."!!

★★★0★★★

## కథామంజరి దీపావళి కథల పోటీలో ప్రత్యేక ప్రశంస పొందిన కథ



# నాతిచరామి

లక్ష్మి గాయత్రి

తోక తొక్కిన తాచులా కోపంతో ఊగిపోతోంది వసంత.

అందుకు పూర్తి వ్యతిరేకంగా ఉన్నాడు సారథి. వసంత ఎంత ఆవేశంగా ఉందో, అతను అంత శాంతంగా కూర్చుని ఉన్నాడు.

"అన్ని ఏర్పాట్లూ అయిపోయి, అందరి దగ్గరా అంతా చాటింపు వేసేశాక.. ఇప్పుడిలా అనడానికి సిగ్గు లేదూ?" ఈడ్చి కొడుతున్నట్టే అంది వసంత

"సిగ్గా...?!" సారథికి నవ్వొచ్చింది. "నిజమే, ఐదు సంవత్సరాల కాపురాన్ని తుంగలో తొక్కేసి, మానవత్వమన్నది మచ్చుకి కూడా లేకుండా ఎంత కిరాతకానికి ఒడిగట్టానో...ఎంత సిగ్గు లేకుండా ప్రవర్తించానో?!"

"ఓహో... ఈ నాలుగు రోజుల్లోనే అంత మహాత్ముడివైపోయావా" సాధ్యమైనంత వెటకారాన్ని గుప్పించింది వసంత.

"లేదు వసంతా! నేను మహాత్ముణ్ణి ఎప్పటికీ కాలేను. కనీసం మనిషిగా బతుకుదామన్నదే నా తాపత్రయం."

తను ఎంత కోపంగా అరుస్తున్నా సారథి శాంతంగా జవాబులు చెప్పడం వసంతకి నిజంగానే ఆశ్చర్యం అనిపించింది. 'ఉన్నట్టుండి ఏమిటీ మార్పు?! ఎలా ఈ మనిషిని తన దారికి తెచ్చుకోవడం...?!' వసంతకి ఏమీ పాలుపోలేదు. ఉక్రోషం పట్టలేక దుఃఖం కట్టలు తెంచుకుంది.

వెక్కి వెక్కి ఏడుస్తున్న వసంతని చూస్తూ నెమ్మదిగా లేచాడు సారథి.

"వసంతా, నేనింకా ఇక్కడే ఉంటే నీకు మరింత బాధ తప్ప మరేమీ లేదు. నేను వెళుతున్నాను. నువ్వు కాస్త స్థిమితంగా ఆలోచిస్తే నా నిర్ణయం సరైనదేనని నీక్కూడా అనిపిస్తుంది." అంటూ గుమ్మం వైపు తిరిగాడు.

తను ఏడిస్తే సారథి కరిగిపోయి, తనని కౌగలించుకుని ఓదారుస్తాడని ఆశపడి, మరింతగా ఏడుస్తున్న వసంత తెల్లబోయింది.

★★★

వసంత, సారథి పీజీలో క్లాస్ మేట్స్. బిటెక్ తర్వాత బి స్కూల్ ఎంబియేలో చేరిన ఇద్దరిదీ ఒకటే ఆశయం ... కంపెనీలే తమ వెంటపడేంతగా ర్యాంకులు తెచ్చుకుని, జీవితాన్ని బంగారు సోపానాల మీద నడిపించాలి!!

క్లాస్ టాపర్స్ గా ఇద్దరికీ బాగా స్నేహం కలిసింది. ఆ స్నేహం ఇట్టే ప్రేమగా రూపాంతరం చెందింది. తామిద్దరూ జీవిత భాగస్వాములైతే కొండల్ని పిండి చేసెయ్యొచ్చని, తమకు ఎదురనేది ఉండదనీ ఇద్దరూ గర్వించారు.

ఆశించినట్టే ఇద్దరికీ మంచి ఉద్యోగాలు వచ్చాయి. ఇక పెళ్లి చేసుకోవడమే తరువాయి అని ఆనందోత్సాహాలతో ఇల్లు చేరేసరికి, ఊహించని మలుపులు ఎదురయ్యాయి.

వెంకట్ .. బిటెక్ లో వసంతకి సీనియర్. క్యాబినెట్ మంత్రి కొడుకు. వసంత తండ్రి అదే పార్టీ ఎంపీ. కూతురికి కనీసం చెప్పను కూడా చెప్పకుండా కోరి వచ్చిన మంత్రి కొడుకుతో నిశ్చితార్థం చేసేసి, సహాయమంత్రి పదవిని కన్యాశుల్కంగా

పుచ్చుకున్నాడాయన. ఇక సారథి తల్లి, తన అన్న కూతురు శ్వేతే తన కోడలని ఏనాటినుంచో అనుకుంటోంది. కొడుక్కి ఉద్యోగం వచ్చేసింది కాబట్టి ముహూర్తాలు పెట్టించే ఆలోచనలో ఉందామె.

తల్లి శ్వేత ప్రస్తావన తీసుకురాగానే ఒక్కసారిగా వాస్తవంలోకి వచ్చాడు సారథి. అమ్మ శ్వేతని కోడలు కోడలని అంటున్నప్పుడే తనకిష్టం లేదని చెప్పకపోవడం తను చేసిన పెద్ద తప్పు అనుకున్నాడు. ఇప్పుడు శ్వేతని చేసుకోవడానికి తను సిద్ధంగా లేడు. తనకి వసంత కావాలి. తామిద్దరూ కలిసి కలలుగన్న బంగారు భవిష్యత్తును వాస్తవం చేసుకోవాలి. వసంత గురించి తల్లికి చెప్పెయ్యాలన్న నిర్ణయానికి వచ్చాడు సారథి. సరిగ్గా అప్పుడే వసంత ఫోన్ చేసి తన పెళ్లి నిశ్చయించేశారనీ, కాదని మొండికేస్తే తనని చంపి, తండ్రి చస్తానంటున్నాడనీ చెప్పింది.

"నేనసలు ఎవ్వర్నీ చేసుకోను అని చెప్పేశాను సారథీ. అమెరికా వెళ్లిపోతున్నాను. నువ్వు కూడా వచ్చెయ్యి. హెల్ విత్ ది మేట్రిమోనియల్ సిస్టమ్... ఇద్దరం హాయిగా కలిసి బతుకుదాం. అంత దూరంలో మనం ఎలా ఉన్నా అడిగేవాడు లేడు!"

ఆ మాటకి స్తంభించిపోయాడు సారథి. పెళ్లి పెటాకులూ లేకుండా కలిసి ఉండటమా?!

సారథి సందేహం విని, "నిన్నూ నన్నూ కలిపి ఉంచేది ప్రేమా... మంగళసూత్రమా?!" అంటూ ప్రశ్నించింది వసంత

దానికి జవాబు చెప్పలేకపోయాడు సారథి. ప్రేమ ప్రస్తావనే లేకుండా మాంగళ్యబంధానికి విలువ ఇస్తూ కలిసి కాపురం చేస్తున్నవాళ్లు తెలుసు. కానీ, సాంప్రదాయాన్ని పూర్తిగా తోసిరాజనే బతుకుల్లో ప్రేమ నిలుస్తుందా?!

సారథి వెనుకంజవేయడం వసంతకి విపరీతమైన కోపం తెప్పించింది.

"నీకు సాంప్రదాయమే ముఖ్యమనుకుంటే ఎవరో ఒక ఆడదాని మెడలో తాడు కట్టి, పిల్లల్ని కను. బై.." అంటూ ఫోన్ పెట్టేసింది.

మరో పది రోజుల తర్వాత వసంత అమెరికా వెళ్లిపోయిందని తెలిసింది సారథికి. తల్లినొక్కర్తినీ వదిలేసి విదేశాలకు వెళ్లడం సారథికి మొదటి నుంచీ ఇష్టం లేదు. ఇక తన దారి తను చూసుకోక తప్పదనుకున్నాడు.

ఆ తర్వాత ఏడాది తిరక్కుండా సారథికి శ్వేతతో పెళ్లి జరిగిపోయింది. మరో ఏడాది తిరిగేసరికి శిరీష పుట్టింది.

వసంత ఉత్తుంగ తరంగాలతో ప్రవహించే సాగరమైతే, శ్వేత నిర్మలమైన సెలయేరు. తనివితీరా తెలుగు ఎమ్మే చేసి, ఏదో ప్రైవేట్ కాలేజీలో తెలుగు లెక్చరర్ గా పని చేస్తోంది. అన్నమయ్య కీర్తనలు పాడుకుంటూ దీపం పెట్టుకుని, ఎంకి పాటలు హమ్ చేసుకుంటూ, మల్లెలు మాల కట్టుకునే పిల్ల. శ్వేతకి కోపం రావడం మాట అటుంచి, విసుక్కోవడం కూడా ఎప్పుడూ చూడలేదు సారథి. మొత్తానికి అతనికి జీవితం ప్రశాంతంగా సాగిపోతోంది. ఉరవడీ లేదు, మందకొడీ లేదు. రోజూ తినే అన్నంలా, పీల్చే ఊపిరిలా, కొట్టుకునే గుండెలా యాంత్రికంగా సాగిపోతోంది. కనీసం రెండు మూడు రోజులకోసారైనా వసంత గుర్తొస్తూనే ఉంది.

"వసంత అయితే ఎంత బావుండేదో..." అని అనిపిస్తూనే ఉంది.

★★★

నాలుగేళ్లు గడిచాయి. హఠాత్తుగా ఒకరోజు, ఉరమని పిడుగులా, నిర్మలాకాశంలో మెరుపులా సారథి ముందు ప్రత్యక్షమైంది వసంత.

హోటల్ రూంకి లాక్కెళ్లి, సారథిని గట్టిగా కౌగలించుకుని పెదవులమీద గాఢంగా ముద్దు పెట్టుకుంది!

ఒక్కసారిగా శరీరం వేడెక్కింది సారథికి. ఒంట్లో రక్తమంతా ఉరకలు వేస్తూ ప్రవహిస్తున్నట్టు అనిపించింది. అప్రయత్నంగా వసంత చుట్టూ చేతులు వేసి ఆమెను మరింతగా హత్తుకున్నాడు!

"వాడు పోయాడు సారథీ" రెండు నిమిషాల తర్వాత ఆనందంగా చెప్పింది వసంత. "యాక్సిడెంట్. స్పాట్ డెడ్ ట! పీడా పోయింది!"
ఎవరు పోయారో గ్రహించడానికి ఒక్క నిమిషం పట్టింది సారథికి. అర్థం కాగానే "అయ్యో" అన్నాడు.
"సరే, అదంతా వదిలెయ్ గాని, ఇంక మనకే అడ్డూ లేదు. మనం పెళ్లి చేసుకుందాం సారథీ..." గారంగా సారథిని చుట్టుకుంటూ అంది వసంత.
ఏదేళ్ల తర్వాత మళ్లీ స్తంభించిపోయాడు సారథి.
"పెళ్లా... నాకు పెళ్లయింది కదా. కూతురు కూడా ఉంది!" తడబడుతూ అన్నాడు
"అయితే ఏమైంది?! గెట్ డైవోర్స్. యువర్ మేరీడ్ లైఫ్ ఈజ్ వెరీ టెండర్ .. బెటర్ టు ప్లక్ ఇట్ నౌ. సాంప్రదాయం చట్టుబండలూ అంటూ ఇప్పటికే ఏదేళ్లు వేస్ట్ చేశావు. బెటర్ లేట్ దేన్ నెవర్ సారథీ!"
వసంత మాటలతో ఏదో మైకం కమ్మినట్టయింది సారథికి. నిజమే. డైవోర్సులూ, మళ్లీ పెళ్లి సర్వసాధారణమైపోయాయి ఇప్పుడు. అడ్డుపెట్టి తిట్టడానికి పెద్దవాళ్లు కూడా ఎవరూ లేరు. వసంత చెప్పినట్లు చేస్తే తప్పేమిటి?!
వసంతకి పూర్తిగా లొంగిపోయాడు సారథి. శ్వేతకి చెప్పేబాధ్యత తనే తీసుకుంది వసంత.

సారథితో బాటు ఇంటికొచ్చి కూచుని క్లుప్తంగా మొత్తం విషయమంతా శ్వేతకి చెప్పింది. తాము ఎనిమిది సంవత్సరాల నుంచీ ప్రేమికులమనీ, ఇకనైనా కలిసి బతకనివ్వమనీ కోరింది. శ్వేత భవిష్యత్తును కూడా దృష్టిలో పెట్టుకుని మొత్తం అంతా పకడ్బందీగా లీగలైజ్ చేస్తానని హామీ ఇచ్చింది.
సారథి భయపడినట్టు శ్వేత బెంబేలెత్తిపోలేదు. ఏడవలేదు. ప్రశాంతంగానే అంతా విని, వసంతకి బొట్టు పెట్టి సాగనంపింది. రాత్రి కూతురు నిద్రపోయాక, సారథి దగ్గరకి వచ్చి కూచుంది.
"బావా, నన్ను చేసుకోవడం నీకు ఇష్టం లేదని నేను మొదటి నుంచీ అనుమానపడుతూనే ఉన్నాను. పెళ్లికి ముందు నీతో ఒక్కసారి మాట్లాడితే బావుండేది. సరే, అయిందేదో అయింది. గొడవచేసే పెద్దవాళ్లెవరూ లేకపోవడం నిజంగా అదృష్టమే. అయితే, ఈ డైవోర్సులూ అవీ నాకు ఇష్టం లేదు బావా. నేను నీకు ఎట్టి పరిస్థితుల్లోనూ అడ్డు రాను. భవిష్యత్తులో అసలు నీవైపు కన్నెత్తి చూడను... నీ సంపాదనలో పైసా అడగను. నా కూతురికి నీ పేరు కూడా చెప్పను. నీకూ, వసంతకీ నమ్మకం కలగడం కోసం, ఇదిగో ఈ కాగితాల మీద లాయర్ చేత మీ ఇష్టం వచ్చినట్లు రాయించుకోండి. నాలుగు కాగితాల మీదా సంతకాలు చేశాను. నా మెడలో మంగళసూత్రం మాత్రం తియ్యడంలేదని లాయర్ కి చెప్పండి. దాని వల్ల మీకు ఎటువంటి ఇబ్బందీ ఉండదనే అనుకుంటున్నాను." అని చెప్పేసి, అంతే ప్రశాంతంగా లేచి వెళ్లిపోయింది.

ఆ మరుసటి రోజు నుంచీ సారథికి కాఫీ, టిఫిన్, భోజనం అన్నీ మామూలుగా అమరుతున్నాయి గాని, శ్వేతా, శిరీషా అతని కంటపడటం బాగా తగ్గిపోయింది. మాటలు పూర్తిగా బంద్ అయిపోయాయి.
ఇలా ఉండగా ఒకరోజు రాత్రి సారథి ఇంటికొచ్చి బట్టలు మార్చుకోబోతుంటే, హఠాత్తుగా సుడిగాలిలా దూసుకొచ్చిన నాలుగేళ్ల శిరీష, "నాన్నా" అంటూ ఏడుస్తూ సారథిని చుట్టుకుపోయింది.
ఊహించని ఆ సంఘటనకి ఒక్క క్షణం బిత్తరపోయిన సారథి, మరుక్షణమే తేరుకుని, చప్పున వంగి పసిదాన్ని చేతుల్లోకి తీసుకుని గుండెలకు హత్తుకున్నాడు.
"నాన్నా, నాన్నా" శిరీష ఆపకుండా ఏడుస్తూనే ఉంది.
కూతురి వెనకాలే వచ్చిన శ్వేత ఖిన్నవదనంతో,

"సారీ బావా. నేను నీ దగ్గరకి రానివ్వడంలేదని, ఇలా పరిగెత్తుకొచ్చేసింది." అంటూ దగ్గరగా వచ్చి, "సిరీ... బంగారు తల్లి కదూ. నాన్న బిజీగా ఉన్నారని చెప్పానా" అంటూ పిల్లని తీసుకోబోయింది.
శిరీష మరింతగా తండ్రిని హత్తుకుపోతూ,
"నేను రాను. నువ్వు ఫో. బాడ్ మమ్మీ" అంటూ అరిచింది.
శ్వేత కళ్లలో నీళ్లు తిరగడం తొలిసారిగా చూశాడు సారథి. అతను ఏదో అనబోయే లోగానే శ్వేత వెనుదిరిగి వెళ్లిపోయింది. శిరీష మాత్రం తండ్రిని వదలలేదు. తన పొట్ట మీద కాలు వేసి పడుకున్న కూతురి తల నిమురుతూ, జోకొడుతూ పడుకోబెట్టాడు.
"శిరీష" తనకి ఇష్టమైన పేరు. పాప పుట్టింది అని వినగానే, "శిరీష" పుట్టింది అనుకున్నాడు. శిరి పుట్టిన నెల లోపునే అతనికి చాలా పెద్ద జీతంతో కొత్త ఉద్యోగం దొరికింది.
'అందుకే ఆడపిల్ల ఇంటికి శ్రీ మహాలక్ష్మి అంటారు' అనుకుంటూ శిరీషకి బుల్లి బుల్లి గాజులు చేయించాడు. శిరీష అచ్చం తండ్రి పోలికే. ఆ మాట ఎవరైనా అంటే గర్వంతో అతని ఛాతీ రెట్టింపయేది. "నేనూ నీలాగే చదువుకుంటా నాన్నా" అని కూతురు అంటుంటే ఆనందంగా శ్వేత వైపు చూస్తూ తలెగరేసేవాడు! సారథి తండ్రి అతనికి ఏడాది నిండకుండానే పోయాడు. తండ్రి ప్రేమ ఎలా ఉంటుందో ఎరగని సారథి, తన కూతుర్ని ఎంతో అపురూపంగా పెంచుకోవాలని చాలా సార్లు అనుకున్నాడు.
ఆలోచనల్లో తలమునకలవుతున్న సారథి, "ఇది ప్రేమ కాదా?! ఇంత ప్రేమని కాలదన్ని, ఇంకా ఏ ప్రేమ కోసం తను భార్యాపిల్లల్ని వదిలేసి వెళ్లిపోదామనుకున్నాడు?!" అని తనని తనే ప్రశ్నించుకున్నాడు.

ఆ క్షణంలో అతనికి ఒక్కసారి భార్యని కూడా ప్రేమగా కౌగలించుకుని, గుండెలకు హత్తుకోవాలన్న తీవ్రమైన కోరిక కలిగింది. నెమ్మదిగా లేచి, శ్వేత పడుకున్న దగ్గరకి వచ్చాడు. అతను ఊహించినట్టే శ్వేత నిద్రపోవడం లేదు. మేలుకునే ఉంది. సారథి వచ్చిన అలికిడికి గబుక్కున లేచి, "శిరి ఏడుస్తోందా?" అని అడిగింది.
"లేదు. హాయిగా నిద్రపోతోంది."
శ్వేత మరేం మాట్లాడలేదు. ప్రశ్నార్థకంగా చూసింది.
సారథి ఒక్క క్షణం తటపటాయించి, తర్వాత, "శ్వేతా, నీకు అభ్యంతరం లేకపోతే..." అంటూ చేతులు జాపాడు.
శ్వేతకి ముందు అర్థం కాలేదు. అర్థమయాక, నెమ్మదిగా నడుస్తూ వచ్చి, ఎంత నెమ్మదిగా వచ్చిందో అంత గాఢంగా హత్తుకుపోయింది.
ప్రియమారా భార్యని గుండెల్లో ఇముడ్చుకున్నాడు సారథి. నులివెచ్చని ఆ కౌగిలిలో ఎనలేని ప్రశాంతతనూ, హాయినీ అనుభవించాడు! తన గుండెల్లో తల దాచుకుని నిశ్శబ్దంగా ఏడుస్తున్న శ్వేత మొహం పైకెత్తి, కళ్లు తుడిచి, శిరీషని పెట్టుకున్నట్టే శ్వేతనీ ప్రేమగా ముద్దు పెట్టుకున్నాడు!

ఆ మర్నాడు ఉదయాన్నే వసంత దగ్గరకి వెళ్లి తను ఆమెతో కలిసి రావడం లేదని చెప్పేశాడు.
వసంత ముందు తెల్లబోయింది. తర్వాత కోపం తెచ్చుకుంది. ఏడ్చింది.

★★★

వసంతా,

ఎలా ఉన్నావు?! నేను నీ దగ్గర ఉన్నంతసేపూ ఏదీ ఓ కొలిక్కి రాదని నాకు తెలుసు. అందుకే నువ్వు ఏడుస్తున్నా వచ్చేశాను. రైతు భవిష్యత్తు కోసం పంట పండిస్తాడు. ఉపాధ్యాయులు పిల్లల భావి జీవితాల కోసమే పాఠాలు చెబుతారు. భవిష్యత్తు బావుండాలని పూజారి పూజలు చేస్తాడు. అనాదిగా మనిషి జీవితం రేపటికి అనుగుణంగానే తీర్చి దిద్దబడింది. ఆ దిద్దుబాటులో ఒకటి వివాహ వ్యవస్థ! స్త్రీ పురుషుల ఆర్థిక, సామాజిక, శారీరక, ఆధ్యాత్మిక అవసరాల్నీ, ఆరోగ్యాల్నీ దృష్టిలో పెట్టుకుని వైవాహిక బంధాల్ని సృష్టించారు. ఆరోగ్యకరమైన జీవితాన్ని గడుపుతూ, మరింత ఆరోగ్యమైన భావితరాన్ని పెంపొందించడమే వివాహ వ్యవస్థ లక్ష్యం. అయితే ఈరోజున మనలాంటి ఉన్నత విద్యావంతులు సైతం అహంకరించి, ప్రేమ పేరిట సదరు వ్యవస్థకు తూట్లు పొడుస్తున్నారు.

అసలు ప్రేమంటే ఏమిటి వసంతా?! ఒక స్త్రీకి ఒక పురుషుడికీ మధ్య ఉండేదే ప్రేమ అని ఈనాడు ప్రేమభావాన్నే భ్రష్టు పట్టిస్తున్నాం. తల్లిదండ్రులకి పిల్లల మీద ఉండేది ప్రేమ కాదా?! పిల్లలు తల్లిదండ్రుల్ని ప్రేమించరా?! అక్కచెల్లెళ్లు, అన్నదమ్ములు, స్నేహితులు, బంధువులు... వీరందరి మధ్యా ఉండే పరస్పరానురాగం ప్రేమ కాదా?! ప్రేమంటే ఏమిటో నాకు నిన్న, మొన్ననే తెలిసింది. అధర్మానికి దూరంగా, మానవత్వానికి చేరువగా, కరుణకు ప్రతిబింబంగా వెల్లివిరిసేదే ప్రేమ. స్త్రీ పురుషుల మధ్య ప్రేమ, వివాహబంధమనే ధర్మసూత్రానికి ముడిపడినప్పుడే జీవితం ప్రశాంత సరోవరమవుతుంది. అలా కానప్పుడు ధర్మగ్లానికి దారి తీసి, మనిషి జీవితాన్ని సంక్లిష్టం చేస్తుంది. వివాహేతర సంబంధాలూ, ప్రేమలూ ఎన్నెన్ని జీవితాల్ని బలిగొంటున్నాయో మనం చూస్తూనే ఉన్నాం. ముఖ్యంగా పిల్లలు ఇటువంటి అధర్మాలకు బలైపోతున్నారు. నా కూతుర్ని అలా బలి చెయ్యను. నన్నే నమ్ముకుని హాయిగా జీవిస్తున్న శ్వేతని అనాధని చెయ్యను. ఒక ఆడదాన్ని, ఒక పసిదాన్ని నట్టేట్లో ముంచేసేవాడికి ప్రేమేమిటి?! అటువంటివాడు అసలు ప్రేమ అన్న పదం ఉచ్చరించడానికి కూడా అనర్హుడే. "నా ధర్మం, నా అర్థం, నా కామం, నా మోక్షం నా భార్యతోనే" అని ప్రతి మగవాడూ అనుకుంటే సమాజంలో సమస్యలు నూటికి తొంభై శాతం తగ్గుతాయి! నువ్వు కూడా నీకు నచ్చిన వాణ్ణి పెళ్లి చేసుకుని హాయిగా జీవించు! "నాతిచరామి" లో ఉండే ఆనందాన్ని స్వయంగా అనుభవించు!
నీకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు!
ఉంటాను
స్నేహితుడు
పార్థ సారథి.

★★★0★★★

# కథామంజరి దీపావళి కథల పోటీలో ప్రత్యేక ప్రశంస పొందిన కథ



# శ్రీకారం

## ఎన్. శివనాగేశ్వరరావు

నా మీద నేను జాలిపడడమంటే నాకు అసహ్యం. అది ఆత్మహత్యా సదృశ్యం అని నా నిశ్చితాభిప్రాయం.   నేను ఇటువంటి అభిప్రాయాలు ఏర్పరుచు కోవడానికి, నా భావ పరిధి విస్తృతం అవడానికి కారణం వామనరావు.

అతనితో నా పరిచయం విచిత్రంగా జరిగింది.

అప్పట్లో .. నేను పదో తరగతి తప్పాను. మా క్లాస్ లో అందరూ పాస్ అయ్యారు. అది చూసి జీవితంలో తొలిసారి నామీద నేను జాలి పడ్డాను. ఇంటి దగ్గర అమ్మ, నాన్నలకు నా ముఖం చూపించడానికి సిగ్గేసింది. ఒక చెట్టు క్రింద కూర్చుని మోకాళ్ళ మధ్య తల పెట్టుకొని ఏడవసాగాను.

అంతలో సైకిల్ టైర్ పంచర్ అయిన శబ్దానికి తల ఎత్తి చూసాను. ఒకబ్బాయి పాల క్యాన్ తో సైకిల్ మీద వెళ్తున్నాడు. అతని సైకిల్ టైర్ కే పంచర్ అయింది. ఆ అబ్బాయికి ఇంచుమించు నా వయసే ఉంటుంది.   ఆ అబ్బాయి నన్ను చూశాడు. నా దీనావస్థ గమనించినట్లున్నాడు. నా దగ్గరకు వచ్చి నా ప్రక్కనే కూర్చుని "ఎందుకు ఏడుస్తున్నావు?" అని అడిగాడు.

నేనేం మాట్లాడ లేదు.

అతను నా భుజం మీద చెయ్యి వేసి "నన్ను నీ అన్నయ్య అనుకో. ఎందుకు ఏడుస్తున్నావో చెప్పు" అన్నాడు. అతని ఓదార్పు నా మనసు తలుపు తట్టింది. విషయం చెప్పాను.

అది విన్న ఆ అబ్బాయి "ఇలా ఏడవడానికి సిగ్గు లేదూ!" అన్నాడు.

అతని ఓదార్పుకు ఎదురు చూసిన నేను అతని మాటకు షాకయ్యాను.

"పరీక్ష తప్పావు. అంతే కదా! చదువు లేకపోతే బ్రతకలేవా? నన్ను చూడు. నాకు చదువు లేదు. ఇంటింటికీ వెళ్లి పాలు పోస్తాను. మా అమ్మను పోషిస్తున్నాను కూడా" అన్నాడు.

చదువుకుంటేనే బ్రతకగలం అన్న నా ఆలోచనకు తొలిసారి గండి పడింది. నేను ఆ అబ్బాయి వంక అయోమయంగా చూసాను.  అతను, నాకు తన సైకిల్ చూపించి,

"ఇప్పుడు నా సైకిల్ టైర్ పంచర్ అయింది.  అంతమాత్రానికి మనం బెంబేలు పడం కదా!  పంచర్ వేయించి మరలా సైకిల్ తొక్కుతాం.  జీవితమూ అంతే!" అన్నాడు.

ఆ క్షణం నాకు అబ్బాయి నా వయసు వాడిలా అనిపించలేదు.

"ఇప్పుడు పరీక్ష తప్పినా మరలా చదివి పాస్ అవ్వచ్చు. అంతేగాని భయపడి, బాధపడి ఆగిపోకూడదు. మా నాన్న చిన్నప్పుడే చనిపోయాడు. ఇప్పుడు నేను నీకు చెప్పిన సంగతులు నాకు జీవితం నేర్పిన పాఠాలు" అన్నాడు.

నా మనసుకు సాంత్వన చేకూరింది. తెలియని ధైర్యం వచ్చింది. మాటల్లో ఆ అబ్బాయి పేరు 'వామనరావు' అని తెలిసింది. ఇద్దరం కలిసి బయలుదేరి వెళ్లి సైకిల్ టైర్ పంచర్ వేయించాము. వామనరావు నన్ను సైకిల్ మీద ఎక్కించుకొని మా ఇంటి దగ్గర దింపి వెళ్తూ "మనమీద మనం జాలిపడడం చావుతో సమానం" అన్నాడు.
ఆ మాట నా మనసు మీద బలంగా ముద్ర పడిపోయింది.

నేను అమ్మానాన్నలతో "నేను పరీక్ష తప్పాను. ఈసారి బాగా చదివి తప్పక పాస్ అవుతాను" అని చెప్పాను. నేను పరీక్ష తప్పినందుకు వాళ్లు బాధపడ్డారే గాని, నన్ను మందలించ లేదు.

ఆ తర్వాత అప్పుడప్పుడు నేను, వామనరావు కలుస్తూ ఉండేవాళ్ళం. అతన్ని మా స్నేహితులకు పరిచయం చేశాను. అందరితో ఇట్టే కలిసిపోయాడు. అయితే చిన్నతనంలోనే బాధ్యతల వలన మాతో ఎక్కువ సమయం గడిపేవాడు కాదు. నేను అతనికి చదువు నేర్పించే ప్రయత్నం చేశాను. ఎందుకో అది అంతగా కొనసాగలేదు.
వామనరావు ఏం చెప్పినా నాకు అద్భుతంగా అనిపించేది. వామనరావు స్నేహం నా మీద పెను ప్రభావం చూపింది. పదో తరగతి పరీక్ష మరలా కట్టి, ఈసారి మంచి మార్కులతో పాసయ్యాను. వామనరావు ఎంతో సంతోషించాడు.
ఇంటర్ కోసం టౌన్ కి వెళ్ళవలసి వచ్చింది. అందువల్ల వామనరావుని తరచూ కలవడం వీలు పడేది కాదు. అయితే అప్పటికే అతను నా జీవితం మీద వేయవలసిన ముద్ర వేసేసాడు.

డిగ్రీ పూర్తి అయింది. మంచి మార్కులు వచ్చాయి. సివిల్స్ పరీక్ష పాస్ అవడం లక్ష్యంగా పెట్టుకున్నాను. అందుకు చాలా కష్టపడ్డాను. ఎంతగా అంటే తిండి తిప్పలు కూడా మర్చిపోయాను. కళ్ళముందు ఒకటే లక్ష్యం. సివిల్స్ పాస్ అవ్వాలి. నేను కలెక్టర్ కావాలన్న అమ్మా నాన్న కోరిక తీర్చాలి. ఆరోగ్యం కూడా కొంచెం సన్నగిల్లింది.
ఎట్టకేలకు సివిల్స్ పరీక్ష పాసయ్యాను. నా ఆనందానికి అవధులు లేవు. అమ్మానాన్నలు కూడా ఎంతో సంతోషించారు. నేను కలెక్టర్ అయిపోయినట్టే భావించారు. ఆ విషయం వామనరావు కి చెప్పాను.
"ఒకప్పుడు పదో తరగతి తప్పి చెట్టు క్రింద కూర్చుని ఏడ్చిన అబ్బాయి తొందరలో కలెక్టర్ కాబోతున్నాడు" అని నవ్వాడు. వామనరావు సంతోషం పసిగట్టాను.

ఆ తర్వాత సివిల్స్ ఇంటర్వ్యూ కి ఎంతో ఆత్మ విశ్వాసంతో వెళ్ళాను. అంతే బాగా సమాధానాలు చెప్పాను. నా జడ్జిమెంట్ ఎప్పుడూ తప్పలేదు. అందుకే తప్పక సెలెక్ట్ అవుతాను అని భావించాను. అయితే విధి వక్రించింది. నేను సెలెక్ట్ కాలేదు. అది నన్ను బాగా డిస్టర్బ్ చేసింది. నేను పడిన కష్టం నన్ను వెక్కిరించింది. చాలా కాలం తర్వాత నా మీద నాకు జాలి వేసింది. అయితే చిత్రంగా వామనరావు గుర్తుకొచ్చాడు. పదో తరగతి తప్పినప్పుడు అతను చెప్పిన జీవిత సత్యం మదిలో మెదిలింది.

అంతలో వామనరావు నుంచి ఫోన్ వచ్చింది
"బాధపడకు, సివిల్స్ చేసిన నీకు మిగిలిన పరీక్షలు నామమాత్రం. మంచి ఉద్యోగం ఎంపిక చేసుకొని పరీక్షకు సిద్ధం అవ్వు" అన్నాడు.
నేను త్వరగానే మామూలు మనిషి అయ్యాను. వామనరావు చెప్పినట్లు సివిల్స్ కి ప్రిపేర్ అయిన నాకు మిగిలిన పరీక్షలు చాలా తేలికగా అనిపించాయి. స్టేట్ బ్యాంకు లో ప్రొబేషనరీ ఆఫీసర్ గా సెలెక్ట్ అయ్యాను.

ఆ తరువాత రాధ అనే అమ్మాయితో నా పెళ్లి ఘనంగా జరిగిపోయింది. వామనరావు కూడా పెళ్లికి వచ్చాడు.
నా జీవితం ఎంతో సంతోషంగా సాగిపోయింది. అమ్మానాన్నలను ఆ పల్లెటూరి నుంచి నా దగ్గరికి తెచ్చుకున్నాను. రాధ వాళ్ళను అపురూపంగా చూసుకుంటూ 'మంచి కోడలు' అన్న బిరుదు సంపాదించుకుంది.
మాకు ఒక బాబు, పాప పుట్టారు. వాళ్ల చదువులు, నా ట్రాన్స్ఫర్స్, ప్రమోషన్లు...జీవితం బిజీ అయిపోయింది. క్రమేపీ వామనరావుతో సంబంధాలు తగ్గిపోయాయి. అయితే అప్పుడప్పుడు మనసులో మెదులుతూ ఉండేవాడు.

మా పిల్లలు కొంత ఆలోచించే స్థాయికి రాగానే "మన మీద మనం జాలి పడ్డం కంటే చావు నయం" అని వామనరావు నాకు నేర్పిన జీవిత పాఠం వాళ్లకి చెప్పాను. ఎందుకంటే ఆ దృక్పథం జీవితానికి ఎంతో ముఖ్యం. మా అబ్బాయి సుధామ్ చదువులో చురుగ్గా ఉండేవాడు. మంచి మార్కులు తెచ్చుకునేవాడు. అమ్మాయి రేవతి యావరేజ్ స్టూడెంట్. నేను నా తెలివితేటలు, కష్టపడేతత్వం తో ప్రమోషన్ సంపాదిస్తూ ఉండేవాడిని. కాలచక్రం ఎవరికోసం ఆగదు, నిరంతరం పరిభ్రమిస్తూ ఉంటుంది. అమ్మా నాన్నలు కాలం చేశారు.

జీవితం ఒక జగన్నాటకం. ఎవరి పాత్రలు వాళ్లు పోషించి నిష్క్రమిస్తారు. ఆ సత్యం అవగతం చేసుకుంటే జీవితంలో విషాదం ఉండదు. అమ్మా నాన్న మరణం బాధాకరమే గాని అనివార్యం అని అర్థం చేసుకున్నాను.

మా అబ్బాయి సుధామ్ ఎమ్ టెక్ చేసి ముంబైలో ఒక పేరు మోసిన కన్స్ట్రక్షన్ కంపెనీ లో ఉద్యోగం సంపాదించి వెళ్ళిపోయాడు. అమ్మాయి రేవతికి చదువు మీద పెద్ద ఆసక్తి లేకపోవడంతో సింపుల్ గా డిగ్రీ పూర్తి చేసింది. తన పెళ్లి జరిపించేసాము. ఆ తరువాత నేను జనరల్ మేనేజర్ స్థాయి లో రిటైర్ అయ్యాను. రిటైర్ అయి ఆరు నెలలు గడిచాయి. అంతవరకు నిర్విరామంగా పని చేసిన నేను, ఖాళీగా సమయం గడపలేక పోయాను. ఏదో చేయాలని మనసు పోరు పెట్టసాగింది. అయితే ఏం చేయాలో బోధపడలేదు. ఆర్థికంగా ఇబ్బందులు లేవు కాబట్టి డబ్బు కోసం వెంపర్లాడాల్సిన అవసరం నాకు లేదు. పదుగురికి పనికి వచ్చేది ఏదైనా చేయాలనిపించింది. అలాంటి సమయంలో నాకు వామనరావు గుర్తుకొచ్చాడు. అతను ఎప్పుడూ మదిలో మెదులుతూనే ఉండేవాడు.

వామనరావు గురించి ఎక్కడ ఉన్నాడో, ఎలా ఉన్నాడో తెలుసుకోవడానికి ప్రయత్నించాను. అతను మా పల్లెటూర్లో ఉండటం లేదని తెలిసింది. అతి కష్టం మీద అతని ఫోన్ నెంబర్ సంపాదించాను. అతనికి ఫోన్ చేశాను.
"ఎవరు మాట్లాడేది?" అన్నాడు వామనరావు. అతని స్వరం తేలిగ్గానే గుర్తుపట్టాను. అలాగే ఆ స్వరం నీరసంగా ఉండడం కూడా గమనించాను.
"వామనా! నేను శీను" అని చెప్పాను.
"ఏ శీను? పదో తరగతి తప్పి చెట్టు కింద కూర్చుని ఏడ్చిన శీనేనా?" అని నవ్వాడు.
"అవును ఆ శీనునే మాట్లాడుతున్నాను. ఈమధ్యనే రిటైర్ అయ్యాను. నిన్ను చూడాలనిపించింది. నీ ఫోన్ నెంబర్ సంపాదించడానికి చాలా కష్టపడ్డాను" అని చెప్పాను.
"శీనూ! ఆరోగ్యం బాగాలేదు. ప్రాణం ఎప్పుడైనా పోవచ్చు అనిపిస్తున్నది. చావంటే భయం లేదు. దాని కోసం ఎదురు చూస్తున్నాను" అన్నాడు వామన రావు.
అతని మాటలకు తీవ్రంగా బాధనిపించింది.

"వీలు చూసుకొని వస్తాను" అని చెప్పాను. చెప్పినట్లే రెండు రోజుల్లో బయలుదేరి అతను ఉండే ఊరు వెళ్ళాను. అతను చెప్పిన గుర్తుల ప్రకారం ఇల్లు వెతుక్కుంటూ వెళ్లాను. అతను ఉండేది చిన్న డాబా ఇల్లు. నేను వెళ్లే సరికి మంచం మీద నిస్త్రాణగా పడుకొని ఉన్నాడు. నా రాక గురించి ముందే చెప్పినట్లు ఉన్నాడు. అతని భార్య నన్ను తేలిగ్గానే గుర్తుపట్టి, లోనికి ఆహ్వానించింది.

"కాఫీ తీసుకురా!" అని పురమాయించాడు వామనరావు.

"బాధ్యతల ఒత్తిడిలో పడిపోయి నీ గురించి తెలుసుకునే ప్రయత్నం చేయలేకపోయాను. సారీ!" అన్నాను.

"అది సహజం. అదే జీవితం" అన్నాడు వామనరావు. అతని మాటల్లో ఎటువంటి మార్పు రాకపోవడం గమనించాను. అతని భార్య కాఫీ తెచ్చి ఇచ్చింది.

"పిల్లలు ఏం చేస్తున్నారు?" అని అడిగాను.

"ఒక్కడే కొడుకు. పేరు రాజీవ్. నేను చదువుకోలేదు కాబట్టి వాడిని బాగా చదివించాలని ఆశ పడ్డాను. వాడు బానే చదివాడు. ఎంబీఏ పూర్తి చేశాడు. అయితే ఎంత ప్రయత్నించినా ఉద్యోగం రాలేదు. తన మీద తాను జాలి పడ్డం మొదలు పెట్టాడు. నేను నీకు చెప్పినట్లే వాడికీ చెప్పాను. అయితే వాడు శీను కాదు కదా అర్థం చేసుకోవడానికి. వాడు నా కొడుకు. నా మాట వాడి బుర్రకి ఎక్కలేదు. ఇంటిపట్టున ఉండడు. తాగుడు అలవాటు చేసుకున్నాడు. వాడి గురించే నా బాధంతా. ఒక్కగానొక్క కొడుకు. వాడి మీద ఎన్నో ఆశలు పెంచుకున్నాను. చివరికి ఇలా జరిగింది. ఆ మనోవ్యథతోనే నా ఆరోగ్యం చెడింది" అని కన్నీరు పెట్టుకున్నాడు.

వామనరావు బాధ అర్థం చేసుకున్నాను.

"బాధపడకు. నీ కొడుకుతో నేను మాట్లాడుతాను. దారిలో పెట్టే ప్రయత్నం చేస్తాను" అన్నాను.

అందుకు వామనరావు నిరాశగా నవ్వాడు.

" ఎప్పుడు వస్తాడు?" అని అడిగాను.

"చెప్పలేను. ఏ అర్ధ రాత్రికో వస్తాడు" అన్నాడు .

అంతలో దగ్గు తెర అతన్ని కమ్మేసింది. అతని భార్య ఏదో మందు తెచ్చి తాగించింది. ఇద్దరం కలిసి భోజనం చేసాము. సాయంకాలం నేను బయలుదేరిపోయాను. బయలుదేరేటప్పుడు అతని చేతిలో పది వేలు పెట్టి

"ఆరోగ్యం జాగ్రత్త!" అన్నాను.

మొదట డబ్బు తీసుకోవడానికి ఒప్పుకోలేదు. బలవంతం చేస్తే చివరకు తీసుకున్నాడు. నాతో పాటు బయటకు వచ్చాడు. నేను కారు ఎక్కుతూ

"నీ దగ్గర జీవిత పాఠాలు నేర్చుకున్న వాడిని. నీకు నేనేం చెప్పగలను? ధైర్యంగా ఉండు" అన్నాను.

"అలా ఉండబట్టే ఇప్పటిదాకా బ్రతకగలిగాను" అన్నాడు వామన రావు.

నేను బయలుదేరి పోయాను. కారులో ప్రయాణం చేస్తూ నేను వామనరావు గురించి ఆలోచించాను. నా జీవితాన్ని తీర్చిదిద్దిన అతను తన కొడుకు విషయంలో ఫెయిల్ అయ్యాడు. అంతా విధివ్రాత అనుకున్నాను.

నేను వామనరావును కలసి వచ్చిన మూడు నెలలకు అతను మరణించిన వార్త అందింది. నా మనసు తీవ్రమైన షాక్కి గురయింది.

నెల గడిచిపోయింది. నా మనసులో మాత్రం వామనరావు ఆలోచనలు చెరిగిపోలేదు. నేను కలిసినప్పుడు అతను పడిన బాధ, కొడుకు గురించిన పడిన ఆవేదన జ్ఞాపకానికి వచ్చాయి. మనసు వికలం అయ్యింది. తమ మీద తాము జాలిపడే వాళ్ళు, నిరాశ, నిస్పృహలకు గురయ్యే ఎందరో నా మనోపథంలో మెదిలారు. అటువంటి అభాగ్యులకు ఏదైనా చేయాలనిపించింది. త్వరలోనే నా ఆలోచనకు ఓ రూపం కల్పించాను.

ఆ రూపావిష్కరణే "వామన కౌన్సిలింగ్ సెంటర్". నేను చేయబోయే మంచి పనికి వామనరావు కొడుకుతోనే శ్రీకారం చుట్టాలని భావించాను.
అందుకే అతన్ని వెతుక్కుంటూ వామనరావు ఊరు బయలుదేరాను. వెళ్ళి రాజీవ్ ని కలిసాను. నేను ఏ పని మీద వచ్చానో చెప్పాను. అంతా విన్న రాజీవ్
"నన్ను క్షమించండి అంకుల్! నేను మా అమ్మ కడుపున చెడ బట్టాను. మా నాన్న నా మీద పెట్టుకున్న ఆశలు ఆవిరి చేశాను. నేను త్రాగుడికి బానిస అయిపోయాను. ఇంక జీవితంలో నేను ఎందుకూ పనికి రాను" అని బాధ పడ్డాడు. అతని స్వరం దుఃఖంతో జీర పోయింది.
చేసే పని తప్పని తెలిసిన వ్యక్తిని మార్చడం అంత కష్టమేమీ కాదని నాకు బాగా తెలుసు. అందుకే నిరాశతో నిండిన అతని మాటలు నన్ను నిరుత్సాహ పరచలేదు.
"రాజీవ్! ఒకప్పుడు నేనూ నీలానే జీవితంలో ఫెయిల్యూర్. మీ నాన్న మాటలే నాకు కొత్త జీవితాన్ని ఇచ్చాయి. ఇప్పుడు నీదీ ఒకప్పటి నా పరిస్థితే! పోయినసారి నేను వచ్చినప్పుడు మీ నాన్న నీ గురించి నా దగ్గర ఎంతో
బాధ పడ్డాడు. నీవు మంచిగా మారిపోయి మీ నాన్న ఆత్మకు శాంతి కలిగించమని నేను నిన్ను కోరడం లేదు. నీలా నిరాశ, నిస్పృహలతో జీవితాలు నాశనం చేసుకుంటూ, స్వీయ జాలి అనే ఊబిలో కూరుకుపోతున్న వారికి నీవు కనువిప్పు కలిగించాలి. వారికి నీ జీవితం మేలుకొలుపు కావాలి.
నేను "వామన కౌన్సిలింగ్ సెంటర్" ప్రారంభిస్తున్నాను. అందుకు నీ తోడ్పాటు కోరుతున్నాను" అని చెప్పాను.
రాజీవ్ చాలా సేపు ఏం మాట్లాడలేదు. అతని మౌనం జ్ఞానోదయంకు బీజం అని తెలిసిన నేను మౌనం వహించాను.
కొంతసేపటికి రాజీవ్ "తప్పకుండా అంకుల్!" తన చేయి అందించాడు.
తొందరలోనే "వామన కౌన్సిలింగ్ సెంటర్" ప్రారంభం అయింది.

రాజీవ్ తొలి దినాల్లో త్రాగుడు బలహీనత నుంచి బయట పడటానికి, జీవితాన్ని ఆశావహంగా మార్చు కోవడానికి చాలా శ్రమించాడు. చివరికి విజయం సాధించాడు. పరిపూర్ణమైన మనిషిగా తనను తాను తీర్చి దిద్దుకున్నాడు. రాజీవ్ తో నేను చుట్టిన శ్రీకారం ఎంతో శక్తివంతమైనదై ఎందరికో కొత్త జీవితానికి దారి చూపింది. వారి జీవితాల్లో వెలుగులు నింపింది!!

భవిష్యత్ లో నా కలల సౌధం 'వామన కౌన్సిలింగ్ సెంటర్' గురించి నాకు బెంగ లేదు. ఎందుకంటే అది చూసుకోవడానికి రాజీవ్ ఉన్నాడు. బలహీనతను జయించిన మనిషిని మించిన శక్తిమంతుడు మరొకరు ఉండరు!!

★★★0★★★

## కథామంజరి దీపావళి కథల పోటీలో ప్రత్యేక ప్రశంస పొందిన కథ



# పశువులు మనుషులు

డా. ఎం. సుగుణారావు

జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వినయ్ కుమార్ గారి కార్యాలయం. వారి డిపార్ట్మెంట్ కు చెందిన ఫీల్డ్ సిబ్బంది కి శిక్షణా కార్యక్రమం..

'పాడి పరిశ్రమ అభివృద్ధి' అనే అంశంపై ఒక నిపుణుడు ఉపన్యాసం ఇస్తున్నాడు. ఇంతలో వారి అటెండరు మెల్లగా వచ్చి "సార్ మిమ్మల్ని కలవడానికి ఎవరో ఒకావిడ వచ్చారు. రెండు గంటల నుంచి ఎదురు చూస్తున్నారు. మీరు మీటింగ్ లో ఉన్నారని చెప్పాను." అన్నాడు..

"ఎవరావిడ పేరు కనుక్కున్నావా?" అన్నాడు వినయ్ కుమార్.

"గంగ అంట, శ్రీకాకుళం అప్పలనాయుడు గారమ్మాయంట. అదిగోండి ఆ కిటికీలో నుంచి కనబడుతోంది" అన్నాడు. వినయ్ కుమార్ తల తిప్పి చూసాడు తలొంచుకుని కూర్చుంది. వయసు ముప్పై దాటి ఉంటుందేమో... పొడుగ్గా జడ... గుండ్రటి ముఖం. తీర్చిదిద్దినట్టున్న కనుబొమలు. ఆ అమ్మాయిని పదేళ్ళ వయసు నుంచి చూస్తూనే వున్నాడు. ఆ అమ్మాయి పెళ్ళికి కూడా వెళ్ళాడు. అప్పలనాయుడు గారమ్మాయి అంటేనే ఆ అమ్మాయిని గుర్తు పట్టగలిగాడు..

"మనకు బాగా కావాల్సిన వాళ్ళు... ఆ అమ్మాయికి కాఫీ మంచి నీళ్ళు ఏర్పాటు చేయండి" అంటూ కుర్చీలో వెనక్కి వాలాడు ఇరవయ్యేళ్ల క్రిందటి జ్ఞాపకాలు అతని మదిలో మెదిలాయి.

అది తను వెటర్నరీ డాక్టర్ గా ఉద్యోగంలో చేరినప్పటి రోజులు శత్రు నిర్భేద్యం లాంటి ఒక పల్లెటూరు, చుట్టూ మూడు నదులు. వర్షాకాలంలో వాహనాలు ఆ ఊరికి రాలేవు. ఒక గంట బస్సు ప్రయాణం ఆ తర్వాత పడవలో ఒక నదిని దాటి ఆ తర్వాత, ఐదు కిలోమీటర్లు దాటితే ఆ ఊరు. ఇన్ని బాధలు పడలేక తాను ఆ ఊళ్ళో పశువుల ఆసుపత్రిలోనే మకాం ఏర్పరచుకున్నాడు.. విశాలమైన కాంపౌండ్ లోని పశువుల ఆసుపత్రిలో తనకు సౌకర్యంగానే ఉండేది.

ఒక రోజు తెల్లవారు ఝామున ఆస్పత్రి తలుపు తట్టారు ఎవరో... ఆ రోజు కరంటు లేదు. ఆ ఊళ్ళో కరెంట్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలీదు.. తలుపు తెరిచేసరికి నిర్ఘాంతపోయాడు. పదేళ్ళ అమ్మాయి. చేతిలో ఒక సంవత్సరం వయసున్న పిల్లాడు. గోల పెట్టి ఏడుస్తున్నాడు. తనకు అర్ధం కాలేదు. ఆ అమ్మాయి కంగారుగా అంది.

"వీడికి ఏమయిందో, ఎంత ఊరుకో పెట్టినా ఏడుపు ఆపడం లేదు" అంది.

ఆ క్షణంలో తనకు అనిపించింది. తను పశువుల డాక్టర్ అనీ, పశువులకి మాత్రమే వైద్యం చేస్తాడనీ ఆ పదేళ్ళ పసి మనసుకు అర్ధం కాదు. క్షణం సేపు ఆలోచించి... "ఆకలేస్తోందేమో, అమ్మకు పాలు పెట్టమని చెప్పు" అనేసాడు. ఆ ప్రశ్నకు వెంటనే బాణంలా దూసుకొచ్చిన జవాబు...

"అమ్మ లేదు డాక్టర్ గారూ"
అతడికి షాక్ గా అనిపించింది.
"మీ ఇల్లెక్కడ... పెద్దవాళ్ళు లేరా" అన్నాడు...
"లేదండీ నాన్న పనిమీద ఊరెళ్ళాడు. తోడుగా పడుకోడానికి మా మావయ్య కొడుకు వచ్చాడు. నిద్రపోతున్నాడు" అంది.
అతడికి ఏం చేయాలో తోచలేదు.
ఏదైనా ప్రథమ చికిత్స చేయాలి... అనుకుంటూ... "ఇంటికి వెళ్దాం" అన్నాడు.
"తమ్ముడికి ఇంజెక్షన్ చేయరా" అంది.
"చూద్దాం" అంటూ బైట కొచ్చి ఆస్పత్రి తాళం వేసాడు.
అమావాస్య రోజులు... మెల్లగా తెల్లవారడం మొదలైనా ఇంకా చీకటి తెరలు. పల్లెవాసులు ఇంకా నిద్దర్లు లేవలేదు. ఎక్కడో కుక్క మొరుగుతోంది. ఏడుస్తున్న తమ్ముడిని ఎత్తుకొని ముందుకు దృఢంగా అడుగులు వేస్తున్న ఆ పదేళ్ళ అమ్మాయిని చూసి ఆశ్చర్యపోయాడు వినయ్ కుమార్. ఫర్లాంగు దూరం నడిచి శివాలయం పక్కనున్న ఇంటి దగ్గర ఆగింది ఆ అమ్మాయి. చుట్టూ ఫెన్సింగ్. కర్రలతో చేసింది. లోపల శిథిలావస్థలో ఉన్న పాత పెంకుటిల్లు. పక్కనే పశువుల పాక. దాంట్లో కట్టేసిన రెండు గేదెలు, ఒక ఆవు.
"ఇంట్లో పాలు ఉన్నాయేమో చూడు. కాస్త పాలు వెచ్చ బెట్టి, బెల్లం కలిపి పట్టించు. ఆకలిగా ఉండి ఏడుస్తున్నాడేమో" అన్నాడు.
"వీడికి డబ్బా పాలు అమ్మ పోయినప్పటినుంచీ." అంది ఆ అమ్మాయి.
"సరే ఏదో ఒకటి పట్టించు ఇది ఆకలి ఏడుపు" అన్నాడు
ఆ అమ్మాయి పక్కనే ఉన్న నులక మంచం వాల్చి దానిమీద బొంత పరిచి "సార్ మీరు కూర్చోండి", అంటూ లోపలకు వెళ్ళింది. లోపల గదిలో కుర్రాడి గురక వినిపిస్తోంది. వెళ్ళిన ఆ అమ్మాయి ఒట్టి చేతులతో తిరిగొచ్చింది. ఇంతలో ఆ ఇంటి ముందు టాక్సీ వచ్చి ఆగింది. టాక్సీ డ్రైవర్ కాబోలు ఒక వ్యక్తి ని తీసుకుని వచ్చాడు. అతను నిలబడలేక పోతున్నాడు. శరీరం తూలి పోతోంది.. ఆ వ్యక్తి ఉప్పు, పప్పు, నూనె పాకెట్లు ఉన్న గోనె సంచిని అక్కడ కుదేసి వెళ్ళిపోతూ... "సార్ తమరు పశువుల డాక్టర్ గారా, తెలుసండి. గేదెకి బాగోలేదని వచ్చారా... ఈ అప్పలనాయుడు మా బావ, మంచోడండి. తాగేడని అపార్థం చేసుకోకండి. చెల్లి పోయినప్పటినుంచీ ఇలా అయ్యాడు... అయ్యా" అంటూ ఒక నమస్కారం చేసి వెళ్ళిపోయాడు.
వినయ్ కుమార్ కి పూర్తి గా అర్థం అయిపోయింది... ఆ ఇంటి పరిస్థితి.. ఇంటి యజమాని పరిస్థితి... పదేళ్ళ పిల్ల తమ్ముడిని ఎత్తుకొని ఒంటరిగా వైద్యం కోసం అర్థిస్తూ తన ముందు నిలబడిన విషయం వెనుక ఇంతటి విషాదం.
ఇంట్లోకి వెళ్లిన ఆ అమ్మాయి ఒట్టి చేతులతో తిరిగొచ్చింది..
తండ్రిని చూస్తూ "నాన్నె తమ్ముడి పాలడబ్బా ఐపోయింది. తెచ్చావా" అంటూ తండ్రిని తట్టిలేపింది. అతగాడు స్పృహలో ఉంటేే కదా......
అక్కడ ఉన్న గోనె సంచిలోని సామాను వెతికి నిస్పృహగా 'అయ్యో పాలడబ్బా లేదు..' అంటూ తమ్ముడి వంక చూసింది. ఏడ్చి ఏడ్చి వాడు నిద్రలోకి జారుకున్నాడు.
అప్పుడు జరిగిన సంఘటన జీవితంలో మరచి పోలేడు. ఆ పదేళ్ళ ఆ అమ్మాయి రంగంలోకి దిగింది. పక్కన పశువుల పాకలో ఉన్న ఆవుకి గడ్డి వేసింది. పక్కనే కట్టిన దూడను ఆవు దగ్గర వదిలింది. అది కాసేపు పాలు తాగిన తర్వాత తానే గిన్నె తీసుకొని పాలు పితకడం మొదలెట్టింది.

ఆ తర్వాత పాలు కాచి తమ్ముడిని లేపి పాలు తాగించింది...ఆ అమ్మాయి అందరి అమ్మలకు ప్రతిరూపం అయిన పెద్దమ్మలా కనిపించింది వినయ్ కుమార్ కి

"సార్... ఆయన ఉపన్యాసం ఐపోయింది. మీరు మాట్లాడాలి"
తన పియ్యే మాటలతో ఈ లోకంలోకి వచ్చాడు వినయ్ కుమార్. క్లుప్తంగా తన ఉపన్యాసం ముగించాడు.. తొందరగా ఆ అమ్మాయిని కలవాలని ఉంది. ఎందుకొచ్చిందో పాపం తనను వెతుక్కుంటూ. ఆ రోజు ఆమె అమ్మలా దర్శనం ఇచ్చిన రోజునించీ ఆమెను తాను మర్చిపోలేక పోయాడు. ఆ తర్వాత వారి పశువులకి బాగోలేదంటే చూడడానికి వెళ్ళాడు. అలా ఆ ఊళ్ళో ఉన్నంత కాలం ఆ చిన్నమ్మాయి తనను వదిలిపెట్టలేదు... తను ఆ ఊరు నుంచి బదిలీ అయి వెళ్ళునప్పుడు ఆమె తండ్రి అప్పలనాయుడు ఫోన్ నెంబర్ తీసుకున్నాడు. ఆమె జీవితంలో జరిగిన శుభకార్యాలకు తాను హాజరయ్యాడు.
పదేళ్ళ క్రితం ఆమె బావతో పెళ్ళయింది.. తను ఇంజనీరింగ్ చదువుతున్నాడు అప్పుడు... మళ్ళీ ఇప్పుడు ఇక్కడ ఆమె.

వినయ్ కుమార్ మీటింగ్ పూర్తయి న తర్వాత తన కేబిన్ లోకి వెళ్ళాడు.
"అప్పలనాయుడు గారి అమ్మాయి ని పిలవండి" అన్నాడు అటెండర్ తో... వెంటనే ఆ అమ్మాయి వచ్చింది. చాలా కాలం తర్వాత చూసి న సంతోషం ఆమె ముఖంలో. తనూ అంతే...
"చెప్పు తల్లీ ఎలా ఉన్నారు..." అన్నాడు.
"కాస్త బాగోలేదు సార్... మా నాన్నగారి సంగతి తెలుసు కదా తాగుడుతో ఆరోగ్యం పూర్తిగా పాడైపోయింది. ఇపుడు మానేసాడు. తప్పదు కదా... మా ఆయనకు హైదరాబాద్ లో సాఫ్ట్వేర్ కంపెనీలో ఉద్యోగం వచ్చింది.. రెండేళ్ళు బాగానే ఉంది. ఈ మధ్యనే ఏదో బెంచీ ఎక్కించారని ఉద్యోగంలోంచి తీసేసారు. మళ్ళీ పిలుస్తారట. అది ఎప్పుడో తెలీదు. ఆయన డల్ అయిపోయారు. లోన్ పెట్టి కారు, రెండు బెడ్ రూముల ఇల్లు తీసుకున్నాం. నేను పెద్దగా చదువుకోలేదు. నాకు తెలిసిందల్లా పశువుల పెంపకం. ఐతే దేశీయ పశువులతో ఒక డైరీ ఫారం పెడదామని మీ సలహాలు, సూచనలు కోసం వచ్చాను" అంది.
వినయ్ కుమార్ ఆ అమ్మాయి మాటలకు ఆనందపడ్డాడు. "అలాగే తల్లి నీది మంచి నిర్ణయం. నీకేం సహాయం కావాలి అన్నా నేను ఉన్నాను... " అంటూ చెప్పడం మొదలు పెట్టాడు.
"నాటు అంటే దేశ జాతి ఆవు పాల ఉత్పత్తులు ఉత్తమమైనవి అన్న విషయం ఈమధ్య పాపులర్ అయింది. ఈ పాల ఉత్పత్తులను విదేశాల్లో అమృతంగా భావిస్తున్నారు. ఇక్కడ ఇంకో విషయం. గంగిగోవు ఎలా ఉంటుందో తెలుసా.. విశాలమైన గంగడోలు, మంచి మోపురం, సాధు స్వభావం, మనిషిని గుర్తు పట్టే తత్వం. ఈ లక్షణాలు వంద శాతం ఉంటే గంగిగోవు.. 50 నుంచి 60 శాతం ఉంటే గోవు... అసలు ఏమి లేకపోతే "ఆవు" అన్నాడు.
ఆశ్చర్యంగా చూసింది ఆమె. వినయ్ కుమార్ చెప్పడం కొనసాగించాడు. "పాడి పరిశ్రమ లాభసాటి కావాలంటే పాల దిగుబడితో పాటు పాల నాణ్యత పెరగాలి. ఆ క్రమంలో ప్రొడక్షన్ కాస్ట్ అంటే మనం పెట్టే ఖర్చు తగ్గించుకోవాలి. అందుకోసం పశుగ్రాసం పెంచాలి. సూపర్ నేపియర్.. బాజ్రా, అలసంద, లాంటివి పెంచుకోవచ్చు. 60 శాతం పచ్చి మేత, 40 శాతం ఎండుగడ్డి ఉండేలా చూసుకోవాలి. సజ్జలు, పచ్చజొన్న, వేరుశనగ దాణాలో ఉపయోగించాలి."
ఇలా చాలా విషయాలు చెప్పాడు... ఆమె శ్రద్ధ గా వింది. కొన్ని పాయింట్ లు రాసుకుంది. అతడికి నమస్కారం చేసి అక్కడ నుంచి కదిలింది...

అయితే గంగ కొన్ని విషయాలు తనతో చెప్పకుండా దాచిందని వినయ్ కుమార్ కి రెండు రోజుల తర్వాత తెలిసింది. తన బంధువు డిఎడిక్షన్ సెంటర్ లో తాగుడు మానడానికి చికిత్స తీసుకుంటుంటే చూడ్డానికి వెళ్ళాడు. అక్కడ కనిపించాడు అప్పలనాయుడు, గంగ తండ్రిగారు.

"ఏంటి ఇక్కడ మీరు?" అంటే చెప్పాడు.

"ఏం చెప్పాలి సర్... నా కూతురుకి చిన్నప్పటి నుండి కష్టాలే. ఈ తాగుబోతు తండ్రితో అవి మొదలైనాయి. ఇప్పుడు భర్తతో. నా చెల్లెలి కొడుకని పెళ్లి చేశాను. మంచోడే కానీ తాగుడు అలవాటు అయ్యింది. ఇప్పుడు ఉద్యోగం పోవడంతో అది మరీ ఎక్కువ అయ్యింది. నా కూతుర్ని తిట్టడం, కొట్టడం. తాగినోడికి తెలివి ఏముంటుంది. అలాగే భరిస్తోంది. ఇక లాభం లేదని నయానో భయానో చెప్పి ఈ సెంటర్ కి తీసుకొచ్చాము" అన్నాడు.

అక్కడే ఒక వార్డులో దూరంగా తన భర్తకు బత్తాయి రసం తాగిస్తున్న గంగ కనిపించింది. బాగా పెరిగిన గడ్డంతో నీరసంగా వున్న యువకుడు, పక్కనే రెండేళ్ల బాబు.

"మై గాడ్... ఈ అమ్మాయి కష్టాల కోసమే పుట్టింది" అని అనుకున్నాడు. ఆ స్థితిలో వాళ్ళను పలకరించడం ఇష్టం లేక ఆ సెంటర్ నుండి బయటకు వచ్చేసాడు.

★★★

సరిగ్గా ఏడు సంవత్సరాల తర్వాత..

అది జూన్ ఒకటో తారీఖు... ప్రపంచ పాల దినోత్సవం. దేశ వ్యాప్తంగా స్వల్ప కాలంలో తన గంగ డైరీ ద్వారా ప్రముఖ పాడి పరిశ్రమవేత్తగా ఎదిగిన శ్రీమతి గంగగారికి ఘన సన్మానం.

ఆ సమావేశంలో ముఖ్య అతిథి పశుసంవర్ధక శాఖా మంత్రి... ఇంకా ఆమెకు మార్గదర్శిగా నిలిచిన పశుసంవర్ధక సంచాలకులు వినయ్ కుమార్ ఆసీనులయ్యారు. పశుసంవర్ధక శాఖ మంత్రి ఉపన్యాసం మొదలయింది.

"మన భారతదేశం పాల ఉత్పత్తిలో ప్రథమస్థానంలో ఉంది. దేశీ పశువుల పెంపకంతో ఒక గొప్ప విజయాన్ని అందుకున్న గంగగారిని అభినందిస్తూ, వారు ఈ రంగంలో మరిన్ని విజయాలు పొందాలని ఆశీర్వదిస్తున్నాను" అంటూ ఉపన్యాసం ముగించారు.

వినయ్ కుమార్ చెప్పడం మొదలు పెట్టాడు..

"పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది. గంగ పదో ఏటనే పాలు పితకడం ప్రారంభించింది. తన భర్త ఉద్యోగం పోయిన పరిస్థితిలో తన చేయగలిగిన పని పాడి పశువుల పెంపకం... దానితో తన కుటుంబాన్ని నిలబెట్టడమే కాదు. ఎంతో మంది పాడిరైతులకు దారి చూపుతూ గంగ డైరీ ఒక కార్పొరేట్ డైరీ గా దేశవాళీ పశువులతో అభివృద్ధి చేయడం ఒక అపూర్వ విజయం. ఆమెకు అభినందనలు...ఐతే ఆమె విజయం వెనుక విశేషాలు ఆమె నోటి నుంచి వినాలి" అంటూ చెప్పడం ముగించాడు వినయ్ కుమార్

గంగ అందరి కీ నమస్కారం చేసింది.. చెప్పడం మొదలు పెట్టింది..

"నా ఈ పురోగతికి కారణమైన నా మార్గదర్శి డాక్టర్ వినయ్ కుమార్ పశుసంవర్ధక సంచాలకుల వారికి సభాముఖంగా ధన్యవాదాలు. ఇక్కడ ఇంత మంది విజ్ఞుల ముందు నేను శాస్త్రీయ విషయాలు చర్చించను. అందరికీ తెలిసిందే నేను చేసాను. యద్భావం తద్భవతి... మనం ఏమి ఇస్తామో అదే దక్కుతుంది. నేను పశువులను ప్రేమించాను ఒక అమ్మలా అవి నాకు తమ ప్రేమను పాల రూపంలో అందించాయి. నేను రోజూ నాలుగైదు గంటలు పశువులతో మమేకం అయ్యే దానిని. ప్రతీ ఆవుకు, గేదెకు ఒక పేరు పెట్టి మృదువుగా పిలిచే దానిని. అలా పిలుస్తూ ఆవుల గంగడోలు, గేదెలు

వీపు భాగం ప్రేమగా నిమురుతూ వాటిని మచ్చిక చేసుకునేదాన్ని. అలా వాటితో స్నేహంగా ఉంటే వత్తిడికి గురి కాకుండా ఉంటే ఉత్సాహంగా అధికంగా పాలిస్తాయి. పశువులను కొట్టకూడదు. ముల్లుగర్రతో పొడవకూడదు... వాటికి అలాంటి ప్రేమ ముఖ్యం... అవి మన బిడ్డలు... మన పిల్లల్ని ఎంతగా ప్రేమిస్తామో వాటిని అలాగే ప్రేమించాలి. ప్రేమతో ఈ ప్రపంచంలో సాధించలేనిది ఏదీ లేదు..'' ఆమె చెప్పడం ముగించింది.

అంతవరకు ప్రేక్షకుల్లో కూర్చుని తనవంకే చూసి చేతులు జోడిస్తున్న వ్యక్తిని చూసి వినయ్ కుమార్ ఆశ్చర్యపోయాడు. అతను గంగ భర్త. సుబ్బరంగా ఆరోగ్యంగా కనిపించాడు. అతని పక్కనే తొమ్మిది, పది సంవత్సరాల వయసున్న అబ్బాయి.

వినయ్ కుమార్ కి ఆనందం కలిగింది. మారిన గంగ భర్తను చూసి.

-అక్కగా, కూతురిగా, భార్యగా వీటితోపాటు పశువుల సంరక్షకురాలిగా అన్ని పాత్రల్లోనూ గంగలోని అమ్మే కనిపించింది అతనికి. పశువులకు, మనుషులకు ఈమె ఇచ్చే ట్రీట్మెంట్ ఒకటే. అదే విశ్వ ప్రేమ అనుకుంటూ గంగ వంక ఆప్యాయంగా చూసాడు వినయ్ కుమార్.

★★★0★★★



# పూర్వసువాసి దర్శనం

దత్త శర్మ పాణ్యం

''అకుబేరపురీ విలోకనం
అధరాసూనుకరం...
అథ తత్పరిహారహేతవే....
పంతులుగారు గుళ్లో పురాణ ప్రవచనం చేస్తున్నారు. ''అత్యంత చమత్కారమైన శ్లోకం ఇది. సంస్కృత భాషలోని గొప్పతనమే అది! కుబేరపురి అంటే అలకాపురి. అకుబేర అంటే అనలక, అంటే కేశములు లేనిది, అంటే విధవ! ఆమెను చూడటం అధరాసూనుకరం, అనగా అమంగళము కలిగిస్తుందన్నమాట దానికి పరిహారమేమంటే...''

పురాణం వింటూన్న సువాసినులూ, పూర్వసువాసినులూ పంతులుగారి పాండిత్యానికి అచ్చెరువొందుతున్నారు. అంత అంతరార్థమున్న శ్లోకాన్ని తాను వివరింగలుగుతున్నందుకు పంతులుగారి కళ్లు గర్వంగా వెలుగుతున్నాయి.

అత్తయ్యతో బాటు గుడికొచ్చిన అపర్ణకు మాత్రం ఆ మాటలు రుచించలేదసలు. విధవను చూడటం అంత అమంగళకరమా? ఆ విషయాన్ని అంత భాషా వైదుష్యంతో చెప్పడం, శ్రోతలు కూడ మైమరచి వినడం ఆమెకు వింతగా అనిపించింది.

ఇంటికి వస్తూ, అత్తయ్యతో యిలా అంది అపర్ణ. ''అత్తయ్యా, భర్త చనిపోయిన స్త్రీని చూడటం అంత అశుభమా? ఆయన చెప్పింది నాకసలు నచ్చలేదు!''

నిర్ఘాంతపోయి చూసింది వెంకటలక్ష్మి .. అంటే అత్తగారు.

''అదేమిటే, అలా అనేశావు? ఆడదానికి ఆ పసుపు కుంకుమలే సంపద! అవి పోయింతర్వాత ఆమె జీవచ్ఛవమే! అందుకే పెద్దలు శాస్త్రాల్లో అంత బాగా చెప్పారు! నీవు చిన్నపిల్లవు, ఇంకా ఇలాంటి ''గొప్ప'' విషయాలు నీకు తెలియవు. పద పద! లేటయితే మీ మావయ్య అపర దుర్వాసుడౌతాడు. టయానికి ఆయనకు టిఫిన్ పెట్టకపోతే ఇంకేమయినా ఉందా?'' అంటూ, మెళ్లోని మంగళసూత్రాలను కళ్లకద్దుకుంటూ వేగంగా అడుగులు వేసిందామె.

వెంకటలక్ష్మి మగడు కో ఆపరేటివ్ సబ్ రిజిస్ట్రారుగా రిటైరైనాడు. ఆయన పేరు అచ్చుతరావు. వాళ్లకు ఒక్కడే కొడుకు, రఘుపతి. ఉద్యోగాలు చేసే పిల్లలు వినయంగా ఉండరని, ఇంటరుతో ఆపేసిన బంధువుల అమ్మాయి అపర్ణను కోడలిగా తెచ్చుకున్నారు. ఆ అమ్మాయి వాళ్లది దిగువ మధ్య తరగతి కుటుంబం. వీళ్లకు తగినట్లే అణకువగానే ఉంటుంది. చాలా కాలం క్రితమే వైదేహినగర్‌లో ఇండిపెండెంట్ ఇల్లు కట్టుకున్నారు. రఘుపతి యథాప్రకారం బిటెక్ చదివి, హైటెక్ సిటీలోని ఒక ఐటి కంపెనీలో పని చేస్తాడు. యల్.బి. నగర్ మెట్రోస్టేషన్ వద్ద బైక్ పెట్టుకుని, మెట్రోలో రోజూ ఆఫీసుకు వెళ్లొస్తాడు.

రాత్రి మగనితో ఈ ప్రస్తావన తెచ్చింది అపర్ణ. రఘుపతి ఇలా అన్నాడు. ''అపూ, కొన్ని శాస్త్రాలకు అర్థం పర్థం ఉండదు. చూస్తేనే పాపం చుట్టుకునేంత నేరం ఏం చేశారు వాళ్లు, పాపం! నీవు బాధపడడంలో అర్థముంది. కానీ మనం ప్రశాంతంగా ఉండాలంటే మాత్రం మా అమ్మతో నీవు ఏకీభవించకపోయినా, అలా నటిస్తే మంచిదని నా అభిప్రాయం.'' అపర్ణ నవ్వింది! ''అర్థమయిందిలెండి'' అన్నది.

తర్వాత కొన్ని రోజులకే, ఒక దుర్వార్త ! అపర్ణ మేనత్త భర్త చనిపోయాడు. ఆమెతో చిన్నప్పటినుండీ అనుబంధం ఎక్కువ అపర్ణకు. చిన్నప్పుడు వాళ్లింట్లోనే కొంత కాలం పెరిగింది కూడ. మేనత్త వాళ్లుండేది నంద్యాలలో. వెంటనే బయలుదేరి అత్తను పరామర్శించడానికి వీలు లేకపోయింది. ఎందుకుంటే సరిగ్గా అప్పుడే వెంకటలక్ష్మి యూరినల్ ఇన్ఫెక్షన్‌తో హాస్పిటల్‌లో చేరింది. తన నిస్సహాయతను తెలియజేస్తూ, అత్తకు ఫోన్ చేసింది అపర్ణ. అప్పటికి అపర కర్మలన్నీ అయిపోయాయి. మేనత్త ఏడుస్తూ ఇలా అంది ఫోన్‌లో.
''అమ్మలూ! మీ మామయ్య నాకన్యాయం చేసి వెళ్లిపోయాడే! చిటికెడు కుంకుమ నా నుదుట పెట్టుకోలేని దౌర్భాగ్యం దాపురించింది నాకు! మీ బావ చూస్తే ఎక్కడో గుర్‌గావ్ లో ఉన్నాడు. వచ్చి తండ్రికి అన్నీ నిర్వర్తించి పోయాడు. తమతో వచ్చేయమని నా కోడలు కూడ బ్రతిమిలాడింది. కానీ, ఆయనతో మెసిలిన ఈ ఇల్లు ఊరు వదిలిపోవాలని లేదే! ఆయన పెన్షను నాకు వస్తుందట, ఓపిక ఉన్నన్నాళ్లు ఇక్కడే గడిపేస్తా!''
''అత్తా, మా అత్తయ్య హాస్పిటల్ నుండి డిశ్చార్జి అవగానే, వచ్చి నిన్ను చూసి పోతా'' అన్నది అపర్ణ.
''వద్దు వద్దు నెలదాటితే నన్ను చూడకూడదు. మూడో నెలలో వద్దువుగాని'' అన్నది మేనత్త. గొంతు తగ్గించి ఇలా చెప్పింది.
''నాకు ఎంతో బాధ కలిగించిందేమంటే మనవాళ్లే నన్ను ''ముండమోయించే క్రతువు'' చేయడానికి తహతహలాడారు. అదంతా వద్దు అని నేను మొత్తుకున్నా వినలేదు. ఎవరో ఎందుకు మీ అమ్మే! గాజులు పగల గొట్టడం, బొట్టు చెరిపేయడం, తాళి తీసేయడం, ఎంత తంతు జరిపారని! నా అంతట నేను అవన్నీ మెల్లగా తీసేద్దామనుకున్నాను. మా చెల్లెలయితే విశ్వరూపం చూపించిందనుకో! అందరూ ముత్తయిదువలే వాళ్లలో, నా భర్త చనిపోయిన దానికన్న వాళ్ల భర్తలు బతికే ఉన్నారనే సంతోషం నాకు ఎక్కువగా కనపడింది! ఇలా ఆలోచించడం తప్పేనేమో? నీవు నాకు కూతురిలాంటి దానివని చెబుతున్నాను. మనసులో పెట్టుకోవే''
భారమైన మనస్సుతో ఫోన్ పెట్టేసింది అపర్ణ.
మూడవ నెలలో అత్తను చూసి వద్దామని అడిగింది భర్తను. వీకెండ్‌లో నంద్యాలకు వెళ్లి వద్దామంది. వెంకటలక్ష్మి భృకుటి ముడిపడింది. ''మూడో నెలైనా మహాలయ పక్షాల్లో ఎవరైనా విధవను చూస్తారటే, తర్వాత చూద్దాంలే'' అన్నది.
రఘుపతి నవ్వుతూ తల్లితో అన్నాడు. ''మహాలయ పక్షాలంటే పితరులకు తర్పణాలవీ వదిలే కాలమే కదమ్మా. శుభకార్యాలకు పనికిరావుగాని ఇలాంటి వాటికేం?''
''వితండవాదం చెయ్యకురా రఘూ! ఇవన్నీ ఆడవాళ్ల విషయాలు నీకేం తెలుసు?'' అని దబాయించింది కొడుకును.
ఇలా మరికొన్ని రోజులు గడిచాయి. ఏవో అవాంతరాల వల్ల ఐదో నెలలో కుదరలేదు. ఈలోపు కరోనా విరుచుకుపడిరది. లాక్‌డౌన్‌లు ప్రయాణాలు బంద్.
మేనత్తకు కరోనా సోకిందని అపర్ణ వాళ్లమ్మ ఫోన్ చేసింది. ఒక్కత్తే ఉంది కాబట్టి సెల్ఫ్ క్వారంటైన్‌లో ఉందనీ, మందులు వాడుతూందనీ, ఫరవాలేదని చెప్పిందామె.
''మీ అత్త మనింటి వస్త్రం తీసుకుపోవటానికే కుదరటం లేదు. అదేదో అయిపోతే మనకూ మంచిది. అయినా తనకు మాలిన ధర్మమనీ, పక్కింటి వాళ్లకు కరోనా వస్తే, వాళ్లకు వంట వండి ఇచ్చి వచ్చేదట! అలాగే అంటుకున్నట్లుంది!

అయినా, మీ అత్తకు ఎక్కడలేని వ్యాపకాలు! మీ మామ చచ్చిపోయింతర్వాత, మరీ ఎక్కువవయ్యాయి! వాళ్ల వీధిలోని శివాలయం చుట్టూ ఆవరణంతా శుభ్రం చేస్తుందట. అనాధాశ్రమంలో పిల్లలకు వడ్డించడం లాంటివి చేస్తుందట. పోగాలము దాపురించినవారు కనరు, వినరు అని ఊరికే అన్నారా...''
తల్లి ధోరణి విసుగును, అసహ్యాన్ని కలిగించింది అపర్ణకు. ఎంత ఉదాత్తంగా బ్రతకుతూంది అత్త! అమ్మకే అది అసహజంగా కనపడుతూంది.
అత్తకు ఫోన్ చేసింది.
''అమ్మలూ, ఎలా ఉన్నావే'' అంది అత్త.
''బాగున్నా అత్తా నీకే కరోనా వచ్చిందని ....'' దుఃఖంతో కంఠం వణికింది అపర్ణకు.
''అవునే తగ్గిందిలే. కానీ చాలా నీసరంగా ఉంటోందే తల్లీ! పాపం పక్కింటివాళ్లు మనవాళ్లు కాకపోయినా తిండీ తిప్పలూ ఎంత జాగ్రత్తగా చూసుకున్నారనుకున్నావ్! ఎందుకో ఈ మధ్య షుగర్ కూడ బాగా పెరిగింది. మీ ఆయన బాగున్నాడా? మాకు మనవడినో, మనవరాలినో ఇచ్చేదుందా లేదా? ఈ మధ్య నాకెందుకో నిన్ను చూడాలని మరీ మరీ అనిపిస్తూందే. ఈ కరోనా మానవ సంబంధాలనే దెబ్బతీస్తుందేమో! మీ మామ చనిపోయినప్పుడు వచ్చినవాడు, మీ బావ గుర్గాం నుంచి ఇంతవరకు రాలేదు. ఏం చేస్తాడు పాపం! వాడిని చూడాలని ప్రాణం కొట్టుకుపోతూంది.''
అత్త మాటలకు దుఃఖం వచ్చింది అపర్ణకు. ఫోన్‌లోనే ఏడ్చేసింది.
''పిచ్చి తల్లీ! ఏడుస్తావెందేకే? ఇప్పుడేమయిందనీ!'' అంటూ ఓదార్చిందత్త.

కొంత కాలానికి ప్రొద్దుటూరులో రఘుపతి కజిన్ పెళ్లి జరిగింది. హైదరాబాద్ నుండి ప్రొద్దుటూరుకు బస్‌లో అయితే నంద్యాల మీదే వెళ్లాలి. లాక్‌డౌన్‌లు ఎత్తేసి, కోవిడ్ నిబంధనలతో అంతరాష్ట్ర ప్రయాణాలు అనుమతిస్తున్నారు. వెళ్లేటప్పుడు ''రాయలసీమ ఎక్స్‌ప్రెస్''లో వెళ్లారు. తిరుగు ప్రయాణంలో రిజర్వేషన్ దొరకలేదు. జంకుతూ అత్తయ్యనడిగింది అపర్ణ.
''అత్తయ్యా, దారిలో మా అత్తను చూసి వెళదామా?''
లెక్కలు వేసింది వెంకటలక్ష్మి ''మీ మామ చనిపోయింది... చైత్రంలో! అంటే ఇది ఎనిమిదో నెల విధవను చూడటం నిషిద్ధం. పోనీలే అనుకున్నా ఈ రోజు మంగళవారం. అయినా కరోనా పేషంటును పనిగట్టుకుని చూడడం అవసరమా? ఏం అక్కర్లేదు!'' అంటూ తేల్చి పారేసింది.
కర్నూలు వరకు ట్యాక్సీ మాట్లాడుకున్నారు. అక్కడి నుండి ''తుంగభద్ర'' అందుకుంటారు. కారు ఆళ్లగడ్డ దాటి నంద్యాల సమీపిస్తూంటే, అపర్ణకు దుఃఖం ఆగలేదు. నూనేపల్లి దాటి, రైల్వేస్టేషన్ తర్వాత బొమ్మల సత్రం దగ్గర అడిగింది అపర్ణ.
''అత్తయ్యా! ఒక్క పావుగంట ! మీరు రోడ్ ప్రక్కన ఆపుకుంటే నేనొక్కదాన్ని ఆటోలో వెళ్లి మా అత్తను చూసొస్తాను ప్లీజ్ అత్తయ్యా! ఏమండీ! మీరయినా చెప్పండీ'' అన్నది భర్తతో.
తల్లివైపు చూశాడు తనయుడు. భార్య మేనత్త కోసం తల్లితో వైరం తెచ్చుకోడం ఇష్టం లేదతనికి.
వెంకటలక్ష్మి స్వరం పెంచింది ''చెబితే అర్థం కాదేమే నీకు? ఎనిమిదో నెలలో ఎలా చూద్దామనుకుంటున్నావ్? బుద్ధుందా అసలు! అలా చేస్తే అరిష్టం! కొంపకు చేటు తెచ్చే పనులు చేయకు!'' అన్నది తీవ్రంగా.
''పోనీ అత్తనే యిక్కడికి రమ్మంటే?'' అన్నది అపర్ణ భయం భయంగా.
''ఏరాయయితేనేం బుర్ర పగులగొట్టుకోడానికి!'' అన్నది వెంకటలక్ష్మి ఈసడిరపుగా ఇక ఊరుకోమన్నట్లు సైగ చేశాడు రఘుపతి. సంభాషణ అంతా వింటున్న టాక్సీ డ్రైవర్ ఇలా అన్నాడు.

“పెద్దమ్మా! ఆయమ్మ అంతగా అడగతా ఉంటే అట్ల గసురుతూ ఉండావేందమ్మా? శౌచ్చం మన్చికంటె ఎక్కువా ఏంది? పంపించు తల్లీ ! పాపం!”
మామయ్యకు కోపం వచ్చిందామాటలకు
“ఏమయ్యా! నీ పని నీవు చూసుకోక, మా విషయాలలో ఎందుకు తలదూరుస్తావు? మాకు కొన్ని సంప్రదాయాలుంటాయి నీకెందుకు?”
డ్రైవరు తనలో తాను గొణగుకున్నాడు.
“దీనెమ్మ సంప్రదాయం! దీనికి అగ్గెట్ట!”
నంద్యాల దాటిపోతూంటే వెక్కి వెక్కి ఏడ్చింది అపర్ణ. అత్తయ్య మళ్లీ గదిమింది.
“శుభమా అని పెళ్లికి బోయి వస్తూంటే ఈ ఏడుపేమిటి ఎవరో పోయినట్లు! చాల్చాల్లే ఆపు!”
రఘుపతి అనునయంగా భార్య భుజం మీద చేయివేసి నొక్కాడు.

★★★

కరోనా తగ్గుముఖం పట్టింది. నిత్య జీవితం పునరుద్ధరించబడింది. రఘుపతిని కంపెనీ వాళ్లు మూడు నెలల ట్రైనింగ్ కోసం అమెరికాకు పంపారు.
అపర్ణ ముభావంగా మారిపోయింది. కానీ అత్తా, మామలకు సేవ చేయడంలో ఏ లోటూ చేయడం లేదు. ఆ రోజ యిల్లు చేరుకున్నాక రాత్రి మేనత్తకు ఫోన్ చేసి ఏడ్చింది అపర్ణ.
“అత్తా, నంద్యాల ఊర్లో నుండి వస్తూ, నిన్ను చూడటానికి రాలేకపోయాను. నన్ను క్షమించు అత్తా. మా అత్తయ్య ససేమిరా వద్దంది, వాళ్లను బొమ్మల సత్రం దగ్గర ఉండమని, నేనొక్కదాన్నే నిన్ను చూసివస్తానని, అలా కుదరకపోతే నిన్నయినా రమ్మందామని ఎంత బ్రతిమిలాడినా ...”
“అమ్మలూ! ఆమె దృక్పథం ఆమెది. వారింటి కోడలివి. నీవు వాళ్లను కాదని ఏం చేస్తావు? నీ సంసారం జాగ్రత్త తల్లీ! వద్దువుగానిలే, నేనెక్కడికి పోతాను?”

తర్వాత కొంత కాలానికి అత్తకు ఫోన్ చేస్తే ఎత్తలేదు. అలా రెండు మూడుసార్లు జరిగింతర్వాత అపర్ణకు ఆందోళన ఎక్కువయింది మరుసటిరోజు ఎవరో ఎత్తారు.
“హలో! ఎవ్వురమ్మా”
“నా పేరు అపర్ణండీ. హైదరాబాద్ నుండి మాట్లాడుతున్నాను. నేను భాగ్యమ్మగారి మేనకోడల్ని. మా అత్త రెండ్రోజుల్నుండి ఫోనెత్తడం లేదు. ఆమె బాగుంది కదండీ!"
“అయ్యో నీవా అమ్మా! మీ యత్త రోజూ నిన్నే కలవరిచ్చాంటాంది. మీ మామ సచ్చిపాయ ఇన్ని దినాలైనా నివ్వు మీ యత్తను సూడనీకైనా రాకపోతివి!” అన్నాడాయన అటువైపునుంచి “మేం మా బాగ్గెమ్మ యింటి పక్కనే ఉంటుండ్లా. ఆయమ్మకు శుగరు ఎక్కువైపాయ, ఏం బాగలేకుండె. సహదేవుని ఆస్పిటిల్లో జేలిస్తిమి. ఆయమ్మ కొడుక్కు గూడ్క ఫోన్ జేపిచ్చినాలే. ఒగసారి వచ్చి చూసిపోమే”

అప్పుడు రాత్రి 9 గం॥ అవుతూంది. వెళ్లి అత్తను లేపింది. విషయం చెప్పింది. ఆవులిస్తూ వెంకటలక్ష్మి అన్నది.
“అయినా ఇది పదోనెల. పదకొండో నెలలో వెళుదువుగాని, వాడు గూడ లేడు. ఒక్కదానివి వెలా వెళతావు? పైగా రేపు శుక్రవారం!” అంటూ అటు తిరిగి పడుకుందామె.
అపర్ణ తన గదికి వచ్చింది. ఒక నిశ్చయానికి వచ్చి భర్తకు వాట్సాప్ కాల్ చేసింది. విషయం విని యిలా అన్నాడతడు.

"అప్పూ! జాగ్రత్తగా విను! ఇలాంటప్పుడు కూడ వెళ్లి చూడకపోతే ఇంకెందుకు? నీకు మీ అత్తతో ఉన్న బంధం నాకు తెలుసు. మా అమ్మ అంటావా, కరడు కట్టి సాంప్రదాయవాది. ఈ రాత్రి వద్దుగాని, ఉదయం ఐదు గంటలకల్లా బి.యన్ రెడ్డి జంక్షన్‌కు వెళ్లు. అక్కడ ఇబ్రహీంపట్నం నుండి ఎం.జి.బి.ఎస్‌కు వెళ్లే 277వ నం. బస్ ఎక్కు. మాగ్జిమమ్ ఆరున్నర ఏడు లోపు నీకు ఏదో ఒక బస్ దొరుకుతుంది. కడప, చిత్తూరు, తిరుపతి వెళ్లే ఎక్స్‌ప్రెస్‌లన్నీ నంద్యాలలో ఆగుతాయి. అవి లేకపోయినా కర్నూలుకు నంబరాఫ్ బసెస్ ఉంటాయి. కంగారుపడకు. మీ అత్తకేం కాదు. వెళ్లి చూసి వారం పదిరోజులుండి రా. అమ్మవాళ్లు ఆరు తర్వాత గాని లేవరు. ముందు తలుపు దగ్గరగా వేసి వెళ్లిపో. ఎ.టి.ఎం కార్డు మర్చిపోకు. క్యాష్ ఒక రెండు వేలు దగ్గర పెట్టుకో! బిబ్రేవ్ అండ్ ప్రొసీడ్! తర్వాత అమ్మను నేను నచ్చ చెబుతాలే!" భర్త మాటలతో కొండంత ధైర్యం వచ్చింది అపర్ణకు.

రాత్రంతా నిద్ర పట్టలేదు. మూడున్నరకే స్నానం చేసి, దేవుడికి దీపారాధన చేసి, హారతిచ్చింది. అత్తకు మెలకువ వస్తుందని గంట వాయించలేదు! అత్తకు బాగవ్వాలని దేవుడికి మొక్కుకుంది! ఒక బ్యాగ్‌లో నాలుగు చీరలు, అన్నీ సర్దుకుంది. వ్యానిటీ బ్యాగులో ఎటిఎం కార్డు, కొంత క్యాష్ పెట్టుకుంది. ఎందుకయినా మంచిదని బంగారం చెయిను, గాజులు తీసి బీరువాలో దాచింది.

సరిగ్గా ఐదు గంటలకు ఇంటినుండి బయటపడింది అపర్ణ. మెడ్‌ప్లస్ వద్ద ఆటో ఎక్కి బి.ఎన్ రెడ్డి దగ్గర దిగింది. పదే పది నిమిషాలలో 277 మెట్రో ఎక్స్‌ప్రెస్ వచ్చింది. ఖాళీగా ఉంది. ఎంజిబిఎస్‌కు టికెట్ తీసుకొని నిశ్చింతంగా నిట్టూర్చింది.

బస్ స్టేషన్‌లో కర్నూలు వైపు వెళ్లే బస్సులు ఎక్కడుంటాయో అడిగి "కర్నూలు సెక్టార్" అని వ్రాసి ఉన్న చోటికి వెళ్లింది. కర్నూలు మీదుగా వెళ్లే బస్సులు దాదాపు ఎనిమిది నిలబడి ఉన్నాయి. అన్నీ సూపర్ లగ్జరీలు, గరుడలు. ఒకటి గరుడ ప్లస్. తిరుపతి వెళ్లేది. నంద్యాలకు సీటుందా అని బయట తెల్లని యూనిఫాంలోనున్న డ్రైవర్‌నడిగింది. ఆయన ఛార్టు చూసి, "ఏడో నంబరు లేడీస్ సీటులో కూర్చోండమ్మా" అని చెప్పాడు.

సరిగ్గా ఏడు గంటలకు బయలుదేరింది బస్సు, ఫోన్ మ్రోగితే తీసి చూసింది. అత్తయ్య! వెంటనే డిస్కనెక్ట్ చేసి, స్విచ్చాఫ్ చేసుకుంది. దారిలో 'విగ్నేష్ విరాట్" అన్న రెస్టారెంటు వద్ద 9.30 గం॥లకు బ్రేక్ ఫాస్ట్ కోసం ఆపాడు. రెండిడ్లీలు తెచ్చుకుంది గాని ఒకటే తినగలిగింది. కాఫీ తాగింది. బాత్‌రూంకు పోయి వచ్చి విశ్రాంతిగా బస్‌లో కూర్చుంది. మనసంతా అత్తమీదే వుంది.

సరిగ్గా 12 గంటలకు నంద్యాలలో దింపాడు. ఆటో మాట్లాడుకొని సహదేవుని హాస్పిటల్‌కు వెళ్లిందామె. రిసెప్షన్‌లో భాగ్యమ్మ అనే పేషంట్ ఎక్కడ ఉన్నారని అడిగితే అక్కడున్నామె చెప్పింది.


"అయామ్ సారీ మేడమ్! ఆమె ఈ తెల్లవారు ఝామున పోయారు! బాడీ టూ అవర్స్ క్రిందట వాళ్లబ్బాయి తీసుకెళ్లారు. మొన్నటినుండి ఆమె కోమాలో ఉన్నారు."

అపర్ణకు దుఃఖం వెల్లువగా వచ్చింది. అక్కడే కుర్చీలో కూలబడి కుమిలి కుమిలి ఏడ్చింది!

కనీసం శవంగానయినా మేనత్తను ఏ రెస్ట్రిక్షన్స్ లేకుండా చూడొచ్చేమో అపర్ణ! ఆమె ఎక్కిన ఆటో నడిగడ్డ వీధిలోని మేనత్త యింటి వైపుగా సాగిపోయింది!

★★★0★★★

# కథామంజరి దీపావళి కథల పోటీలో ప్రత్యేక ప్రశంస పొందిన కథ




# నాన్న చెప్పులు

## భాగవతుల భారతి

కాలినడకన "నాన్న ఫౌండేషన్" గేటులోకి అడుగుపెడుతూ, కాలిలో రాయి గుచ్చుకుని 'నాన్నా' అనుకున్నాను.

వంగి నా కాళ్ళవంక చూసుకున్నాను. కాళ్ళకి సగం అరిగిపోయి, చిల్లులు పడ్డ చెప్పులు .. మరి రాళ్ళు గుచ్చుకోక ఏంచేస్తాయ్. నేను ఎంత సంపాదనాపరుడినైనా, ఫౌండేషన్ కి వచ్చేటప్పుడు మాత్రం ఈ చెప్పులతోనే వస్తాను. కారణం?... గతం కళ్ళముందు కదలాడింది.

★★★

"నాన్న ఎందుకో దిగులుగా ఉన్నాడూ! కనుక్కున్నావా? కాత్యాయనీ!" అడిగాను ఆఫీస్ నుండి ఇంటికొచ్చి బూట్లు విప్పుతూ.

"అవునండీ! చాలా రోజుల నుండి అలాగే ఉంటున్నారండీ, ఎంతగానో అడిగాను, చెప్పట్లేదు. ఆడపడుచుల నుండీ సమస్యలేం లేవు. మీకూ తెలుసు నేను మామయ్యగారిని ఎలా చూసుకుంటున్నానో." అంది కాత్యాయని.

నిజమే! అమ్మపోయినప్పటినుండీ, నాన్నని అక్కయ్యలు కానీ, తను గానీ, పువ్వుల్లో పెట్టి చూసుకుంటున్నారు, మరేంటి సమస్య? రోజులు గడుస్తున్నా, నాన్నలో దిగులూ, అది చూసి, మాలో కంగారూ! ఏం చేయాలో తెలియక, మనసంతా కెలికినట్లవుతోంది. ఆరోజు ఆఫీస్ నుండి ఇంటికొచ్చి, కనబడే దృశ్యం వంక చేష్టలుడిగి చూస్తుండిపోయా. ఎలాగో గొంతు పెగుల్చుకుని 'నాన్నా' అని మాత్రం అనగలిగా.

"ఏరోయ్! మధూ! వచ్చావా! ఇదేమిటీ అని చూస్తున్నావా? నా మనోవ్యాధికి మందు కనుక్కున్నా" అన్నాడు.

"నీ మనోవ్యాధికి మందు, ఈ తోళ్ళన్నీ పోగుచేసి చెప్పులు కుట్టటమా? ఏమిటిదంతా?" అన్నాను ఆశ్చర్యంగా.

"రా! ఇలా కూర్చో! ఇప్పుడే కాత్యాయనికీ చెప్పాను ఓ కథ. ఓ మహానుభావుడు చెప్పాడని, మా నాన్న చెప్పిన కథ"

"ఓ దేశంలో, ఓ ఓడరేవులో, చాలామంది ప్రయాణికులతో నౌక బయలుదేరింది. చాలా దూరం ప్రయాణించాక, తుఫానుకు నౌక ఓ ద్వీపానికి కొట్టుకుని మునిగిపోయింది."

"కానీ ఆ నౌక లో ఓ ఆడా, ఓ మగా మాత్రమే బ్రతికారు. ఎలాగోలా ద్వీపంలోకి చేరారు. ఆ ద్వీప సౌందర్యం చూసి, ఆశ్చర్యపోయి ఆనందంతో, ఉబ్బితబ్బిబ్బయిపోయారు."

"ఎన్నో పళ్ళ చెట్లూ, పూల చెట్లూ, వనాలూ, ఎన్నో ఆహార పదార్థాలను, తయారు చేసుకోవటానికి కావలసిన వస్తుసామగ్రి, ఒళ్ళు మరచి నిదరపోవటానికి బూరుగు దూది పరుపులూ, క్రూర మృగాల నుండి కాపాడగలిగిన రక్షణ కవచాలైన వెదురు పొదలు, పైగా, అనుభవించటానికి చక్కటి వయసున్న ఆ ఇద్దరూ, స్త్రీ పురుషులూనూ."

"ఐనా వాళ్ళిద్దరూ ఏం చేసారో తెలుసా? అక్కడి సదుపాయాలను, వాడుకుంటూనే, అక్కడి చెట్టు కొమ్మలు అన్నిటినీ తెచ్చి, తెప్పలు చేయటం మొదలుపెట్టారు. ఓ దానికంటే ఒకటి నాణ్యంగా. ఎందుకంటే! ఆ తెప్పలో కొంత దూరం ప్రయాణం చేయగలిగితే, ఏవైనా జాలర్ల ఓడలు ఎదురైతే, వాళ్ళని బ్రతిమలాడి, వాళ్ళ ఓడలలో కాపాడితే, స్వస్థలం చేరవచ్చని, ఎంతో ప్రయాసపడి తెప్ప తయారు చేసారు. "

"ఇంత కష్టపడీ, వారు ఎలాగోలా స్వస్థలానికి చేరారనుకో. అది తర్వాత!"

"ఇది ఓ సైకియాట్రిస్ట్ చెప్పిన యదార్థ సంఘటన" అని క్షణం ఆగి

"మా నాన్న, అదే మీ తాతయ్య చెప్పాడు." అని ఆగి మళ్లీ మొదలుపెట్టి, నన్ను ప్రశ్నించాడు నాన్న.

"ఐనా కానీ, అంత అందమైన, యుగాల తరబడి, ఎన్ని అవసరాలైనా తీర్చగలిగిన ద్వీపానికి కొట్టుకుపోయిన ఇద్దరూ అవసరాన్ని మించి సంపద, సౌఖ్యం లభించినా, అక్కడే ఉండిపోవాలనుకోకుండా, ఆ ద్వీపం వదిలి వచ్చేయాలని, అంత తీవ్రమైన ప్రయత్నం ఎందుకు చేసారంటావ్?"

నేను తెల్లముఖం వేసా! సమాధానం తెలీక.

"మనిషి తిండి తినీ, నీళ్ళు త్రాగి మాత్రమే బ్రతకడురా! ఓ లక్ష్యం కోసం, ఓ ఆశయం కోసం, పోరాడుతూ బ్రతుకుతాడురా! పోరాటం లేని జీవితం నిస్సారమై పోతుంది నాదైనా, నీదైనా!" అన్నాడు నాన్న.

"అది సరే నాన్నా! స్కూల్ ప్రధానోపాధ్యాయుడుగా పదవీవిరమణ చేసిన నువ్వు పిల్లలకు ఏదో ఒకటి బోధిస్తూ కాలక్షేపం చేయాలీ! లేదా, తోటపని చేస్తూనో ఉండాలి కానీ....." నా మాట పూర్తి కాకముందే నాన్న..

"నా జీవితం లో ఓ మాస్టర్ గా పిల్లలతో కలిసిమెలిసి ఉంటూనే చాలా నేర్చుకున్నాను. ఇక ఇప్పుడు ఈ చెప్పులు కుట్టే పని కొత్తగా నేర్చుకుంటా! నేర్చుకుని, ఎంతోమంది కాళ్ళకి చెప్పుల్లేని వాళ్ళకి ఇస్తా. లేదంటే, తక్కువ ఎమౌంట్ కి అమ్ముతా. వచ్చిన పైకంతో, మరో విద్య నేర్చుకుంటా, లేదంటే ఆ సొమ్ము దానం, ధర్మం చేస్తా."

"ఇదిగో మొదటిసారిగా చెప్పులు నీ పాదం ఆధితో కుట్టా .. వేసుకుని చూడు" అని నా కాలికి స్వయంగా తన చేత్తో ఈ చెప్పులు తొడిగాడు నాన్న.

చాలా రోజుల తర్వాత నాన్నలో కొత్త ఉత్సాహం చూసా. ఆనందపడ్డా. అదేం గమ్మత్తో, ఎంతో నైపుణ్యం తో తయారు కాబడిన నాన్న చెప్పులు, ఎంతోమంది అభిమానులతో పాటూ, షాప్ ఓపెన్ చేయించి ఎంతో మందికి జీవనోపాధినీ కల్పించి, నన్ను లక్షాధికారినీ చేసినాయ్.

నాన్న చెప్పిన కథ లో ఆనాడు నా భవిష్యత్తు చూసుకున్నా. నేడు వాస్తవంలోకి తెచ్చా. ఆ కథనూ, నాకు మార్గదర్శకమైన నాన్న స్మృతులనూ, నెమరువేసుకుంటూ, నా పదవీవిరమణ జీవితాన్ని, చెప్పుల షాపులో వచ్చిన లాభంతో మేళవించి ఇదిగో "నాన్న ఫౌండేషన్" స్థాపించి, ఎంతోమంది అనాధలకు బ్రతుకుపోరాటం నేర్పుతున్నా, జీవనోపాధినీ కల్పిస్తున్నా.

★★★0★★★

## కథామంజరి దీపావళి కథల పోటీలో ప్రత్యేక ప్రశంస పొందిన కథ



# ఇది కథ కాదు

కొలిచిన జ్యోతిర్లత

సుజాత హైదరాబాద్ లోని ఒక ప్రైవేట్ కంపెనీ లో మేనేజర్ గా ఇరవై ఐదేళ్ల నుండి పని చేస్తోంది. ఆమెకి యాభై ఏళ్లు వుంటాయి. అందరితో కలుపుగోలుగా వుండే సుజాత అంటే పాత, కొత్త అని లేకుండా ఆఫీసు ఉద్యోగులందరూ ఇష్టపడతారు. కొత్తగా ఆఫీసులో చేరిన సుధకి కూడా సుజాత అంటే వల్లమాలిన అభిమానం. బెరుకుగా వుండే సుధను సుజాత చేరదీయటంతో అన్ని విషయాలు సుజాతతో పంచుకునేది. రోజూ లంచ్ టైంలో సుజాతతో పాటు లంచ్ కి వెళుతూ మరింత దగ్గరైంది. ఒకరోజ మాటల మధ్య తనకి పెళ్లి అయిందని, తనకి ఇద్దరు ఆడపిల్లలని సుధ చెప్పగా విని సుజాత ఆశ్చర్య పోయింది. సన్నగా, నాజూకుగా పచ్చని రంగుతో పాతికేళ్లయినా నిండని సుధకి అప్పుడే ఇద్దరు పిల్లలా? నమ్మకం కుదరక అదే అడిగింది "పెళ్ళెందుకు అంత తొందరగా చేసుకున్నావు" అని.

సుధ చెప్పటం మొదలుపెట్టింది. వాళ్లది కోదాడ దగ్గర ఒక చిన్న వూరని, తన తల్లిదండ్రులకు ఏవో మనస్పర్థలు వచ్చి విడిపోయారని, తనకు ఒక అన్న కూడా వున్నాడని, అన్నను, తనను తండ్రి దగ్గర వదిలిపెట్టి తన తల్లి ఎటో వెళ్ళిపోయిందని, తండ్రి కూడా ఇంకో పెళ్లి చేసుకొని వేరే ఉండేవాడని, వాళ్ల మేనమామ దగ్గర పెరిగామని, తన తండ్రి అప్పుడప్పుడు చదువు కోసం డబ్బులు పంపేవాడని, ఆ డబ్బుతోనే తన మేనమామ వాళ్లని చదివించాడని, చిన్నప్పటి నుండీ తనకు తల్లిదండ్రుల ప్రేమానురాగాలు కరువయ్యాయని చెప్పి బాధ పడింది. అదే వూళ్ళో వున్న వీరి బంధువులు వీళ్ల పరిస్థితులకు జాలిపడి తనకి బావ వరుస అయిన కిషోర్ తో తన పెళ్లి నిశ్చయించారని, పద్దెనిమిదేళ్ల వయసులోనే గత్యంతరం లేక తను పెళ్లికి ఒప్పుకోవలసి వచ్చిందని అలా తన వివాహం తన ప్రమేయం లేకుండా జరిగిందని చెప్పుకొచ్చింది.

"మీ ఆయన నిన్ను బాగా చూసుకుంటాడా" సుజాత అడిగింది.

"మా బావ మంచివాడే కానీ కొంచెం మొరటు మనిషి. కోపం ఎక్కువ. ఏ విషయాలు నాతో చర్చించడు. రెండెకరాల పొలం వుంది. పొద్దున్నే పొలం పనులకు వెళ్లి సాయంత్రం గానీ యింటికి రాడు. అప్పుడప్పుడు తాగుతాడు. వద్దంటే వినడు. పెళ్లికి ముందు మా బావని అడిగాను చదువుకుంటానని. సరేనన్నాడు. అప్పటికే డిగ్రీ చదువుతున్న నాకు చదువుకోనిస్తే చాలనిపించింది. పెళ్ళికి వెంటనే ఒప్పుకోవటానికి అది కూడా ఒక కారణం. మా అత్త మామలు చాలా మంచివాళ్లు. నన్ను బాగా చూసుకుంటారు. మా మామయ్యకి ఒక కిరాణా షాపు వుంది. మా అత్త కూడా ఖాళీ సమయాల్లో షాపులో కూర్చుని మామయ్యకి సాయం చేస్తుంది. ఎలాగోలా కష్టపడి డిగ్రీ పాసయ్యాను. ఊరికే ఇంట్లో కూర్చుంటే బోరుకొట్టేది. మా బావని ఒప్పించి కోదాడలో బీ.ఎడ్ కోర్సులో జాయినయ్యాను. చదువుతుండగానే అనుకోకుండా వెంట వెంటనే రెండు కాన్పులయ్యాయి. ఇద్దరు ఆడపిల్లలు పుట్టారు. పట్టు వదలకుండా బీ. ఎడ్ పరీక్షలు రాశాను. మంచి మార్కులతో పాసయ్యాను. ఇద్దరూ ఆడపిల్లలయ్యేసరికి అదికూడా వెంట వెంటనే పుట్టేసరికి మా బావ అప్పుడప్పుడు చిరాకు పడేవాడు. తాగటం కూడా ఎక్కువ చేశాడు. మా అన్నకి, బావకు నా పెళ్లి

సమయంలో ఏవో మాట పట్టింపులు వచ్చి మా అన్న మా యింటికి రావడం మానేశాడు. కనీసం పిల్లల్ని చూడటానికయినా రాలేదు. రాను రాను ఇంటి ఖర్చులు, పిల్లల ఖర్చులు పెరగసాగాయి. నేను టీచర్ ఉద్యోగం కోసం ప్రయత్నాలు మొదలు పెట్టాను. చిన్న వూరు కావటంతో ప్రైమరీ స్కూల్లో టీచరుగా నెలకు ఆరు వేల జీతానికి జాయిన్ అయ్యాను. ఆరు వేలు తక్కువే అయినా ఏదో చేదోడు వాదోడుగా వుంటుందని నాకు నేను సర్ది చెప్పుకున్నాను."

చిన్నతనం నుండీ సుధ పడిన కష్టాలు వింటుంటే సుజాతకి సుధ మీద ఎంతో జాలి వేసింది. "మేడం, మీకు నా గురించి చెప్తుంటే మా అమ్మకి చెపుతున్న ఫీలింగ్ కలుగుతోంది." సుధ అంది.

"మరి ఈ ఆఫీసులో ఉద్యోగం ఎలా సంపాదించావు" సుజాత అడిగిన దానికి సుధ ఇంకా చెప్పసాగింది.

"ఒకరోజు స్కూల్లో న్యూస్ పేపర్ తిరగేస్తుంటే ఈ కంపెనీ ప్రకటన చూశాను. క్లరికల్ పోస్టులు ఖాళీలు వున్నాయని, జీతం నెలకు పన్నెండు వేలని, ఉద్యోగం హైదరాబాద్‌లోనని ప్రకటన చూసి అప్లై చేస్తానని మా బావని అడిగాను. డబ్బుకిబ్బంది అవుతోందని తనకి కూడా తెలుసు కనక ఏమనుకున్నాడో అప్లై చెయ్యమన్నాడు. వెంటనే అప్లై చెయ్యటం, ఇంటర్వ్యూ బాగా చెయ్యటం, ఉద్యోగం రావటం వెంట వెంటనే జరిగిపోయాయి. హైదరాబాదులో కోఠిలోని ఆఫీసుకి దగ్గరగా వున్న ఒక లేడీస్ హాస్టల్లో నన్ను చేర్పించి బావ వెళ్ళిపోయాడు. నా రూములో నాతో పాటు ఇద్దరమ్మాయిలు వున్నారు. కొత్త ప్రదేశం, కొత్త జీవితానికి తొందరగానే అలవాటు పడ్డాను. కానీ పిల్లలను అత్తమామల దగ్గర ఉంచటం వలన కొంచెం బెంగగా అనిపిస్తుంది. పొదుపుగా వాడుకుంటూ జీతం బ్యాంకులో పిల్లల పేరున వేస్తున్నాను."

పిల్లల భవిష్యత్తు గురించి ఇప్పటినుంచే ఆలోచిస్తున్న సుధని చూస్తే సుజాతకి ముచ్చట వేసింది.

సుజాత సుధలో గమనించిందేమిటంటే తనని ఎవరైనా నువ్వు అందంగా వున్నావు అంటే మురిసిపోతుంది. ఆడవాళ్ళు అంటే ఫర్వాలేదు మగవాళ్ళు అన్నా కూడా గర్వంగా ఫీలవుతుంది. వారిని వారించేది కాదు. అది తన అమాయకత్వమా లేక తెలిసి ఎంజాయ్ చేస్తోందా అన్నది సుజాతకి అర్ధం కాలేదు. చిన్నతనంలోనే పెళ్లి, పిల్లలు, ఇంటి బాధ్యతలు మోయటం వలన ఒక ఆడపిల్ల కోరుకునే చిన్న చిన్న ఆనందాలు ఏనాడూ తన భర్త నుండి పొందనందుకు తన లోలోపల అణచుకున్నది ఈ విధంగా బయటపడుతోందా? ఏమో. ఒకటి రెండుసార్లు సుజాత చెప్పి చూసింది. మగవాళ్లకి ఎక్కువ చనువు ఇవ్వద్దు. ఎంత తక్కువగా మాట్లాడితే అంత మంచిదని.

"సరే మేడం, జాగ్రత్తగా వుంటాను" అని అనేది.

కొన్ని నెలల తరువాత సుధ భర్త కిషోర్ హైదరాబాద్ లో అతని స్నేహితుడి కంపెనీ ఫెర్టిలైజర్స్&సీడ్స్ లో ఉద్యోగం చెయ్యటానికి, పొలం వాళ్ల నాన్నకి అప్పగించి హైదరాబాద్ వచ్చేసాడు. అతని కంపెనీ హైదరాబాద్ పొలిమేరలో వున్న షాద్ నగర్ అవటం వల్ల సుధకి, అతనికీ వీలుగా శంషాబాద్లో అద్దె తక్కువని రెండు బెడ్ రూములు వున్న ఇల్లు అద్దెకు తీసుకున్నారు. సుధకి శంషాబాద్ నుండి తొమ్మిది గంటలకి కోఠి వెళ్లే డైరెక్ట్ బస్సు వుంది. ఇలా కొంతకాలం బాగానే నడిచింది.

ఒక రోజున సుధ సుజాత సీటు దగ్గరకు వచ్చి కూర్చుంది. తన ముఖంలో ఏదో ఆందోళన కనబడింది.

"ఏం సుధా, అలా వున్నావు? వంట్లో బాగాలేదా?" సుజాత అడిగింది.

"వంట్లో బాగానే వుంది మేడం. మీరు ఎవ్వరికీ చెప్పనంటే మీకో విషయం చెప్తాను." అని ఆగింది.

" ఎవ్వరికీ చెప్పనులే, ఏదైనా పర్సనల్ విషయమా?"

"అవును మేడం, పర్సనలే." సుజాతకి ఆసక్తి పెరిగింది. "ఏంటదీ" ముందుకు వంగుతూ అడిగింది.

"మేడం, నేను రోజూ తొమ్మిది గంటల బస్సులో శంషాబాద్ నుండి ఆఫీసుకు వస్తున్నాను కదా. అదే టైంలో ఒకడు నన్ను ఫాలో అవుతున్నాడు. నాతో పాటే బస్సెక్కి ఆఫీసు వరకూ వస్తున్నాడు. పొద్దున్న పూట బస్టాప్ లో జనం ఎక్కువగా ఉండరు. దగ్గరగా నిలబడి ఏదేదో మాట్లాడటానికి ప్రయత్నిస్తున్నాడు. బస్సులో కూడా నా వెనకే నించుంటాడు."

"మరి నువ్వేమీ అనలేదా అతనిని". సుజాత అడిగింది.

"నా వెంట ఎందుకు వస్తున్నావు అని ఆడిగాను మేడం. అలా అంటే, మిమ్మల్ని నేనేమైనా అల్లరి పెడుతున్నానా. మీకేంటి ఇబ్బంది అని అన్నాడు".

"మీ ఆయనతో చెప్పు అతని సంగతి. ఆయన చూసుకుంటాడు" సుజాత సలహా యిచ్చింది.

"అమ్మో, మా బావకి కోపం ఎక్కువ. పెద్ద గొడవ పెట్టుకుంటాడు. ఉద్యోగం మానేయమంటాడు. అది నాకు ఇష్టం లేదు. మీరే ఏదైనా సహాయం చెయ్యండి మేడం." ప్రాధేయపడింది.

"పోలీసు కంప్లైంట్ ఇద్దాము. షీ టీమ్ అని ఆడవాళ్ళకు రక్షణ ఇచ్చే వారికి చెబుదాము. వాళ్లే ఇలాంటి వారికి తగిన బుద్ధి చెప్తారు."

"వద్దు మేడం. అలా చేస్తే అందరికీ తెలిసిపోతుంది. నేనే ఈసారి అతనితో గట్టిగా చెప్తాను" అని అంది.

ఇక సుజాత ఆ విషయం వదిలేసింది.

కొన్ని రోజుల తరువాత, ఒక రోజు సుధ లంచ్ టైంలో సుజాతతో "మేడం, నేను అతనిని తప్పుగా అనుకున్నాను. నన్ను తన సిస్టర్ లాగా భావిస్తున్నాడట. తనని చూసి భయపడవద్దని చెప్పాడు." అని అన్నది. ఈ ట్విస్టు ఏమిటో సుజాతకి అర్థం కాలేదు. కొంచెం సీరియస్ గా చెప్పింది.

"చూడు సుధా! కొంతమంది మగవాళ్లు మేక వన్నె పులులు. అవకాశం కోసం కాచుకుని వుంటూ ఇలాగే కల్లబొల్లి కబుర్లు చెప్తారు. ఎందుకైనా మంచిది నీ జాగ్రత్తలో నువ్వు వుండు. కోరి కష్టాలు కొని తెచ్చుకోకు. ఇప్పుడు సిస్టర్ అని అంటాడు తరువాత ఇంకేదో అంటాడు. ఇలాంటి వాళ్లని వెంటనే కట్ చెయ్యాలి." సుజాత చెప్పవలసింది చెప్పి ఊరుకుంది.

తరువాత సుజాత రెండు నెలలు అమెరికాలో వున్న తన కొడుకు దగ్గరకెళ్లింది కోడలు డెలివరీ కోసం. సుధ అప్పుడప్పుడు వాట్సాప్ మెసేజులు పెట్టేది కానీ ఆ విషయాలేవి ఎత్తలేదు. రెండు నెలల తరువాత ఆఫీసుకు వెళ్లిన సుజాతని నవ్వుతూ పలకరించింది సుధ. లంచ్ టైంలో ఉండబట్టలేక సుజాత అడిగింది "సుధా! ఇప్పుడా గొడవలేవి లేవు కదా." దానికి సుధ,

"మేడం, మీరే అతనిని నమ్మడం లేదు. చాలా మంచివాడు. తనకి చెల్లెళ్లు లేరట. నన్ను తన సోదరిగా చూసుకుంటానన్నాడు. నాకే కాకుండా నా పిల్లలకి కూడా గిఫ్టులు కొనిచ్చాడు. పెద్ద బిజినెస్ ఉందట అతనికి. నాకు ఎటువంటి హెల్ప్ కావాలన్నా చేస్తానన్నాడు"

"మరి మీ ఆయనకు పరిచయం చేసావా నీకు దొరికిన అన్నయ్యని." వెటకారం ధ్వనిస్తూ అడిగింది సుజాత. కానీ ఆ మాటలు సుధకి రుచించలేదు. మౌనంగా ఉండిపోయింది. చివరగా సుజాత అన్నది "సుధా! నాకెందుకో నువ్వు చెప్పేది ఇంకా నమ్మబుద్ధి కావటం లేదు. నీ ధోరణి చూస్తుంటే ఇదేదో చాప కింద నీరు లాగా పాకుతోంది. నువ్వు నన్ను అమ్మలా భావిస్తే ఈ రిలేషన్ ఇంతటితో కట్ చెయ్యి. లేకపోతే ముందు ముందు లేనిపోని సమస్యలు వస్తాయి. నీ యిష్టం" అని చెప్పి ఆ టాపిక్ ఎత్తడం మానేసింది. మనసులో పీడిస్తూనే వుంది. ఏమిటీ అమ్మాయి ఎందుకిలా ప్రవర్తిస్తోంది? లోకం పోకడ తెలియకనా లేక అతను గిఫ్టులు ఎరగా చూపిస్తుంటే అతని మాయ మాటలు నమ్ముతోందా? ఏమో ఆ భగవంతునికే తెలియాలి. సుధ కూడా సుజాత దగ్గర అతని విషయాలు ప్రస్తావించడం మానేసింది.

కొన్ని రోజులకు సుజాత ఏదైతే జరగకూడదని భావించిందో అదే జరిగింది. ఆ రోజు సుజాత ఆఫీసుకు వెళ్లేసరికి సుధ ఇంకా రాలేదని తెలిసింది. రోజూ తొందరగా వచ్చే సుధ రాలేదేంటబ్బా అని అనుకుంటూ సుజాత తన పనిలో పడిపోయింది. మధ్యాహ్నం పన్నెండు గంటలకి సుధ ఆఫీసుకు వచ్చింది. బాగా ఏడ్చినట్లుగా కళ్లు ఎర్రబడి వున్నాయి. తల కూడా సరిగ్గా దువ్వుకోకుండా రేగిన జుట్టుతో వుంది. సెక్షన్లో అందరూ అడుగుతూ వుంటే ఎవరో దగ్గరి చుట్టాలు పోయారని చెప్పటం సుజాతకి వినిపిస్తోంది. ఇంట్లో ఏదో గొడవ జరిగి ఉండవచ్చని సుజాత పసికట్టింది. లంచ్ టైంలో మెల్లగా అడిగింది. "ఏంటి సుధా అలా వున్నావు. ఏం జరిగింది?" అని అడగ్గానే నీళ్లు నిండిన కళ్లను తుడుచుకుంటూ,

"మేడం, మా బావకి సంగతంతా తెలిసిపోయింది. రాత్రి బాగా తాగి వచ్చి నన్ను కొట్టాడు. నన్ను వదిలేస్తానంటున్నాడు. నాకు చచ్చిపోవాలని వుంది" అంటూ ఏడుస్తూ చెప్పింది.

"మీ ఆయనకు ఎలా తెలిసింది. నువ్వు చెప్పేసావా?" అంటే,

"లేదు మేడం, మా బావకి కాలనీలో ఒక ఫ్రెండ్ వున్నాడు. ఆ ఫ్రెండుకు వీడు కూడా ఫ్రెండ్ అట. వీడు ఆ ఫ్రెండుతో నా గురించి చాలా చీప్ గా మాట్లాడాడట. మా ఇద్దరికీ అక్రమ సంబంధం వుందని అది మా బావకి తెలియకుండా మేనేజ్ చేస్తున్నామని చెప్పాడట. ఆ ఫ్రెండ్ మా బావని కలసి వాడు కూసిందంతా చెప్పి మీ ఆవిడని కంట్రోల్ లో పెట్టుకో. వాడు ఒక వుమనైజర్. మీ ఆవిడతో సంబంధం వుందని కాలనీలో ప్రచారం చేస్తున్నాడు అని చెప్పాడట. మా బావ రాత్రి బాగా తాగి నానా గొడవ చేశాడు. నేను దేవుడి మీద, ఆఖరికి పిల్లల మీద కూడా ఒట్టేసి చెప్పాను ఎటువంటి తప్పు చేయలేదని. అయినా నన్ను నమ్మడం లేదు మేడం. ఇప్పుడు నేనేం చెయ్యాలి. నాకు బ్రతకాలని లేదు." అంటూ కన్నీటి పర్యంతమయింది. నాకు సుధ మీద జాలీ, కోపం రెండూ కలిగాయి నేనెన్నిసార్లు హెచ్చరించినా నా మాటలు పెడచెవిని పెట్టినందుకు.

సుజాత సాలోచనగా, "సుధా! మీ ఆయనని రేపు ఒకసారి ఆఫీసుకి తీసుకురా. నేను మాట్లాడతాను". అంది . ముందు ససేమిరా రానన్నాడట. మరి ఏమనుకున్నాడో సుజాత మేడం మాట్లాడతారట అని సుధ చెబితే ఏ కళనున్నాడో ఆఫీసుకి వచ్చి గ్రౌండ్ ఫ్లోర్ లో కాంపౌండ్ గోడ పక్కన సందులో నిలబడ్డాడు. అక్కడ నిలబడితే ఎవ్వరికీ కనపడరు. ఆఫీసు వాళ్లకి తెలియటం సుజాతకి ఇష్టం లేదు. సుజాతే కిందకు దిగి వెళ్ళగానే నమస్కారం పెట్టాడు. తన గురించి సుధ అప్పుడప్పుడు చెప్పేదేమో గౌరవంగా తల వంచుకొని సుజాత చెప్పేది మర్యాదగా విన్నాడు. "చూడండి కిషోర్ గారూ, సుధ నాకు మొదటినుండి అన్ని విషయాలు చెప్పింది. ఇందులో సుధ తప్పేమీ లేదు. సుధ అమాయకత్వాన్ని అతను అలుసుగా తీసుకొని అన్నని మాయ మాటలు చెప్పాడు. సుధ కూడా అతనిని అన్నలాగే భావించింది. ఎప్పటికప్పుడు ఈ విషయాలు మీతో చెప్పమని నేను ఎన్నోసార్లు సుధకి చెప్పాను. మీకు కోపం ఎక్కువని, గొడవవుతుందని భయపడింది. అంతేగానీ మీకు చెప్పకూడదని కాదు. మీరు పొద్దున్నే పోయి రాత్రికి ఎప్పుడో వస్తారని, ఆదివారాలు పిల్లల దగ్గరకు వెళ్ళటానికి టైము సరిపోతుందని తీరికగా మాట్లాడుకునే సమయమే చిక్కదని చెప్పి బాధపడేది. సుధకి మీ సపోర్టు ఉండుంటే విషయం ఇంతవరకు వచ్చేది కాదని నా అభిప్రాయం. మీకు చేతనైతే అతనిపై పోలీసు కంప్లైంట్ ఇవ్వండి. సుధని ఏమీ అనకండి. ఉద్యోగం చేసే చాలామంది ఆడవాళ్ళకు ఇలాంటి సమస్యలు ఎదురౌతాయి. కొంతమంది ధైర్యంగా ఎదుర్కొంటారు. కొంతమంది సుధ లాగా నలిగిపోతారు. అది తన తప్పు కాదు. తాను పెరిగిన వాతావరణం కూడా కారణం కావచ్చు. చాలామంది మగవాళ్లు పైకి మంచిగా నటిస్తూ వెనక గోతులు తీస్తారు. మీరు అదృష్టవంతులు. సుధకి ఎటువంటి హాని జరగకముందే బయటపడింది. తన తప్పు తెలుసుకుంది. ఇది ఇక్కడితో వదిలెయ్యండి. మీ చక్కటి కాపురాన్ని పాడు చేసుకోకండి." అని నచ్చ చెప్పింది.

సుజాత చెప్పిన మాటలు అతనిని ఆలోచనలో పడేసాయి. సుధని ఉద్యోగం మానిపించి వూరికి పంపేస్తానన్నాడు. సుజాత మళ్లీ అందుకుంది. "ఉద్యోగం మాన్పించటం ఎందుకు? మీకు ఇద్దరు ఆడపిల్లలు వున్నారు. వాళ్ళ భవిష్యత్తు గురించి ఆలోచించండి. ఇక్కడ వుంచటం ఇష్టం లేకపోతే విజయవాడలో మా బ్రాంచి వుంది అక్కడికి సుధని ట్రాన్స్ఫర్ చేయించే బాధ్యత నాది. మీ ఆఫీసు బ్రాంచి కూడా విజయవాడలో వుందని ఒకసారి సుధ చెప్పింది. మీరు కూడా అక్కడికి ట్రాన్స్ఫర్ పెట్టుకోండి. అది అన్నిటికన్నా ఉత్తమమైన మార్గం." అని సలహా ఇచ్చింది సుజాత. ఇది విన్న తరువాత అతను కొంచెం చల్లబడ్డాడు.

"ఓకే అండి. మీరిచ్చిన సలహాకి థాంక్సండీ" అని చెప్పి నమస్కారం చేసి వెళ్ళిపోయాడు. సుధకి ఒక పెద్ద గండం గడిచినట్లనిపించింది. సుజాతను కావలించుకొని "చాలా థాంక్స్ మేడం." అని అంది.

సుజాత మేనేజ్మెంట్ వారికి చెప్పి సుధకి ట్రాన్స్ఫర్ ఆర్డర్లు వెంటనే తెప్పించేసింది. వెళ్లే ముందు సుధ సుజాత కాళ్లకి దండం పెట్టి.

"నేను ఇక్కడ చేరినప్పటినుండి నన్ను అమ్మలా ఆదుకున్నారు. మీ మేలు మరిచిపోను మేడం" అని కళ్ల నీళ్లు పెట్టుకుంది.

సుజాత అంది "సుధా, నీకు జరిగిన ఈ చేదు అనుభవం ఒక గుణపాఠం కావాలి. మళ్లీ ఇటువంటి గొడవల్లో ఇరుక్కోవద్దు. నీ కెరీర్ మీద, పిల్లల చదువుల మీద ఫోకస్ చెయ్యి. మీ ఆయన దగ్గర ఏదీ దాచకు. అప్పుడే నీ సంసారం బావుంటుంది. ఇది నా సలహా" సుజాత చెప్పిన దానికి తల వూపింది.

సుధ విజయవాడ వెళ్ళిపోయి రెండేళ్ళు గడిచాయి. అప్పుడప్పుడు ఫోను చేసేది. పిల్లల్ని విజయవాడకి తెచ్చేసామని చెప్పింది.

ఆ రోజు దీపావళి పండుగ. పొద్దుటే సుధ దగ్గర్నుంచి ఫోన్ వచ్చింది. "మేడం, మేము హైదరాబాద్ వచ్చాము. మిమ్మల్ని కలవాలని వుంది. సాయంత్రం ఐదింటికి వస్తాము." అని చెప్పి ఫోన్ పెట్టేసింది. సుజాతకి పాత విషయాలన్నీ జ్ఞాపకానికి వచ్చాయి. మళ్లీ ఏదైనా సమస్య వచ్చిందా సుధకి. ఛ ఛ తనెందుకు ఇలా ఆలోచిస్తోంది. ఇలా అనుకుంటూ సాయంత్రం వాళ్ల రాక కోసం వేచి చూసింది. సుధ, కిషోర్ ఇద్దరూ కొత్త బట్టలు తీసుకొని వచ్చారు. సుజాత దంపతులకు బట్టలు పెట్టి కాళ్లకి దండం పెట్టారిద్దరూ. సుధ చెప్పింది " మేడం, మేము విజయవాడ వెళ్ళాక మా బావ సొంతంగా ఫెర్టిలైజర్స్ బిజినెస్ పెట్టాడు. బిజినెస్ లో మంచి లాభాలు రావడంతో హైదరాబాద్ లో కూడా ఒక బ్రాంచి ఈ రోజే ప్రారంభోత్సవం చేశాము. ఇదంతా మీ ఆశీర్వాదం. మీ దీవెనలు తీసుకోవాలని వచ్చాము."అని అంది. సుజాతకి చాలా సంతోషం వేసింది. అప్పటి అమాయకత్వం స్థానంలో ఇప్పుడు ఆత్మస్థైర్యం కనపడుతోంది సుధలో. తన వల్ల వారి కాపురం నిలబడటం సుజాతకి ఆత్మ సంతృప్తినిచ్చింది.

వాళ్లు వెళ్లిపోయాక సుజాత భర్త అన్నాడు "వాళ్ల బిజినెస్ మనవల్ల అభివృద్ధి చెందడం ఏమిటీ. మనమేం చేశామని మనకి బట్టలు పెట్టారు?"

సుధకి జరిగిన విషయాలు ఏవీ తన భర్తకు తెలియవు. తనే చెప్పలేదు.

"ఏదో పెద్దవాళ్ళమని మన ఆశీర్వాదం కోసం వచ్చి మాట వరసకి అన్నారు లెండి. ఏదో వారి ఆనందం మనమెందుకు కాదనాలి" నవ్వుతూ అంది సుజాత.

★★★0★★★

కథామంజరి దీపావళి కథల పోటీలో ప్రత్యేక ప్రశంస పొందిన కథ



# పరిష్వంగం

జాస్తి రమాదేవి

చేతిలో ఉన్న కార్డుని మరోసారి చూసింది భానుమతి.

"ఎప్పుడు బయలుదేరుతున్నావు?" ఫోన్ చేసి అడిగాడు భాస్కర్.

"అదే ఆలోచిస్తున్నాను!" అంది భానుమతి.

"తప్పకుండా వెళ్ళు భానూ!" అని ఫోన్ పెట్టేసాడు భాస్కర్.

రెండు చీరలు బేగ్ లో సర్దుకుంది. గిఫ్ట్ పేక్ చేయించింది. బయలుదేరే ముందు అమెరికాలో ఉన్న కార్తీక్ కి వాయిస్ మెసేజ్ పెట్టింది. తాతయ్య వాళ్ళూరికి వెళుతున్నానని. కాబ్ సిటీని వదిలి ఊరి వైపు వేగంగా దూసుకుపోతోంది.

భర్త భాస్కర్ బిజినెస్ పనంటూ చెన్నయ్ వెళ్ళాడు. ఉంటే అన్నీ అతనే చూసుకుంటాడు. ఉన్న ఒక్కగానొక్క కొడుకు కార్తీక్ అమెరికాలో సెటిలయ్యాడు. కుదిరినప్పుడు రెండేళ్లకోసారి కుటుంబంతో వస్తుంటాడు.

ఎవరికి వాళ్ళు వేరుపడ్డాక ఎక్కువగా ఆ ఊరికి వెళ్ళలేదు తను. అడపాదడపా అత్తగారింట్లో జరిగే చిన్న చిన్న కార్యక్రమాలకు హాజరయ్యేవాళ్ళు. వాళ్ళు కాలం చేసాక ఆ ఊరికి వెళ్ళాలని అనిపించలేదు. అక్కడ తన ఆడబడుచు కల్యాణి కుటుంబం ఉంటుంది. కూతుర్ని కార్తీక్ కు చేసుకోలేదని పెళ్లికి రాలేదు. కల్యాణి కూతురి పెళ్ళికి తనూ వెళ్ళలేదు. భాస్కర్ వెళ్ళాడు. సిగ్గుగా లేదా అని తనంటే, 'తను నా తోడ బుట్టిన చెల్లెలు. తనతో బంధం నా తనువు ఉన్నంత వరకూ ఉంటుంది' అని వాదించి వెళ్ళొచ్చాడు. తర్వాత కల్యాణి ఎన్ని ఫోన్లు చేసినా తను అంటీముట్టనట్లుగా మాట్లాడేది.

ఇప్పుడు వెళ్ళక తప్పడం లేదు. తన మనవరాలు పుష్పవతి అయ్యిందని స్నానానికి రావాలని ఫోన్ చేసి, పోస్ట్‌లో కార్డు పంపింది. భాస్కర్ ఉండుంటే ఈ తలనొప్పి తనకుండేది కాదు.

"నాకు వీలుకాదు. ఈసారికి నువ్వెళ్ళు భానూ!" అన్నాడు భాస్కర్. తను వెళ్ళకపోయినా అతనికి చెల్లెలి కుటుంబం అన్నా, ఆ ఊరన్నా వల్లమాలిన అభిమానం. వెళుతూనే ఉంటాడు. ఊళ్ళో అతని ఫ్రెండ్స్, బంధువులు పెళ్ళిళ్ళనీ, అవనీ ఇవనీ పిలుస్తూనే ఉంటారు.

కాబ్ ఊరికి చేరేసరికి ఉదయం పదయ్యింది. ఇంటికి దారి చెబుతూ, పరిసరాలను గమనిస్తోంది. పదేళ్ళక్రితం ఉన్నప్పటి సందడి లేదు. ఏదో వెలితి కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.

ఇల్లు దగ్గరవుతుంటే ఏదో తెలియని ఉద్వేగం.

భాస్కర్ కూ తనకూ పెళ్ళి జరగటం ఓ విధంగా అతని తల్లి తండ్రులకు ఇష్టం లేదు. తనకు పెళ్ళి చూపులు అతని స్నేహితుడితో జరిగాయి. భాస్కర్ తోడు వచ్చాడు. ఆ స్నేహితుడు వాళ్ళు అమ్మాయి నచ్చలేదని కబురు పెట్టారు. మూడో రోజ భాస్కర్ వచ్చాడు. అమ్మాయి నాకు నచ్చింది. మీరు వచ్చి మా ఇంట్లో వాళ్ళతో మాట్లాడండి అన్నాడు.

భాస్కర్ కుటుంబం ఆ ఊళ్ళో పెద్ద మోతుబరి కుటుంబమని, వాళ్ళతో వియ్యమొందడం కష్టమని నాన్న భయపడ్డాడు. నాయనమ్మ ' 'అడగడం మన ధర్మం. అబ్బాయే నచ్చిందంటున్నాడు కదా!' అని నాన్నని వొప్పించింది. ఆర్నెల్లు అలా అలా నలిగి చివరికి భాస్కర్ పోరు పడలేక అతని అమ్మానాన్నలు పెళ్ళికి ఒప్పుకున్నారు. ఆ విషయం అతను ఎప్పుడూ అంటుంటాడు. 'ఈ రాజకుమారి ఎంత కష్టపడితే దొరికిందనీ..." అని. తనకి గర్వంగా అనిపిస్తుంది. పెద్ద కుటుంబం వాళ్ళది. నలుగురు అబ్బాయిలు, ఇద్దరు అమ్మాయిలు. ఎప్పుడూ ఇల్లు తిరనాళ్ళలా ఉండేది. ఎప్పుడూ ఏదో ఒక ఫంక్షన్, ఏదో ఒక పండగ హడావిడి, బంధువుల రాకపోకలతో ఊపిరి ఆడనట్టుండేదా ఇంట్లో. తన కుటుంబం చిన్నది. అన్నయ్యా తనే కావడంతో తను ఆడింది ఆట .. పాడింది పాటలా గడిచింది. అత్తగారిల్లు పూర్తిగా భిన్నం. ఎంతమంది పనివాళ్ళు ఉన్నా తమకు ఖాళీ అనేదే ఉండేది కాదు.

భాస్కర్ తో మనం వేరుగా ఉందాం అంటే, చిన్న తమ్ముడి పెళ్ళి అయ్యాకే వేరు కాపురాలు అనడంతో ఆ ఆశ పోయింది. చిన్న మరిది పెళ్ళయ్యాక ఎవరికి వారు వేర్లు పడ్డారు. భాస్కర్ సిటిలో వ్యాపారం మొదలు పెట్టాడు. బాగా లాసొచ్చింది. ఇంటికి వచ్చెయ్యమని అత్తమామలు గొడవ చేసారు. తనకస్సలు మళ్ళీ ఆ ఇంటికి వెళ్ళాలని లేదు. భాస్కర్ మళ్ళీ ఎలాగో నిలదొక్కుకున్నాడు. ఒక్క కొడుకు చాలని కార్తీక్ తో ఆపేసారు. వాడు చక్కగా చదువుకుని అమెరికాలో సెటిలయ్యాడు. కల్యాణి వాళ్ళ అత్తింటి వాళ్ళలో గొడవలు అంటూ కుటుంబంతో పుట్టింటికి వచ్చింది. అత్తమామల ఇంట్లో ఉంటున్నారు వాళ్ళు. భాస్కర్ చాలా సాయం చేసాడు వాళ్ళకని తనకు తెలుసు.

అప్పుడప్పుడు కార్తీక్ కూడా డబ్బు పంపిస్తుంటాడు. సిగ్గు లేకుండా తీసుకుంటుందావిడ అని తనకు కల్యాణి అంటే నచ్చదు. ఎప్పుడైనా వచ్చినా తను అంతగా పట్టించుకోదని కాబోలు రావడం కూడా మానేసింది కల్యాణి.

కాబ్ ఇంటిముందు ఆగింది. గేటు చెక్కది కావడంతో ఓ పక్కకి ఒరిగిపోయింది. గేటు ముందు ముగ్గు వేసి ఉంది. కొత్త గేటు పెట్టించుకోవచ్చు కదా! చిరాగ్గా అనుకుంది భానుమతి.

"వచ్చావా భానొదినా!" అని సంతోషంగా ఎదురొచ్చింది కల్యాణి. తనతో పాటు డబ్బు కట్టలు తెస్తుందని కాబోలు ఆ ఆనందం.

"వదిన వస్తుందని అన్నయ్య ఫోన్ చేసి చెప్పాడని నీ ఆడబడుచు నిలబడ్డం లేదమ్మాయ్. నువ్వు వస్తున్నావని కల్యాణి కి ఎంత సంబరంగా ఉందో" పక్కింటి సూరమ్మత్త ఇత్తడి చెంబుతో నీళ్ళు అందిస్తూ అంది. ఆవిడ నడుం బాగా వంగిపోయింది. కర్ర సాయంలో నడుస్తోంది.

ఈ సంబరమంతా అన్నగారు పంపే నోట్లకట్ట మీదే అని మీకెవలికి తెలీదులే అత్తా! లోలోపలే గొణుక్కుంది భానుమతి. "స్నానాల గదిలో నీళ్ళున్నాయి. ముందు నువ్వు స్నానం చేసిరా ఒదినా! ఫలహారం తిందువుగాని" చెప్పి కల్యాణి తువ్వాలు చేతికివ్వబోతే తీసుకోలేదు భానుమతి. తన అత్తింట్లో ఉంటూ తనకి మర్యాదలు చేస్తోంది కల్యాణి. తన బేగ్ లోంచి టవల్ తీసుకుని స్నానాల గదిలోకి వెళ్ళింది భానుమతి.

స్నానం చేసి టవల్ ఆరేయాలని పెరటి తలుపులు తీసి చూసింది. ఒకప్పుడు వంట చేసుకునే గదులు కూలిపోతూ కనబడ్డాయి. పెరట్లో బావి కూడా వాడటం లేనట్టుంది. చెత్తా చెదారంలో నిండిపోయి ఉంది. "అటువైపు వాడటం లేదొదినా!" అంటూ వచ్చింది కల్యాణి.

భానుమతి పెరటి తలుపులు మూసి లోపలికి వచ్చింది. ఇంట్లో బంధువులు ఒక్కొక్కళ్ళే చేరుతున్నారు.

"ఎన్నాళ్ళయింది భానమ్మా నిన్ను చూసి. అప్పుడెప్పుడో వచ్చావు. మళ్ళీ రాలేదు" అంటూ అందరూ పలకరిస్తుంటే నవ్వి ఊరుకుంది. "ముందు అమ్మాయిని ఫలహారం తిననివ్వండర్రా" అని అందర్నీ గదమాయించింది సూరమ్మత్త.

భానుమతి టిఫిన్ చేసి కాస్సేపు నడుం వాల్చింది. ఇల్లంతా సందడి సందడిగా ఉంది. వాళ్ళ గోలకి నిద్ర పట్టలేదు. సిటి లైఫ్ కి అలవాటు పడిపోయింది తను. ఏసి ఉంటే గాని ఉండలేదు. అసలే వేసవి కాలం. గ్రీష్మ రుతువు. ఆకులు రాలే కాలం. గాలి లేక ఉక్కపోతగా ఉంది. పాత కాలం నాటి పెంకుటిల్లు. కిటికీల్లోంచి వచ్చే గాలి సరిపోవడం లేదు. పల్లెటూరు కావడంతో కరెంటు కోత కాబోలు. ఫేనులు తిరగడం లేదు. ఇలాంటప్పుడు అయినా ఇన్వర్టర్ ఉండొద్దూ. రేపు ఫంక్షన్ ఎలా చేస్తారో? అసలు అప్పటివరకూ ఈ ఇంట్లో ఎలా గడపాలో అర్థం కావడం లేదు.

పాత విసనకర్ర దొరికితే విసురుకుంటూ కూర్చుంది. స్థితి బాగోనప్పుడు ఈ వేడుకలు చెయ్యడం అవసరమా? ఇంకా నయం తన కొడుక్కి ఈ దరిద్రం అంటుకోకుండా జాగ్రత్త పడింది.

కల్యాణి వదినగారి అవస్థను గమనించినట్టుగా పక్క వాళ్ళ ఇంట్లో నుండి వైరు లాగించి టేబుల్ ఫేను ఏర్పాటు చేయించింది. వాళ్ళకు ఇన్వర్టర్ ఉందట. ఆ ఫేను ముందు ఐదారుగురు సెటిలయిపోయారు. భానుమతికి ఏకాంతంగా సేద తీరే అవకాశం లేకపోయింది. తననీ వేడుకకు వెళ్ళమని ఫోర్స్ చేసిన భర్త మీద మొదటిసారి చాలా కోపం వచ్చింది. ఇక ముందు ఆయనగారి రిక్వెస్టును అస్సలు పట్టించుకోకూడదు...అనుకుంది గట్టిగా.

సాయంత్రం వేళకు కరెంట్ వచ్చింది. భానుమతి కోసం పందిరి పట్టెమంచం పై పక్క ఏర్పాటు చేయించింది కల్యాణి. భానుమతి భోజనం చేసి వచ్చేసరికి, ఆ మంచం మీద నలుగురు సెటిలైపోయి గురక పెడుతున్నారు. వాళ్ళని లేపలేక,

ఉసూరుమంటూ పక్కనే ఉన్న చాప తీసుకుని దుప్పటి పరుచుకుంది. జీవితంలో మొదటిసారి నిద్రపోకుండా రాత్రి గడిపింది.

ఉదయం అద్దంలో మొహం చూసుకుంటే తనేనా అన్నంత అనుమానం వచ్చిందామెకు. అందరితో పాటు ఆమె కూడా రెడి అయింది. ఎప్పుడెప్పుడు ఆ ఊరు నుండి బైట పడాలా అని ఎదురుచూస్తూ ఉందామె. హడావిడి మొదలయ్యింది. కల్యాణి కూతురు మాలతి అస్తమానూ అత్తా అత్తా అని తన అవసరాలు చూడ్డం ఎందుకో నచ్చడం లేదు. వీళ్ళంతా తను చదివించే కట్నం గురించే ఇలా రాసుకు పూసుకు తిరుగుతున్నట్టుగా ఉందామెకి. కల్యాణి భర్త మాటిమాటికి తనకు కొబ్బరి బొండాల నీళ్ళని, నిమ్మకాయ నీళ్ళనీ అందించడం, ఈ మర్యాదలన్నీ తనిచ్చే కాసుల కోసమే అని ఈసడించుకుంది భానుమతి.

కొబ్బరి ఆకులలో ఇంటి ముందు పందిరి వేసారు. అక్కడే నాలుగు బల్లలు వేసి వేదిక తయారు చేసారు. నాలుగు వైపులా దుప్పట్లు కట్టి మరుగు ఏర్పాట్లు చేసారు. దరిద్రం అంతా ఇక్కడే తాండవిస్తోంది ... చీదరించుకుంది ఆమె. అదే పైకి అంటే తనతో  ఖర్చు పెట్టిస్తారు వీళ్ళు .. అనుకుంటూ జరుగుతున్న తతంగం చూస్తూ ఓ కుర్చీలో కూర్చుని చూస్తోంది. మిగిలిన తోడి కోడళ్ళు తనను చూసి మూతి తిప్పుకోడం ఆమె గమనించక పోలేదు. ఎప్పుడెప్పుడు ఈ తంతు ముగుస్తుందా? ఎప్పుడెప్పుడు తను గిఫ్ట్ పిల్ల చేతిలో పెట్టేసి వెళ్ళిపోదామా అని ఎదురు చూస్తూ ముళ్ళమీద కూర్చున్నట్టుగా కూర్చుందామె. ఊళ్ళో వాళ్ళు ఒక్కొక్కళ్ళే వస్తున్నారు. వచ్చిన వాళ్ళంతా భానుమతి దగ్గరకు వచ్చి పలకరిస్తుంటే, తోడి కోడళ్ళు ముక్కు మూతి తిప్పుకుంటున్నారు.

“ఈ రోజుల్లో అత్తింటి వారిని ఎవరు పట్టించుకుంటున్నారు భానమ్మా! నీది, భాస్కర్ ది దొడ్డ మనస్సు. కల్యాణి ఎప్పుడూ చెబుతూ ఉంటుంది. మీ గురించి...” అంటు పొగడ్తలు కురిపించారు. అంటే తను ఊహించింది కరెక్టే...భాస్కర్ చాలా డబ్బు చెల్లెలి కుటుంబం కోసం ధారపోస్తున్నాడన్నమాట. కార్తీక్ కూడా తన మాట వినడు... ఈ తండ్రి కొడుకులను బాగానే బుట్టలో పడేసింది కల్యాణి. వాళ్ళు మండిపోతోంది భానుమతికి. ఫంక్షన్ మొదలవుతుంది అనగా అమెరికా నుంచి కార్తీక్ ఫోన్ చేసాడు.

“ఏరా! నీకూ మీ నాన్నకీ ఏం పనిలేదా?“ చాటుకు వెళ్ళి కొడుకును దులిపేసింది.
“నిన్ను చూసి అత్త చాలా సంతోషపడిపోయి ఉంటుంది కదా!” అన్నాడు కార్తీక్.
“మీ అత్త సంతోషం అంతా నన్ను చూసి కాదు. మీరు పంపే నోట్ల కట్టల మహిమ అని నాకు తెలుసు" అంది భానుమతి.
“తప్పమ్మా! అత్త గురించి అలా మాట్లాడకు.”
“ఏంతప్పురా! ఇక్కడ అందరూ చెప్పుకుంటున్నారు. నువ్వు, మీ నాన్న ఆవిడ గారికి ఎంత సొమ్ము ధారపోస్తున్నారో?"
“అత్త సొమ్ము అత్తకు ఇవ్వడం తప్పెలా అవుతుందమ్మా!"
“అత్త సొమ్మా! ఆవిడ దరిద్రం నాకు తెలియంది కాదు" కోపంగా అంది భానుమతి.
“నాన్న నాతో ప్రామిస్ చేయించారు. ఆయనకు బిజినెస్‌లో లాసొచ్చినప్పుడు అత్త తన పొలం, నగలూ అమ్మి నాన్నకు ఇచ్చిందన్న విషయం నీకు ఎప్పటికీ తెలియకూడదని. అత్త నాన్న దగ్గర మాట తీసుకుందట. 'ఇంత చేసి అంత చేసాం' అని చెప్పుకునే ఈ రోజుల్లో అత్త ఏం ఆశించింది మన దగ్గర?” కార్తీక్ మాటలు గాలితో పాటు ఆమె చెవుల్లో గింగురుమంటున్నాయి.

చేతిలోంచి ఖరీదైన మొబైల్ కిందకు జారిపోయింది.
"భానొదినా! చిన్నూని కూర్చోబెట్టాలి రా వదినా!" అంటూ వచ్చింది కల్యాణి.

కల్యాణి మోవిలో తను కాపురానికి వచ్చినప్పుడు ఎలాంటి గౌరవం కనబడిందో ఇప్పటికీ అలాగే ఉంది. ఇన్నాళ్ళు తను ఆడబడుచు వ్యక్తిత్వానికి ఎన్ని అర్థాలు వెతికింది. ఒక్కసారి కూడా అర్థం చేసుకునే ప్రయత్నం చెయ్యలేదు. ఆ చిరునవ్వు మోసం అనుకుంది.

"వదినా! పద" అంటూ కల్యాణి కంగారు పెట్టింది. తను నాలుగు సార్లు కట్టి వొదిలేసి పంపిన పట్టుచీర కట్టుకుంది. ఐశ్వర్యం తన పరం చేసి, దరిద్రం తను వరించింది కల్యాణి.

ఫంక్షన్ పూర్తయింది. వచ్చిన వారంతా తనను, తన భర్తనూ పొగుడుతుంటే మొదటిసారి సిగ్గేసింది.

చిన్నూ మెడలో వేసిన హారం తీసి ఇవ్వబోయిన కల్యాణిని కన్నీళ్ళతో అర్థించింది భానుమతి.

"కల్యాణీ! నిన్ను ఒక్కసారి ఆలింగనం చేసుకోనా" అంటూ ఆడబడుచును కౌగిలించుకుంది.

★★★

మూడు నెలల తర్వాత బావిలో నీళ్ళు తేటగా పైకి వచ్చాయి. వెనక వైపు పడిపోయిన గదులు ఊపిరి పోసుకుంటున్నాయి.

★★★0★★★

## కథామంజరి దీపావళి కథల పోటీలో ప్రత్యేక ప్రశంస పొందిన కథ



# దేవుడేం కావాలి?

వసుంధర

ఒట్టుకి విలువనిచ్చే సంప్రదాయం గొప్పదే. అనుసరించే మనమే ప్రమాదకారులం.

వృత్తి విభజన కోసం ఎప్పుడో ఏర్పాటు చేసిన కులవ్యవస్థ ఎంతో విశిష్టమైనదని అమెరికావాళ్లు కూడా ఒప్పుకుంటారు. మనం దాన్ని క్రమంగా వృత్తికి దూరం చేసి భ్రష్టు పట్టించి, సమాజానికి అరిష్టం చేశాం! ఒట్టు విషయంలోనూ ఇప్పుడంతకంటే ఎక్కువ జరుగుతోంది. ఏకంగా దేవుడికే ఎసరెడుతున్నాం!

నా పేరు తార. చాలా ఈజీ గోయింగు నేను. చదువంటే ఆసక్తి లేదు నాకు. కానీ ఠంచనుగా బడికెళ్లేదాన్ని. పరీక్షలు ప్యాసవడానికి సరిపడంత చదివేదాన్ని. చదువంటే ఎంపవర్మెంట్ అనేవాడు అన్నయ్య. నాకైతే ఇంటిపన్లు తప్పించుకుందుకు, అదీ ముఖ్యంగా ఆడపిల్లకు - చదువును మించిన సాధనం లేదనిపించేది. ఐనా ఇంట్లో నా బతుకేం పూలబాట కాదు. ఆడపిల్ల కదా - ఇంటిపనీ, వంటపనీ రావాలని అమ్మ అప్పుడప్పుడు నాకు పన్లు చెప్పేది. అప్పుడు బామ్మ కలగజేసుకుని, "పెళ్లయ్యేక అత్తారింట్లో ఎలాగూ సాగదు. అందాకా దాన్ని మనింట్లో సుఖపడనీ" అని మందలించేది. బామ్మ మందలింపంటే అది అమ్మకి ఆర్డరే.

ఐతే మాత్రం- ప్రజానాయకులే కోర్టు ఆర్డర్లు పట్టించుకోని రోజులివి. అమ్మ నాకు పనులు చెప్పే ప్రయత్నాలు చేస్తూనే ఉండేది. అప్పుడు నేను- ఓసారి తలనొప్పి, ఓసారి కడుపునొప్పి, ఓసారి స్లిప్‌పెట్టు- ఇలా ఏదో వంక పెట్టి తప్పించుకో చూసేదాన్ని. తల్లి ప్రాణం కదా, నమ్మడమే కాక- అమ్మ కాస్త కలవరపడేది కూడా.

అవతలివాళ్లని నమ్మించాలంటే అస్తమానూ ఒకే చిట్కా వాడకూడదంటారు. తెలివి వాడి కొత్త చిట్కాలు కనిపెట్టాలి. కానీ అమ్మకదా- ఈమాత్రం దానికి తన దగ్గర తెలివి వాడాలా అనుకునేదాన్ని. చివరికి అమ్మకి కూడా అనుమానమొచ్చి, "ఒట్టేసి చెప్పు. అప్పుడు నమ్ముతాను" అందోసారి. పక్కనే ఉంది బామ్మ, "దానిక్కూడా నీకులా అయిందానికీ కాందానికీ ఒట్లేసే అలవాటు చెయ్యకు" అని మందలించింది.

చీటికీ మాటికీ ఒట్లేస్తుందని అమ్మకి మా ఇంట్లో పేరు. బామ్మమీదేస్తే ఇంట్లో పెద్ద గొడవైపోతుంది. తల్లి ప్రాణం - చెప్పింది నిజమైనా సరే, పిల్లలమీద ఒట్టెయ్యడం విస్కనుకుంటుంది అమ్మ. తను వేసే ఒట్లన్నీ నాన్న మీదే!
"నీకు నా కొడుకేమైపోయినా ఫరవాలేదు" అని వాపోయేది బామ్మ.
అమ్మ వెంటనే మెళ్లోంచి మంగళసూత్రాలు తీసి కళ్లకద్దుకుని, "మహాపతివ్రతని. నామెడలో ఇవున్నంత కాలం, ఆయనకేం కాదు" అనేది. తనకి ఆత్మస్తుతి చేసుకునే అవకాశమిచ్చిందన్న కృతజ్ఞతతోనేమో, ఆ వెంటనే బామ్మ కాళ్లకు దణ్ణం పెట్టి, "అలాగని మీరు కూడా దీవించండి అత్తయ్యా!" అనేది.
ఏమైతేనేం, మా ఇంట్లో నేను ఒట్టెయ్యాల్సిన అవసరం రాకుండానే, నా డిగ్రీ అయింది. పెళ్లి కూడా అయింది. అప్పటికి బామ్మ పోయి ఏడాదయింది.

అత్తారింటికెడుతున్నప్పుడు అమ్మ నన్ను చాటుకు పిలిచి, "ఇన్నాళ్లూ జరిగింది కానీ, ఇకమీదట ఒట్టెయ్యకుండా నీకు సాగదు. ఎప్పుడైనా నీ మొగుడు నీ మాట నమ్మలేదనుకో. నీది అబద్ధమైనా సరే- వెనకా ముందూ ఆలోచించకుండా, అతని మీదే ఒట్టేసేయ్. చచ్చినట్లు నమ్ముతాడు" అని ప్రత్యేకంగా చెప్పింది.
అమ్మ అన్నింటికీ నాన్న మీదే ఒట్టెయ్యడం గుర్తొచ్చి, "అలా ఎందుకు నమ్ముతాడు?" అన్నాను.
"భార్య తను లేకుండా బ్రతకలేదు కాబట్టి, తన మీద అబద్ధపు ఒట్టెయ్యదని ప్రతి మగాడూ నమ్ముతాడు. అది మగాడి అహం" అంది అమ్మ.
అబద్ధమెందుకూ- పెళ్లి కుదిరినప్పట్నించే, నా ఆలోచనల్లో నేను మా ఆయనపై పూర్తిగా ఆధారపడిపోయాను. అందుకే, "సరే కానీ, అబద్ధపు ఒట్టేస్తే, మా ఆయనకేమవదా?" అన్నాను అనుమానంగా.
"దాందేముందీ- అబద్ధపు ఒట్టేసినప్పుడు దేవుడి గదిలోకెళ్లు. తిరుపతి వెంకన్న పటం ముందు నిలబడి లెంపలేసుకుని, అపచారం కాయమని వేడుకో. స్వామి కాపాడకపోతే మీ నాన్నమీదొట్టు" అంది అలవాటుగా.
"తిరుపతి వెంకన్నే ఎందుకు? మిగతా దేవుళ్లు పనికిరారా?" అడిగాను.
"భక్తితో ఏ దేవుణ్ణైనా కొలు. కానీ ఇలాంటివాటికి మాత్రం ఆయనొక్కడే దిక్కు. ఈ కలియుగంలో ఆపద మ్రొక్కుల వాడు ఆయనొక్కడే!" అంది అమ్మ.
అంత వివరంగా అడిగానా- కాపురానికి వెళ్లగానే ఆ సలహా మర్చిపోయాను.
కారణం మా ఆయన చంద్రానికి నేనంటే ఎంతిష్టమంటే- నేనేం చెప్పినా వెంటనే నమ్మేస్తాడు. ఒట్టెయ్యాల్సిన అవసరమే రాదు.
ఆయన్ని ఇంప్రెస్ చెయ్యడానికి నాకు సాహిత్యమంటే ప్రాణమని చెప్పాను. కామోసనుకుని నాకోసం పత్రికలు, పుస్తకాలు కొనడం మొదలెట్టాడు.
మాటవరసకి డెకరేషన్ ఇష్టమన్నాను. అంతే- డ్రాయింగురూంలోకి అద్దాల షోకేస్ చేయించాడు.
ఓసారి నోరు జారి మొక్కల పెంపకం మహా ఇష్టమన్నాను. అంతే- మా బాల్కనీ పూల కుండీలతో నిండిపోయింది.
నాకు నిజంగా ఇష్టమైనవి- టివి, ఇరుగుపొరుగులతో కబుర్లూనూ.

ఆ రెంటిమీదా ఇష్టంతో- వంటే పెద్ద బోరు నాకు. ఇంకా హాబీలు కూడానా!
అందులో నేను మరీనూ!
కొన్న పత్రికలు, పుస్తకాలు సీలున్నవి సీలుతోనే ఉండిపోతున్నాయి. లేనివి పుస్తకాల షాపువాడు కూడా ఆశ్చర్య పోయేటంతలా తళతళ మెరుస్తున్నాయి.
ఓసారాయన అడగనే అడిగాడు. నేను వెంటనే, "పుస్తకం ప్రాణమని చెప్పా కదండీ! నేను చదివింతర్వాత కూడా పుస్తకం అప్పుడే కొన్నట్లుంటుంది" అన్నాను.
నమ్మేశాడు కానీ ఓసారి పుస్తకానికి సీలు కూడా అలాగే ఉంటే మళ్లీ డౌటొచ్చి అడిగాడు. ఈసారీ జవాబుకు తడుముకోలేదు, "మన పనిమనిషి దీపిక పనులన్నీ వదిలేసి, పుస్తకాలు చదువుతూ కూర్చుంటోందండీ. వాటిని దానికన్నబడకుండా దాచేస్తున్నాను. తర్వాత ఇంటిపనుల్లో పడి వాటి విషయమే మర్చిపోతున్నాను" అని సంజాయిషీ ఇచ్చా. మళ్లీ నమ్మాడు.
షో కేసు విషయానికొస్తే- దాంట్లో బొమ్మల్ని రోజూ తుడవమని దీపికకి చెబుతాను. బొమ్మలైతే బైటకి తీస్తుంది కానీ, ఒకో రోజు దానికి మళ్లీ సర్దడానికి టైముండదు. అప్పుడు మన డ్రాయింగు రూం- అప్పుడే చిన్నపిల్లలాడుకుని వెళ్లిన గదిలా ఘోరంగా ఉండేది. దానికి నేను, "షో కేసు చూస్తే బజార్లో షోరూమ్సు గుర్తుకు రావాలని, వంచిన నడుమెత్తకుండా సర్దుతానా, తర్వాత దీపిక చీపురట్టుకుని వెడుతుంది. గది తుడుస్తూ, షో కేసు ఇటు కదిపి, అటు కదిపి క్షణాలమీద గదిని ఇలా మార్చేస్తుంది. సంగతేంటంటే, దానికి మన షో కేసులో బొమ్మలంటే మహా ఇష్టం. మళ్లీ సర్దేద్దామనే బయటకు తీస్తుంది. చివర్లో మర్చిపోయి వెళ్లిపోతుంది" అని చెప్పా. నమ్మేశాడు.
అసలు సమస్య కుండీలో మొక్కలు. మట్టిలో పాతినవైతే ఫరవాలేదు కానీ, కుండీలోని వాటికి పాపం, మనం పోస్తేనే నీళ్లు. నాకు వాటిమీద జాలైతే ఉంది కానీ, ఆ జాలి ప్రజానాయకులు పేదలికంమీద పడేలాంటిదే.
ఫలితంగా కుండీలో మొక్కలు ఎండిపోవడం, ఆయన గమనించడం జరిగింది. "ఇంటిపన్లతో నాకు క్షణం తీరుబడుండదు. కుండీల్లో నీళ్లోసే పని దీపికకి అప్పజెప్పా. పోస్తున్నానంటే కామోసనుకున్నా" అని సంజాయిషీ ఇస్తే నమ్మేశాడాయన.
అలా నేను సంజాయిషీలు ఇస్తూనే ఉన్నాను. పొరపాట్లు జరిగిపోతూనే ఉన్నాయి.
కొన్నాళ్లిలా గడిచేక మా ఆయన ఓ రోజన, "దీపిక వరస నాకు నచ్చలేదు. గట్టిగా వార్నింగివ్వు. ఓ నెల్లాళ్లు చూద్దాం. మారిందా సరే, లేకపోతే ఓ నెల్లాళ్ల తర్వాత దాన్ని మానిపించి వేరే మనిషిని పెట్టుకుందాం" అన్నాడు.
నిజానికి మారాల్సింది నేను కానీ, దీపిక కాదు. నెల కాదు, ఏళ్లు గడిచినా నేనింతే!
ఏదోరోజున బండారం బయటపడక తప్పదు కానీ, దీపికని మానిపిస్తే ఇప్పుడే ఆయనకి నిజం తెలిసిపోతుంది. అందుకని, "ఇల్లు తుడిస్తే ఎక్కడా మచ్చుకొక్క దుమ్ము రేణువుండదు. గిన్నెలు తోమిందంటే, అది తోమిందా, లేక ఇప్పుడే కొని తెచ్చామా అనిపించేంతలా మెరిసిపోతాయి. ఇక బట్టలుతికిందంటే, ఏంచెప్పను? డిటర్జెంటు కంపెనీవాళ్లు చూస్తే- మనమిచ్చేదానికి పది రెట్లిచ్చి, పబ్లిసిటీకి ఎగరేసుకు పోతారు. కాబట్టి మిగతా విషయాల్లో ఎలాగోలా సర్దుకు పోదాం లెండి" అని దీపికని ఆకాశానికి ఎత్తేశాను.

నిజానికి దీపిక ఏ పనీ శ్రద్ధగా చెయ్యదు. శ్రద్ధగా చేసినా బాగా చెయ్యదు. దాని మూడ్ బాగున్నప్పుడు పైకి విసుక్కుంటాను. లేనప్పుడు మనసులో అనుకుంటాను.

దీపికే కాదు. మా చుట్టుపక్కల అందరు పనమ్మాయిలూ అంతే! ఇరుగుపొరుగులతో మాట్లాడేటప్పుడు సగం సమయం పనిమనుషులపై అక్కసు వెళ్లబోసుకుందుకే సరిపోతుంది.

నేను దీపికని ఇంతలా పొగిడిన విషయం ఏ సీసీ కెమెరాలకో పట్టుబడి మా వీధిలో ప్రచారమైందంటే- నాతో మాట్లాడేవారుండరు.

వాళ్ల సంగతి అలా ఉంచితే, అంత అక్కసు ఉన్న మనిషిని ఇంతలా పొగడాల్సి రావాల్సిన అసహాయత పుట్టించిన ఉక్రోషం- అది మాటలకందేనా!

ఏంచేస్తాను- దీపికకి నవ్విన ఊళ్లే పట్నాలు. నాకు- 'కుచ్ పానే కేలియే కుచ్ కోనా పడ్తాహై'.

కానీ ఇలా ఎన్నాళ్లు?

కొత్త మోజులో మరికొన్నాళ్ళు నమ్మాడు కానీ, క్రమంగా మా ఆయనకి నామీద అనుమానం మొదలైంది.

ఒకరోజు నన్ను టివి చూడ్డం తగ్గించమని కాస్త గట్టిగానే మందలించాడు.

నేను నేనేగా, అసలు టీవీయే చూడనని దబాయించాను. కానీ ఎంతచెప్పినా నమ్మలేదు. చివరికి అమ్మ సలహా గుర్తొచ్చి, "మీమీదొట్టు. మీరు లేనప్పుడు టివి చూసే టైమే దొరకదు నాకు" అన్నాను.

అదే నేనాయనపై వేసిన మొదటి ఒట్టు. దాంతో నోరెత్తలేదాయన.

అమ్మ సలహా పని చేసిందని సంతోషించాను కానీ- ఆ రాత్రే ఆయనకి జ్వరమొచ్చింది.

టెంపరేచరు నూటరెండుంది. సమయానికి ఇంట్లో పేరాసిటమాల్ టాబ్లెట్సు కూడా లేవు.

ఇది ఒట్టు దెబ్బ కాదు కదా అని భయమేసి వెంటనే దేవుడి గదిలోకెడితే- అక్కడ రాముడు, కృష్ణుడు, శివుడు ఫొటోలే తప్ప తిరుపతి వెంకన్నది లేదు. ఏ దేవుడైనా ఒకటేగా అని సరిపెట్టుకుని, తప్పు కాయమని వేడుకున్నాను.

కానీ మర్నాడుదయం పక్కింట్లో అడిగి తెచ్చిన పేరాసిటమాల్ బిళ్ళ వేసుకున్నాకే ఆయన జ్వరం తగ్గింది.

"నువ్వు నామీదేసిన ఒట్టు అబద్ధం. అందుకే ఇలాగైంది. ఇంకెప్పుడూ అలాంటి ఒట్లెయ్యకు" అన్నాడాయన.

నేనా మాటలు పట్టించుకోకుండా, "మన దేవుడి గదిలో తిరుపతి వెంకన్న ఫొటో లేక అలాగైంది కానీ, మీ జ్వరానికి నా ఒట్టేం కారణం కాదు. రేపు ఆఫీసునుంచొస్తూ వెంకన్న ఫొటో ఒకటి కొనుక్కు రండి" అన్నాను.

"మధ్య ఈ తిరుపతి వెంకన్న ఎక్కణ్ణించొచ్చాడు?" అని ఎక్కదీస్తాడని భయపడ్డాను కానీ, ఆయనా ఆ దేవుడి భక్తుడే. సరేనన్నాడు.

ఆ సాయంత్రమే అమ్మనుంచి ఫోను.

నాన్నకి గుండెనొప్పి వచ్చిందిట. హాస్పిటల్లో ఐసియులో ఉన్నాట్ట. స్ట్రోక్ మైల్డుగా వచ్చిందనీ, ఆపరేషను అవసరపడకపోవచ్చనీ అన్నారుట డాక్టర్లు.

"మైల్డ్ స్ట్రోకే కదా, ఈ రోజుల్లో అదేం ప్రమాదం కాదు" అని ధైర్యం చెప్పి మా ఆయన నన్ను పుట్టింటికి పంపాడు. వీకెండులో తనొచ్చి ఓ సారి నాన్నని పలకరించి నన్ను తీసుకెడతానన్నాడు.

నేనెళ్లేసరికి నాన్న హాస్పిటలల్నించి డిస్చార్జయి ఇంట్లోనే ఉన్నాడు. ఆయన్ని చూస్తూనే, "ఫిట్నెసులో, హెల్త్ డిసిప్లిన్లో ఎవరైనా నీ తర్వాతే! నీకు హార్టెటాకేంటి నాన్నా!" అని భోరుమన్నాను.

"నావరకూ నేను జాగ్రత్తగానే ఉంటున్నాను. దానికి మీ అమ్మ సహకారం కూడా కావాలి కదమ్మా! తనేమో నోరిప్పితే అబద్ధాలు. నిలదీస్తే అదే నిజమని నామీద ఒట్టేసేస్తుంది. ఒట్టెయ్యకే అంటే వినదు. అలా ఒకటా రెండా, కొన్ని వందలైనా ఒట్లేసుంటుంది. ఆ ప్రభావం వదుల్తుందా? ఆ ఒట్లన్నీ కలిసి ఇప్పుడు ఏకంగా నా గుండెకాయనే కొట్టేశాయి. ఇంకోసారి ఒట్టేసిందంటే, ఆపరేషను తప్పదు. ఇకనైనా ఆ అలవాటు మానుకొమ్మని మీ అమ్మకి నచ్చజెప్పమ్మా!" అన్నాడు నాన్న.

నాన్న ఒట్టుని నమ్మడు. కానీ ప్రాణప్రమాదంలోనూ తన హాస్యస్ఫూర్తిని వదలడాయన.

మామూలుగా ఐతే నవ్వేదాన్నే! కానీ అప్పుడు నాకు మా ఆయన నా ఒట్టు గురించి అన్న మాటలు గుర్తొచ్చి కొంచెం భయమేసింది.

తర్వాత అమ్మ దగ్గరికెళ్లి నాన్న అన్న మాటలు చెప్పి, "తిరుపతి వెంకన్నని అపరాధం మన్నించి కాపాడమని ప్రార్థిస్తే, సమస్య తీరిపోతుందని చెప్పేదానివి. మరి నాన్నకిలా అయిందేమిటి?" అని వాపోయాను.

అమ్మ మొహం పాలిపోయింది, "మీ నాన్న నీతోనే కాదు, నాతోనూ ఇదే మాటన్నారు. నాకు నిజంగా మనసు పాడయింది. నిన్న రాత్రి ఆ విషయమే ఆలోచిస్తూంటే ఎప్పుడో కాస్త కునుకు పట్టింది. అప్పుడు తిరుపతి వెంకన్న కలలోకొచ్చాడు" అంది.

కలలో అమ్మ స్వామిని అదే ప్రశ్న అడిగింది.

దానికి స్వామి, 'ఏం చెప్పేదమ్మా! ఈ మధ్య దేశనాయకులందరి కళ్లూ నామీద పడ్డాయి. వాళ్లు నామీద ఒట్టేసి, జనాలకి ఎడాపెడా అడ్డమైన వాగ్దానాలూ చేసేస్తున్నారు. వేసిన ఒట్టు సాక్షాత్తూ ఆ దేవుడిమీద అని తెలిసి కూడా వాటిని నిలబెట్టుకోరు, నిలబెట్టుకోలేదని పశ్చాత్తాపపడరు. ఎంత దేవుడికైనా తన్నుమాలిన ధర్మం ముండకూడదుగా! ఆ ఒట్టు దుష్ప్రభావంనుంచి బయటపడ్డానికే నా మహిమంతా ఖర్చయిపోతోంది. ఇక భక్తుల్నేం కాపాడగలను?" అన్నాడట.

"అలాంటప్పుడు నావంటి సామాన్యుల సంగతేమిటి స్వామీ?" అనడిగిందిట అమ్మ.

"అది మీ చేతుల్లోనే ఉంది. నామీద ఒట్టేసి అబద్ధాలు చెప్పే అలవాటు మానుకోండి. అప్పుడు మిమ్మల్ని మీరు కాపాడుకోగల్గుతారు. తర్వాత మీలాంటి పౌరులందరూ కలిసి, నామీద ఒట్టెయ్యకుండా నాయకుల్ని ఆపండి. లేదూ నన్ను నేను కాపాడుకుందుకు నా మహిమ కూడా చాలదు. అప్పుడు నేనిక ఆపద మ్రొక్కులకు కూడా పనికిరాకుండా పోతాను" అన్నాడట.

తల పట్టుకున్నాను.

మనల్ని సమస్యల్నించి కాపాడే దేవుడు- తనకి సమస్య వచ్చిందనీ కాపాడమనీ మనని వేడుకుంటున్నాడు.

మనం పట్టించుకోక పోతే- పాపం, దేవుడేం కావాలి?

★★★0★★★

# కోటకట్టడం ఎలా?

## అవసరాల రామకృష్ణారావు



మనకి తెలియకపోతే తెలిసినవాళ్లని చూసి నేర్చుకోవాలి. సూటిగా చూడడం గాని, ధైర్యంగా ఆలోచించడం గాని, నిండుగా నిజం చెప్పడంగాని మరచిపోయి, 'రోజుకో దేవరా, వీధికో జాతరా ' విషయంలో మాత్రమే ఆసక్తి, అభివృద్ధి చూపించే, సాధించే, 'సర్వతో ముఖ వ్యభిచార సంస్కృతి' లో బతుకుతున్న జనంలో ఎవరికి వారుగా నిలబడాలన్నా కొన్ని స్వయం ఉపాధి పథకాలు తప్పవంటుంది పంకజం. ఆరోగ్యమూ, వయసూ ఉన్న ఆడదానికి ఒంపులూ సొంపులూ ఒకరు యిచ్చేదేమిటి, అవే వస్తాయి. వన్నెచిన్నెలు మాత్రం ఎవరికి వారు అమర్చుకోవాలి. జోహారు హారాలు మెడలో పడాలంటే ఈ పిదపకాలంలో కొంత పథక గేలం తప్పదు మరి....

పంకజం మొగుడు సుందరం పదిహేను రోజుల కిందట అతని చెల్లెలు పార్వతి నుంచి వచ్చిన ఉత్తరం ఆమె చేతి కిచ్చాడు. మొగుడు పోయాక అత్తారింట్లో తన బతుకు బొత్తిగా అంటగిన్నెలకి అంకితమైపోయిందనీ, ఆ ఆరళ్లు భరించలేక పోతున్నాననీ వెంటనే వచ్చి తీసికెళ్లమనీ ఇంచుమించు ఏడుస్తూ రాసినది అది. పంకజం నెత్తిన పిడుగు పడింది. నిండా పాతికేళ్లు లేవు పార్వతికి. తన పెద్ద కొడుకు బాబీకంటే మహా అయితే అయిదారేళ్ల పెద్ద. ఇంకా తన పిల్లల చదువులూ, పెళ్ళిళ్లూ అన్నీ ముందే ఉన్నాయి. ఈ కరువు రోజుల్లో యిప్పటికే కటకట అయిపోయింది. ఒక విధవరాలిని అదనంగా యింట్లో తెచ్చి పెట్టుకుని యావజ్జీవం పోషించాలంటే మాటలా! 'ఎవరి కర్మ వారిది' అనే సిద్ధాంతం మనది. 'అందరి కర్మాకలి అందరిదీ' అనే వెర్రి వేదాంతం ఎలా నప్పుతుంది యిక్కడ? 'మీ యింట్లో లైటు ఆరిపోయిందని మమ్మల్నీ ఆ చీకటి పంచుకోమంటే ఏం న్యాయం?' అని కలవరపడింది పంకజం మనసు. "ఏమిటి ఆలోచిస్తున్నావ్?' అన్నాడు సుందరం. 'పాపం పార్వతి స్థితి తలచుకుంటే ఒళ్లు నీరై పోతోందండీ .... ఆ ఉత్తరం అందగానే అలాగే ఆఫీసు నుంచే ఎక్స్ ప్రెస్ బస్ అందుకోక యింటికి వచ్చి నాతో చెప్పి పెర్మిషన్ తీసుకోవాలా!' అని మృదువుగా గోముగా అతని చెయ్యి నిమిరింది. నెంబర్ వన్ కి వెళ్ళాలన్నా తన పెర్మిషన్ తీసుకుంటారని తెలిసినా, 'ఏడడుగుల' కన్న 'మూడు నిద్దర్లు' బాగా 'పే' చేస్తుందని పంకజం గ్రహించి రెండు దశాబ్దాలు దాటింది మరి. అందుకే అయి ఉంటుంది, వెంటనే వెళ్లి చెల్లెల్ని తీసుకురావాలనే అతని ఆ రాత్రి ఆతృత మర్నాడు తెల్లారేసరికి లేదు. పొద్దున లేస్తూనే "దాని అత్తారు బొత్తిగా కసాయి వెధవలు. వాళ్లతో నేను నెగ్గుకు వచ్చి దాన్ని తీసుకు రాగలనో లేదో! అయినా మంచికో చెడ్డకో ఒకళ్ల చేతుల్లో పెట్టాక మన పెత్తనం ఏముందీ..... పోనీ ఓసారి నువ్వే వెళ్ళి అన్నీ మాట్లాడి వస్తేనో!'

'యముడి పెద్దన్న దమ్ముడిలాంటి మొగుడితో అయితే కష్టంగాని నాథుడు నాన్నుడుగాడు అయితే అంతకన్న గృహలక్ష్మి కోరే వరం ఏముంటుంది?' అని లోలోన సంతోషించినా 'బాగుందండీ మీకు పార్వతి ఆఖరి చెల్లెలు. వాళ్లు అలా రాసి

రంపాన పెడుతూ ఉంటే ఏం పట్టనట్టు ఊరుకుంటారా! పాపం చిన్నపిల్ల, ఎంతగా మనసు కష్ట పెట్టుకోకపోతే అంతగా రాస్తుంది? రాతిగుండె మొగవాళ్లు. మీలా నే నెలా ఊరుకోగలను. వెంటనే వెళ్ళి, నాలుగూ దులిపేసి మరీ తీసుకొచ్చేస్తాను. మన పిల్లే అయితే చంపేస్తుంటే ఊరుకుంటామటండీ!' అని అప్పటికప్పుడు, యింకా సుందరం మనసూ గుడ్లూ అప్పగించి చూస్తూ ఉండగానే, పంకజం ప్రయాణం కట్టేసింది.

నిజం చెప్పాలంటే పార్వతి అవస్థ ఆమె తెలియపరచిన దానికంటే అధ్వాన్నంగా ఉంది. 'ఏదో ముప్పొద్దులా చాకిరీ చేస్తున్నా వేళకి ఇంత తిండి పడేస్తున్నారు. అదీ లేనివాళ్ళని ఎందర్ని చూశాం కాదు!' అని లోపల్నుంచి ఉబికి వస్తున్న జాలిని కేక వేసి లోపలికి తోసింది పంకజం. 'ఎంత చిక్కిపోయావే నా తల్లీ ' అని పైకి మాత్రం కౌగలించుకుని కన్నీళ్ళు కానుకగా సమర్పించింది. అంతమంది జనం అనుక్షణం కాపలా ఉన్న ఆ సమిష్టి కుటుంబంలో ఆరోజు అర్ధరాత్రి తప్ప వాళిద్దరికీ ఏకాంతం కుదరనేలేదు.

'నెలరోజులై ప్రయత్నిస్తున్నాను వదినా ఆ ఉత్తరం రాసి, నా మటుకు నేనే పోస్టు చేద్దామని. ఆయన బతికున్నప్పుడే అంతంతగా ఉండేది ఇంట్లో నా స్థానం. ఇప్పుడు నీ కళ్లలో నువ్వే చూశావుగా. నిజంగా ఆ ఉత్తరం అన్నయ్యకి అందాలని ఎన్ని దేవుళ్ళకి మొక్కానో! ఇంకో రెండ్రోజులు నువ్వు ఆలశ్యం చేసి ఉంటే ఏ నుయ్యో గొయ్యో చూసుకుని ఉందును. నిన్ను చూసి నా పోయిన ప్రాణం లేచి వచ్చిందనుకో..... ఈ యమకూపం నుంచి నన్నెలా బయటకి లాగుతావో...." అని అతి దీనంగా విలపిస్తున్న ఆడపడుచు భుజం మీద మృదువుగా చెయ్యి వేసి ధైర్యం చెబుతూ చెబుతూనే నేర్పుగా పక్కదారి పట్టించిందా ఫక్తు జాణ.

'ఇక్కణ్ణుంచి ఇప్పుడే ఇలాగే మనింటికి తీసికెళదామనే నేను వచ్చాను పార్వతమ్మ తల్లీ! కాని ఇండియాలో ఆడదై పుట్టడం కన్న అండమానులో మానై పుట్టడం నయం. ఒకరితో చెప్పుకోలేనంత హైన్యం తల్లీ మన బతుకులు .... ఇంతగా వెట్టిచాకిరీ చేయించి నిన్ను నీచాతినీచంగా చిత్రహింసలకి గురిచేస్తున్నా మీ అత్తింటివారికి ఓ నీతి ఉంది. మావగారూ, బావగార్లూ, మరుదులూ ఎందరు మగజనం మీ యింట్లో! మళ్ళీ ఒక్కొక్కరు జమాజట్టీల్లా ఎలా ఉన్నారు. అంతా తాటిచెట్ల పాలెంలో ఉండవలసిన సరుకు! నిన్నో దాసీలా చూడటం నిజంగా తప్పే. కాని పోతరించిన పోతపోసిన పుత్తడి బొమ్మలా ఉన్నావే, నిన్నో దేవదాసీలా చూసుకుంటే అప్పుడెలా ఉండునంటావ్? వాళ్లకా కాముక దృష్టి లేకపోవటం ఎంత అదృష్టం అంటావ్? చిన్న పిల్లవి నీకెలా చెప్పనే తల్లీ!'

ఏదో వినకూడనిది వింటున్నట్టు వింతగా పంకజం వైపు చూసింది పార్వతి. ఆ ఆశ్చర్యపు వేడిలో ఆమె బుగ్గమీది కన్నీళ్లు ఆవిరైపోయాయి. అంతకంటె అత్యాశ్చర్యకరంగా వదిన బుగ్గమీంచి జారుతున్న కన్నీళ్లు చూసింది.

"అదేమిటి వదినా నువ్వు ఏడుస్తున్నావా?'

"ఆడపుట్టుక పుట్టేక ఏడవక ఏం చెయ్యమన్నావు? నాకు నా తొలి సంతానం ఆడదే అయితే ఈ సరికి అమ్మమ్మని అయిఉందును. అయినా ఈ క్షణం నా శీలానికి నా స్వంత యింట్లో రక్షణ లేదు!!

వెయ్యి ఒట్లు వేయించుకుని పంకజం ఆ సంగతి పార్వతికి వివరించింది.

"మీ అన్నయ్య సంగతి ఎరుగుదువు కదా.... అరచేతిలో అగ్గెరగరు. అందరూ తనలాంటి అమాయకులే అనుకుంటారు.. పోనీ ఒకరిమాట వింటారా, తను ఎరిగిన మేఘసందేశంలో రామారావే హీరో. వద్దు మహాప్రభో అంటే వినక ఓ రౌడీ వెధవకి మన వీధిగది అద్దెకిచ్చారు. అది వీధి గది కదా, అది దాటి ఇంట్లో ఆడవాళ్లు బయటకి వెళ్లాలంటావా, పోనీ మనింటి కొచ్చిన ఆడవాళ్లు లోపలికి రావాలంటావా! పదిహేనూ నలభై అయిదు మధ్య ఏ వయసుదైనా వాడికి చాలు! చూపు తప్పించుకోలేదు. వాడి పోకిరీచేష్టలూ రౌడీ వేషాలూ చూసి ఆ వాడవాడ ఆడ

జనమంతా ఎప్పుడేం చేసిపోతాడో అని గుప్పెట్లో ప్రాణాలు పెట్టుకుని గడుపుతున్నారనుకో. పనిపిల్ల పని మానేసింది. పెళ్ళాం చేత పాలు పంపించే మన పాలవాడు కుంటివాడైనా పాపం అలాగే, వాడే తెస్తున్నాడు. ఆ మదపిచ్చిగాడి చెయ్యి నా భుజంమీద ఎప్పుడు పడుతుందో అని ఈ వయసులో సహా నాకు కంటికి నిద్ర రావడం లేదు! "

'ఒక్క వెధవ అంటున్నావ్, వీళ్లు చూస్తే బండెడు బలగం వీళ్ల లో ఒక్కరికయినా ఎలాంటి వాళ్లు కావొచ్చు కాని ఆలాంటి బుద్ధులు లేవు సుమా! ఇంకా నయం, నేనే ఏ కబురూ లేకుండా వచ్చేద్దామనుకునే దాన్ని, వచ్చేశాను కాను!' అని గుండెని రాసుకుంటున్న పార్వతిని చూసి తృప్తిగా నిట్టూర్చింది. పంకజం.

'అదేమిటి ఒక్కర్తివే వచ్చావ్!' అన్నాడు తిరిగొచ్చిన పంకజాన్ని చూసి సుందరం!

'అబ్బ, ఎందుకంత గొంతుక, నేనేం చెప్పినా కిట్టనట్టు ఉంటుంది. మీ మటుకు మీరే వెళ్లి కళ్లతో చూసి వస్తే నాకీ చెప్పే దురవస్థ తప్పి ఉండను. ఆ అమ్మాయి రాసింది ఒకటి, అక్కడ జరుగుతున్నది ఒకటి .... మరెవరికి చెప్పనని నామీద ఒట్టు వేస్తేనే నా నోరు విప్పేది' అంటూ... పడక గదిలో పరమ రహస్యం అందించింది.

'మొగుడు పోయిన ఈ ఆర్నెల్లకే మీ చెల్లెలు బొత్తిగా చెడిపోయింది. నన్నొకటి కొడితే కొట్టండి, నా చెవులతో విన్నదే కాక నా కళ్లతో చూసింది ఇది. వావివరసలు లేవు సరికదా రిటైరయిన మావగార్నయినా మీసం సరిగారాని మరిది గార్నయినా రెచ్చగొట్టే పిచ్చి స్థితిలో ఉంది. ఆ ఆడాళ్ళందరూ కలిసి చితక బాది ఉత్తరం రాయించారుట! పోన్లెండి ఏదో పసిపిల్ల .... ఇంటికి తెచ్చి బుద్ధి చెప్పుకుని మళ్లీ పెళ్లి చేసి దార్లో పెట్టడం మన ధర్మం. బతికి లేరుగానీ అత్తగారూ మామగారూ ఉంటే చూస్తూ ఊరుకుని ఉండరు కదా! ఎంత ప్రయత్నించినా నాతో వచ్చింది కాదు. అలాగని ఆగగలదనా ఆడప్రాణి! శలవలకని ఇవాళో రేపో బాబీ దిగుతాడుగా, వాణ్ణి పంపిద్దాంలెండి.' అని తను కావాలని తెచ్చిన కొడుకు ప్రసక్తి భర్త మీద ఎలా పనిచేసిందో రెప్పవాల్చకుండా మొగుడి మొహంలోకి చూస్తూ కూచుంది పంకజం.

పందొమ్మిది నిండాయో లేదోగాని పాతికేళ్ళని చెప్పినా ఎవరూ నమ్మనంతగా ఎదిగిపోయాడు బాబీ. వాడు వెంటపడని ఆడపిల్ల లేదనీ, రెండు వార్నింగులూ, మూడు దేహశుద్ధి సన్మానాలూ అప్పుడే అందుకున్నాడని తండ్రికి నమ్మకంగా తెలిసింది. మేనత్తని తీసుకురమ్మని పంపిస్తే యిద్దరూ యిటు వచ్చేనా, ఆటు లేచిపోయేనా! పెడుతున్న శ్రాద్ధాలు చాలకనా ఈ కొత్త తద్దినం.

'నే నేదో చూసుకుంటాలే, నీ కన్నిటికీ తొందర' అని అనవసరంగా చికాకు పడుతున్న మొగుణ్ణి చూసి 'అమ్మయ్య' అని సంతృప్తిపడింది. పంకజం.

ఆయినా అక్కడితో ఆపడం పంకజానికి నచ్చని రాజకీయం. ఇరుగూ పొరుగూ నోరు కట్టడం కూడా ఓ అవసరమైన విషయమే. ఏ పొద్దువాలిన వేళో కొళాయి నీళ్లు పట్టుకోడానికి ఆ యింటికెదురుగా అందరు అమ్మలక్కలూ మూగే వేళ చూసుకుంటుంది. 'ఇదుగో పిన్ని గారూ, మా ఆడపడుచు అత్తగారికి పిల్లని ఓసారి పంపమని ఉత్తరం రాశా నండీ... వాళ్లు బొత్తిగా కిరాతకులు. ఏం రొస్తే ఏం తప్పో.... వినిపిస్తాను.....పెద్దలు ఎక్కడేం తప్పుందో చెప్పరూ! అన్నట్టు మొన్న మీరు పంచదార అడిగారు కదూ, ఉండండి తెస్తాను' అని లోపలికి పరిగెడుతుంది!

★★★0★★★

వీలైతే సంచికపై మీ అభిప్రాయాలను మాకు తెలియచేయండి.



# దీపావళి శుభాకాంక్షలతో ..

కథామంజరి బృందం